

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 11-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 103 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, తిథి: పాడ్యమి రా.2.09 తదుపరి విదియ; నక్షత్రం: పూర్వాషాఢ ఉ.5.56 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: మ.2.09-3.48, దుర్ముహూర్తం: ఉ.8.27-9.19, మ.12.46-1.38, అమృతఘడియలు: రా.12.01-1.40, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 5.51, సూర్యాస్తమయం: 6.49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కల్తీ కల్లుకు మరో ఇద్దరు బలి

ఎనిమిదికి పెరిగిన మృతుల సంఖ్య

మరో 35 మందికి వివిధ ఆస్పత్రుల్లో వైద్యం

నలుగురి అరెస్టు.. రెండు దుకాణాల సీజ్

ఘటనపై ఆగస్టు 20లోగా నివేదిక ఇవ్వాలని హెచ్ఆర్సీ ఆదేశం 3



విలేకరుల సమావేశంలో క్యాబినెట్ భేటీ నిర్ణయాలను వెల్లడిస్తున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు
42% రిజర్వేషన్లు

ఆర్డినెన్స్ మార్గంలో అమలుకు మంత్రివర్గ నిర్ణయం

పంచాయతీరాజ్ చట్టం-2018కు సవరణలు

మండలం, జిల్లా, రాష్ట్రం యూనిట్లుగా రిజర్వేషన్లు

ఆర్డినెన్స్ సంగతి ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

మరో 22,033 కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు

ఎమిటీ, సెయింట్ మేరీలకు వర్సిటీల హోదా

3 అధునాతన గోశాలల ఏర్పాటుకు నిర్ణయం

నిర్వహణపై అధ్యయానికి సీఎస్‌తో త్రిసభ్య కమిటీ

నాలుగు గంటలపాటు సాగిన క్యాబినెట్ భేటీ

సామాజిక విప్లవానికి నాంది.. బీసీలకు 42% రిజర్వేషన్లతో ఎన్నికలు చరిత్రాత్మకం: మహేశ్‌గౌడ్

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్రంలో అమలులో ఉన్న పంచాయతీరాజ్ చట్టం-2018ను సవరించి, ఆర్డినెన్స్‌ను తేవడం ద్వారా ఈ రిజర్వేషన్లను వర్తింపజేస్తారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి, తమ నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన మాటకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రివర్గం ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. మధ్యాహ్నం 3.30 నుంచి నాలుగు గంటలపాటు సుదీర్ఘంగా సాగిన సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. రెవెన్యూ మంత్రి

మిగతా 13వ పేజీలో...

సీలింగ్ తీసేసి.. రిజర్వేషన్ల పెంపు

పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేయనున్న ప్రభుత్వం

తర్వాత గవర్నర్ ఆమోదానికి..

అనంతరం ఆర్డినెన్స్, జీవో

దాని ప్రకారమే స్థానిక ఎన్నికల నిర్వహణ

'క్యాబినెట్'కు అడ్వొకేట్ జనరల్ సలహా తీసుకున్న మంత్రివర్గం

కోర్టులో కేవియట్‌కు సిద్ధం 13

ముందు పరిషత్ ఎన్నికలే!

ఆ తర్వాతే పంచాయతీ..

ఆర్డినెన్స్ వచ్చిన పది రోజుల్లో రిజర్వేషన్ల ఖరారు

ఆ వెంటనే ఎన్నికల షెడ్యూల్!

ఆగస్టు నెలాఖరులోగా పరిషత్, సర్పంచ్ ఎన్నికల పూర్తి!

కొండా మురళిపై చర్యలు తీసుకుంటారా.. లేదా?

నియోజకవర్గాల్లో వారి జోక్యం ఎక్కువైంది

వారిలా మేం అన్ని పార్టీలూ మారలేదు

బాధితులమైన మమ్మల్నే కమిటీ ముందుకు పిలవడం మరింత అవమానకరం 12

టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ముందు ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేల అసహనం

వారి అభిప్రాయాల్ని రికార్డు చేసిన కమిటీ

మీ పనులూ పదేపదే గుర్తుచేయాలా?

కొందరు ఐఏఎస్‌ల తీరుపై సీఎం ఫైర్ 13

దుబాయి రియల్ ఎస్టేట్‌లో మనోళ్ల పెట్టుబడులు..
ఈడీ నోటీసులు



అవినీతి సొమ్ముతో యూఏఈలో ఏపీ, తెలంగాణ నేతల స్థిరాస్తుల కొనుగోలు

క్రిప్టో, హవాలా మార్గాల్లో చెల్లింపులు.. అద్దె రూపంలో ఏటా 10-15% రాబడి

సంపాదనను రిటర్నుల్లో చూపకుండా పన్ను ఎగవేస్తున్నవారిపై ఐటీ కన్ను

రహస్యమార్గాల్లో వివరాల సేకరణ.. వాటి ఆధారంగా నోటీసులు ఇస్తున్న ఈడీ

ఆదాయ పన్ను ఎగవేతలను పకడ్బందీగా అడ్డుకునే క్రమంలో భాగంగా పటిష్ఠ నిబంధనలతో పట్టు బిగిస్తున్న సర్కారు.. చట్టాల్లో లొసుగులను వాడుకుని, అడ్డదారి మార్గాల్లో అడ్డగోలుగా సంపాదించిన అక్రమ సొమ్ముతో విదేశాల్లో స్థిరాస్తులను కొనుగోలు చేస్తున్న అక్రమార్కులపై దృష్టి సారించింది! అందులో భాగంగానే.. మనదేశానికి అత్యంత సమీపంగా ఉన్న దుబాయిలో ఇళ్లు కొంటున్నవారి వివరాలు సేకరిస్తోంది. అలా ఇప్పటికే గుర్తించినవారికి ఏడాది క్రితమే ఆదాయపన్ను (ఐటీ) శాఖ నోటీసులు పంపగా.. ఇప్పుడు ఈడీ నుంచి కూడా వారికి శ్రీముఖాలు అందుతున్నాయి. అలా అందుకుంటున్నవారిలో పలువురు తెలుగు రాజకీయ ప్రముఖులు ఉన్నట్టు తెలుస్తోంది! 12

బెట్టింగ్ యాప్స్ సెలబ్రిటీలపై రంగంలోకి ఈడీ!

29 మంది సినీ, సోషల్ మీడియా ప్రముఖులపై కేసు

జాబితాలో విజయ్‌దేవరకొండ, రానా, ప్రకాశ్‌రాజ్, సిరి, శ్రీముఖి

త్వరలో వీరికి ఈడీ సమన్లు?

తాను ప్రచారం చేసినప్పుడు 'రమ్మీ గేమ్' బెట్టింగ్ యాప్ కాదన్న ప్రకాశ్‌రాజ్ 12

బెట్టింగ్ యాప్‌లకు వివాహిత బలి

ఉరి వేసుకొని బలవన్మరణం

కేసీఆర్‌కు వైద్య పరీక్షలు!

యశోద ఆస్పత్రిలో ఉదయం నుంచి సాయంత్రం దాకా ఉన్న బీఆర్ఎస్ అధినేత



హైదరాబాద్ సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ మరోసారి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఇటీవల అస్వస్థతకు గురైన కేసీఆర్ చికిత్స నిమిత్తం సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. డిశ్చార్జి అనంతరం ఆయన నందినగర్‌లోని తన నివాసానికి వెళ్లి విశ్రాంతి తీసుకుంటున్నారు. వైద్యుల సలహా మేరకు గురువారం కేసీఆర్ మరోసారి ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉదయం 9.30 గంటలకు ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలన్నీ పూర్తయిన తర్వాత సాయంత్రం 6.30 గంటలకు కేసీఆర్ ఇంటికి వెళ్లిపోయారు.



కోర్టులో హాజరుపరిచేందుకు జగన్మోహన్‌రావును తీసుకొస్తున్న పోలీసులు

ఫోర్జరీతో ప్రవేశం

- ఆఫీసు బేరర్లతో కలిసి హెచ్‌సీఏలో నిధుల దుర్వినియోగం
- సీఐడీ విచారణలో బయటపడిన అధ్యక్షుడు జగన్మోహన్ లీలలు
- ఆయనతో సహా ఐదుగురిని రిమాండ్‌కు తరలించిన సీఐడీ
- బీసీసీఐకి చెందిన రూ.170 కోట్ల నిధుల దుర్వినియోగం
- టెండర్లలో నిబంధనలకు తూట్లు.. క్రీడా సామగ్రి కొనుగోళ్లలో అవినీతి
- రిమాండ్ రిపోర్టులో సీఐడీ.. చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే వినోద్

హైదరాబాద్, అడ్డగుట్ట, కుషాయిగూడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్మోహన్‌రావు లీలలు సీఐడీ విచారణలో ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఫోర్జరీ పత్రాల సాయంతో జగన్మోహన్ హెచ్‌సీఏలోకి ప్రవేశించారని, అధ్యక్షుడైన తర్వాత ఆఫీస్ బేరర్లతో కలిసి సంస్థ నిధుల దుర్వినియోగం చేశారని సీఐడీ విచారణలో వెల్లడైంది. హెచ్‌సీఏలో ఆర్థిక అవకతవకలు, ఫోర్జరీ వివిధ ఆరోపణలపై తెలంగాణ క్రికెట్

మిగతా 14వ పేజీలో...

హెల్త్ ఇన్సూరెన్స్ మోసాలపై
ఇక కొరడా

ఆర్థిక శాఖ పరిధిలోకి రానున్న జాతీయ హెల్త్ క్లెయిమ్స్ ఎక్స్ఛేంజీ

ఐఆర్‌డీఏఐతో కలిసి పర్యవేక్షణ. కేంద్ర ప్రభుత్వ యోచన

ఇప్పటిదాకా ఆరోగ్య శాఖ పరిధిలోనే హెల్త్ క్లెయిమ్స్ ఎక్స్ఛేంజీ

పర్యవేక్షణ లేక భారీగా క్లెయిమ్‌లు.. యథేచ్ఛగా ఆస్పత్రుల ఫీజులు

ఏటా పెరుగుతున్న ప్రీమియం.. బీమాకు దూరమవుతున్న ప్రజలు



న్యూఢిల్లీ, జూలై 10: భారత ప్రభుత్వం నేషనల్ హెల్త్ క్లెయిమ్స్ ఎక్స్ఛేంజిని ఆరోగ్య శాఖ పరిధి నుంచి తప్పించి, ఆర్థిక శాఖ పరిధిలోకి మార్చాలని యోచిస్తోంది. అప్పుడు ఆర్థిక శాఖ, భారత బీమా నియంత్రణ అభివృద్ధి సంస్థ(ఐఆర్‌డీఏఐ) కలిసి నేషనల్ హెల్త్ క్లెయిమ్స్ ఎక్స్ఛేంజిని పర్యవేక్షిస్తాయి. 2025లో ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య బీమా ప్రీమియంలు సగటున 10 శాతం పెరుగుతాయని అంచనా వేస్తుంటే భారత్‌లో మాత్రం 13 శాతం పెరుగుతాయని

మిగతా 2వ పేజీలో...



ఏసీబీకి పట్టుబడిన నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సతీష్, డ్రైవర్ దుర్గయ్య

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ
డిప్యూటీ కలెక్టర్ అరెస్ట్

ఏసీబీ వలలో నిమ్జ్ అధికారులు.. సేకరించిన భూమికి పరిహారం ఇచ్చేందుకు రైతు నుంచి రూ.5 లక్షల లంచం డిమాండ్

రూ.65 వేలు తీసుకుంటుండగా పట్టివేత

డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ తహసీల్దార్‌తోపాటు డ్రైవర్ అరెస్ట్

జహీరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఓ రైతు వద్ద లంచం తీసుకుంటూ నిమ్జ్ (నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్, మాన్యుఫాక్చరింగ్ జోన్స్) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సతీష్, డ్రైవర్ దుర్గయ్య ఏసీబీకి పట్టుబడ్డారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని నిమ్జ్ కార్యాలయంలో బాధిత రైతు నుంచి గురువారం వారు డబ్బులు తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మెదక్ జిల్లా న్యాల్‌కల్ మండలం హుసెల్లికి చెందిన

మిగతా 14వ పేజీలో...

8వ వేతన సంఘం.. వేతనాల్లో 34% పెంపు?

మార్కెట్లో పెరగనున్న వినియోగం

ఆర్థిక వ్యవస్థకు చేకూరనున్న లబ్ధి 2

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పింఛన్లపై 'అంబిట్ క్యాపిటల్' నివేదిక

దక్షిణాది వారు డ్యాన్స్ బార్లను నడుపుతారు

పిల్లల్ని చెడగొడతారు.. మహారాష్ట్రలో శివసేన ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు 2

ఖండించిన సీఎం ఫడణవీస్, ఏక్‌నాథ్ శిందే

'బాగుంది రా మామా..'




11

లార్డ్స్‌లో నితీశ్ కుమార్‌రెడ్డి ప్రతిభకు శుభ్‌మన్ గిల్ ఫిదా

తెలుగులో అభినందన

అమ్మో.. సూపర్‌బగ్స్



యాంటీబయాటిక్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ మందులకు లొంగని మహమ్మారి జీవులతో ముప్పు

ఆయా మందులను వైద్యులు చెప్పినట్టుగా కాకుండా విచ్చలవిడిగా వాడడం.. మధ్యలో ఆపేయడమే కారణం

మిగిలిన, గడువు తీరిన మందుల్ని మురుగులో పడేయొద్దు

దాని వల్ల పర్యావరణంలోకి ప్రమాదకర రసాయనాలు

ఎల్వీపీఈఐ మైక్రోబయాలజిస్టు డాక్టర్ సంచిత మిత్రా

హైదరాబాద్ సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మందులకు లొంగని 'సూపర్‌బగ్స్' సంఖ్య మనదేశంలో రోజురోజుకూ పెరుగుతోందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా మనకు ఏదైనా బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ వల్ల జ్వరం వస్తే.. వైద్యులు యాంటీ బయాటిక్ మందులు రాస్తారు. కోర్సు ప్రకారం ఆ మందులు వాడితే జ్వరం తగ్గుతుంది. అయితే.. కొంతమంది, డాక్టర్ సూచించిన ప్రకారం పూర్తి కోర్సు వాడకుండా.. తమకు జ్వరం తగ్గగానే ఆ యాంటీబయాటిక్ మందును వాడడం ఆపేస్తారు. అంటే.. వైద్యుడు వారం రోజులు మందు వాడాలని రాస్తే, 3-4 రోజులు వాడి, 'జ్వరం తగ్గింది కదా అనవసరంగా మందులు ఎందుకు వాడడం' అనే ఉద్దేశంతో ఆ బిళ్లలు వేసుకోవడం ఆపేస్తారు. అలా సగంలోనే ఆపేయడం వల్ల.. మన శరీరంలోని బ్యాక్టీరియా పూర్తిగా చావదు సరికదా.. మనం అరకొరగా వేసిన యాంటీబయాటిక్ ఔషధానికి నిరోధకత సంతరించుకుంటుంది. అలాగే కొంతమంది.. అయిన దానికి కాని దానికీ.. చీటికీమాటికీ విచ్చలవిడిగా

మిగతా 14వ పేజీలో...



పరిగణనలోకి ఆధార్ కూడా..

ఓటర్ గుర్తింపు కార్డు, రేషన్ కార్డు సైతం

బిహార్‌లో ఈసీ చేపట్టిన ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ రాజ్యాంగబద్ధమేనని ధర్మాసనం స్పష్టీకరణ

నిలిపివేతకు నో.. తదుపరి విచారణ 28న

సుప్రీం తీర్పుతో ప్రజాస్వామ్యానికి ఊరట: కాంగ్రెస్

న్యూఢిల్లీ, జూలై 10: ఎన్నికల కమిషన్ బిహార్‌లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిలిపివేయాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. రాజ్యాంగంలోని 324 అధికరణ ప్రకారం, ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950 ప్రకారం చేపట్టిన ఈ ప్రక్రియ రాజ్యాంగబద్ధమైనదేనని స్పష్టం చేసింది. అయితే.. శాసనసభ ఎన్నికలకు ముందు ఈ ప్రక్రియను నిర్వహించడం ఏమిటని ఎన్నికల కమిషన్‌ను

మిగతా 2వ పేజీలో...

సీబీఐటీ.. ఫీజులు పెంచుకోవచ్చు



టీఏఎఫ్ఆర్సీ సిఫార్సుల మేరకే..

పెంపు తుది తీర్పునకు లోబడి ఉండాలి

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు 14

అప్పీలు చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం

కోర్టును ఆశ్రయించిన మరిన్ని ప్రైవేటు కాలేజీలు.. విచారణ నేటికి వాయిదా

పుదుచ్చేరి సీఎం విధుల బహిష్కరణ!

ఎల్జీ వైఖరికి నిరసనగా.. 2

3 రోజులుగా స్తంభించిన పాలన

8వ వేతన సంఘం.. వేతనాల్లో 34% పెంపు!

- ఫిట్‌మెంట్ 2.86 ఉండే అవకాశం
- మార్కెట్లో పెరగనున్న వినియోగం
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పింఛన్లపై 'అంబిట్ క్యాపిటల్' నివేదిక




న్యూఢిల్లీ, జూలై 10: దేశవ్యాప్తంగా లక్షలాదిమంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదార్లు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 8వ వేతన సంఘం.. వేతనాలను, పింఛన్లను 30 నుంచి 34 శాతం మేర పెంచటానికి సిఫార్సు చేయవచ్చని తెలుస్తోంది. అంబిట్ క్యాపిటల్ అనే బ్రోకరేజీ సంస్థ ఈ మేరకు ఇటీవల ఒక నివేదికను విడుదల చేసింది. కొత్త వేతన సంఘం సిఫార్సులతో దాదాపు ఒక కోటీ పది లక్షల మందికి లబ్ధి చేకూరవచ్చని తెలిపింది. వేతనాలు, పింఛన్ల పెంపు వల్ల మార్కెట్లో వినియోగం పెరుగుతుందని, తద్వారా ఆర్థికవ్యవస్థకు లాభం చేకూరుతుందని అంచనా వేసింది.

7వ వేతన సంఘం.. 14% పెంపుదల

2016 జనవరి-2025 డిసెంబరు కాలవ్యవధి కోసం ఏర్పాటైన 7వ వేతన సంఘం సిఫార్సులే ప్రస్తుతం అమలులో ఉన్నాయి. ఈ సంఘం 14 శాతం వేతన పెంపును మాత్రమే సిఫార్సు చేసింది. 1970 నుంచీ ఇదే అత్యంత తక్కువ పెరుగుదలగా నమోదైంది. ఈ ఏడాది జనవరిలో కేంద్రప్రభుత్వం 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ.. చైర్మన్, సభ్యులుగా ఇప్పటికీ ఎవర్నీ నియమించలేదు. వేతన సంఘం విధివిధానాలనూ ప్రకటించలేదు. వాస్తవానికి, వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి 8వ వేతన సంఘం సిఫార్సులు అమలులోకి రావాలి. కానీ, వేతన సంఘం ఇంకా రూపుదాల్చకపోవటం వల్ల 2027 నుంచిగానీ కొత్త వేతన సంఘం సిఫార్సులు అమల్లోకి వచ్చే అవకాశాలు లేవని సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. కాగా, 8వ పే కమిషన్‌పై ఉద్యోగులు, పింఛనుదార్లు భారీగా ఆశలు పెంచుకున్న నేపథ్యంలో అంబిట్ క్యాపిటల్ నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నివేదిక ప్రకారం.. 8వ వేతన సంఘం 2.86 వరకూ ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను ప్రకటించవచ్చని, దీనివల్లే వేతనాలు, పింఛన్లు 30 నుంచి 34 శాతం వరకూ పెరిగే అవకాశం ఉంది.

పదేళ్లకోసారి పే కమిషన్

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలను పెంచటానికి ప్రతీ పదేళ్లకోసారి వేతన సంఘాన్ని కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. సాధారణంగా, పే కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన తర్వాత కమిషన్ అమల్లోకి రావటానికి ఏడాదిన్నర నుంచి రెండేళ్ల సమయం పడుతుంది. 7వ పే కమిషన్ ఏర్పాటుపై కేంద్రం 2014 ఫిబ్రవరిలో ప్రకటన చేసింది. కమిషన్ విధివిధానాలు, కూర్పు, క్యాబినెట్ ఆమోదం, నివేదిక తయారీ మొదలైనవాటికి రెండేళ్లు పట్టింది. 2016 జనవరి నుంచి 7వ పే కమిషన్ సిఫార్సులు అమల్లోకి వచ్చాయి.



సీఎం విధుల బహిష్కరణ!

- పుదుచ్చేరిలో 3 రోజులుగా స్తంభించిన పాలన
- లెఫ్టినెంట్ గవర్నర్ నిరంకుశ వైఖరికి వినూత్న నిరసన

చెన్నై, జూలై 10(ఆంధ్రజ్యోతి): పరిపాలనా వ్యవహారాల్లో లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ) కైలాశ్‌నాథ్ అతిగా జోక్యం చేసుకుంటున్న తీరుకు నిరసనగా కేంద్రపాలితప్రాంతం పుదుచ్చేరిలో సీఎం రంగస్వామి, ఆయన పార్టీకి చెందిన మంత్రివర్గ సహచరులు మూడు రోజులుగా విధులను బహిష్కరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో కలిసి పోటీ చేసిన ఎన్ఆర్ కాంగ్రెస్ అధినేత రంగస్వామి సీఎం పీఠం దక్కించుకున్న విషయం తెలిసిందే. బీజేపీకి కూడా ప్రభుత్వంలో భాగస్వామ్యం కల్పించారు. అయితే, తాను పేరుకే ముఖ్యమంత్రినని, కనీసం విద్యార్థుల నోటుపుస్తకాలకు కూడా నిధులు విడుదల చేయలేని స్థితిలో ఉన్నానంటూ పలుమార్లు ఆయన వాపోయారు. దీనికితోడు పుదుచ్చేరికి రాష్ట్ర హోదా ఇస్తామన్న హామీపై కేంద్రం ఏమాత్రం స్పందించకపోవడం పట్ల ఆయన కినుక వహించారు. ఈ నేపథ్యంలో ఎల్జీ తనను కనీసం సంప్రదించకుండా ఐఏఎస్ అధికారులను బదిలీ చేయడం, పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడాన్ని రంగస్వామి జీర్ణించుకోలేకపోతున్నారు. పలు కళాశాలల్లో పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్ల కాంట్రాక్టులను పునరుద్ధరించేందుకు క్యాబినెట్ చేసిన సిఫారసులను కూడా ఎల్జీ తిరస్కరించినట్లు సమాచారం. ఈ వ్యవహారాలపై రంగస్వామి కేంద్రాన్ని సంప్రదించినా స్పందన లేదని సమాచారం. దీంతో మనస్తాపం చెందిన రంగస్వామి, ఆయన మంత్రివర్గ సహచరులు మూడు రోజుల నుంచి విధులను బహిష్కరించారు. దీంతో పుదుచ్చేరిలో పాలన స్తంభించింది.

దక్షిణాది వారు డ్యాన్స్ బార్లను నడుపుతారు

- శివసేన ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

ముంబై, జూలై 10: దక్షిణ భారతీయులపై శివసేన(శిందే వర్గం) ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బుల్దానా నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్.. ముంబైలోని తన అధికారిక నివాసంలో పనిచేస్తున్న క్యాంటీన్ కాంట్రాక్టర్‌ను తీవ్రంగా కొట్టారు. పాచిపోయిన ఆహారం ఇచ్చారంటూ ఆయన పట్ల దుర్మార్గంగా ప్రవర్తించిన వీడియో బుధవారం నెట్టింట వైరల్ అయ్యింది. పప్పు ఉన్న కటోరాను కాంట్రాక్టర్ ముక్కు వద్ద పెట్టిన గైక్వాడ్.. ఆ వెంటనే అతనిపై ముష్టిఘాతాలు కురిపించారు. సదరు కాంట్రాక్టర్ కింద పడిపోయి.. లేవలేని స్థితిలో ఉన్నా.. తన దాడిని ఆపలేదు. దీనిపై గైక్వాడ్ గురువారం స్పందిస్తూ.. వివాదాన్ని మరింత తీవ్రం చేశారు. "దక్షిణ భారతీయులు డ్యాన్స్ బార్లు, లేడీస్ బార్లను నడుపుతూ.. మహారాష్ట్ర సంస్కృతిని నాశనం చేస్తున్నారు. శెట్టి అనే దక్షిణాది వ్యక్తికి కాంట్రాక్ట్ ఎలా ఇచ్చారు? మహారాష్ట్ర స్థానికుడికి ఇవ్వాలి కదా? ఏం తినాలో మాకు తెలుసు" అంటూ విమర్శించారు. దక్షిణాదివారు డ్యాన్స్ బార్లు, లేడీస్ బార్లను నడుపుతూ.. పిల్లల్ని చెడగొడుతుంటారని, అలాంటి వారు మంచి ఆహారం ఎలా అందిస్తారని ప్రశ్నించారు. ఈ ఘటనను మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే తీవ్రంగా ఖండించారు.

ఏఐతో మైక్రోసాఫ్ట్‌కు రూ.4 వేల కోట్లు ఆదా!

- వందేళ్లయినా ఏఐ ఆ పనులైతే చేయలేదు: బిల్‌గేట్స్

వాషింగ్టన్, జూలై 10: టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తన కార్యకలాపాల్లో కృత్రిమ మేధ (ఏఐ)ను వాడుతూ ఓ వైపు భారీ లబ్ధి పొందుతుంటే.. మరో వైపు ఏఐ ఇంకా 100 ఏళ్లయినా కొన్ని పనులు అస్సలు చేయలేదంటూ ఆ కంపెనీ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ చెబుతున్నారు. గత ఏడాది ఏఐ వినియోగం ద్వారా 500 మిలియన్ డాలర్లు (రూ.4,285 కోట్లు) ఆదా చేసిన మైక్రోసాఫ్ట్.. అదే సమయంలో 9,100 మంది ఉద్యోగులను తొలగించడం గమనార్హం. 'ముఖ్యంగా కాల్ సెంటర్ కార్యకలాపాల్లో ఏఐని వాడటంతో ఖర్చు భారీగా తగ్గింది. అంతేకాకుండా కస్టమర్లకు మెరుగైన సేవలందుతున్నాయి' అని మైక్రోసాఫ్ట్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ జడ్సన్ ఆల్థోఫ్ తెలిపారు. అయితే ఏకంగా 9,100 మంది ఉద్యోగులను తొలగించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలాఉండగా.. ఆ సంస్థ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ఏఐపై ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇంకా 100 ఏళ్లయినా ప్రోగ్రామర్లను ఏఐ భర్తీ చేయలేదన్నారు. కోడింగ్‌కు కూడా మానవ మేధ అవసరమని చెప్పారు.

కేంద్రంలో నాయకత్వ సంక్షోభం, అసమర్థత

- ప్రసంగాలు, ప్రకటనలతోనే వారంతా బిజీ: ఖర్గే ధ్వజం

న్యూఢిల్లీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ నాయకత్వం ప్రసంగాలు, ప్రకటనలతో బిజీ ఉందని, వారికి ప్రజల బాధలు పట్టవని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. దేశంలో జరుగుతున్న ప్రమాదాలు వారి నాయకత్వ సంక్షోభం, అసమర్థతకు నిదర్శనమని అన్నారు. వరుస ప్రమాదాలపై గురువారం ఎక్స్ వేదికగా ఖర్గే బీజేపీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీ నాయకత్వ సంక్షోభం, అసమర్థ పాలన కారణంగా అన్ని విభాగాల్లోనూ అవినీతి పెరిగిపోయిందని ఆరోపించారు. అందుకే గుజరాత్‌లో వంతెన కూలిపోవడం, అహ్మదాబాద్ విమాన ప్రమాదం వంటి విషాద ఘటనలు జరిగాయని అన్నారు. మూడేళ్ల క్రితమే వంతెన ప్రమాదకరంగా ఉన్నట్లు హెచ్చరికలు వచ్చాయని, అయినా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అలాగే, గుజరాత్‌లో తరచుగా వంతెనలు కూలిపోతుండడం, ఇతర ప్రమాదాలకు బాధ్యత వహిస్తూ సీఎం భూపేంద్ర పటేల్, హోంమంత్రి హర్ష్ సంఘ్వి రాజీనామా చేయాలని సీనియర్ నేతలు లాల్జీ దేశాయ్, జిగ్నేష్ మేవాని డిమాండ్ చేశారు.

ఇన్‌స్టా రీల్స్ చేస్తోందని టెన్నిస్ క్రీడాకారిణిని కాల్చి చంపిన తండ్రి!



లఖ్‌నవూ, జూలై 10: యూపీలోని గురుగ్రామ్‌కు చెందిన ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణి రాధికా యాదవ్ (25) దారుణహత్యకు గురయ్యారు. సామాజిక మాధ్యమాల్లో ఆమె అదేపనిగా రీల్స్ చేస్తున్నారని, ఆమె తీరు కారణంగా తెలిసిన వాళ్ల ఎదుట తలెత్తుకోలేకపోతున్నాననే కారణంతో కన్నతండ్రే ఆమెను తుపాకీతో కాల్చి చంపాడు. గురుగ్రామ్‌లోని ఆమె ఉంటు న్న నివాసంలోనే ఈ ఘటన జరిగింది. రాష్ట్ర, జాతీయ స్థాయుల్లో రాధిక ఎన్నో పతకాలు సాధించారు. ఇటీవల ఆమెకు గాయం కావడంతో ప్రొఫెషనల్ టెన్నిస్‌కు దూరంగా ఉంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రభావశీల వ్యక్తిగా ఎదగాలనే లక్ష్యంతో ఆమె కొన్నాళ్లుగా రీల్స్ చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తున్నారు. గురువారం ఉదయం 10:30కు ఇంట్లోనే రాధికపై ఆమె తండ్రి కాల్పులు జరిపాడు. మూడు బుల్లెట్లు ఆమె శరీరంలో దిగాయి. తీవ్రంగా గాయపడిన ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆమె తండ్రిని పోలీసులు అరెస్టు చేశారు. ఎప్పుడూ కూతురు సోషల్ మీడియాలో కనిపిస్తోందంటూ తెలిసిన వాళ్లు వెక్కిరిస్తుండటంతో గత 15 రోజులుగా తీవ్ర ఒత్తిడిలో ఉన్నానని పోలీసుల విచారణలో నిందితుడు చెప్పాడు.

పరిగణనలోకి ఆధార్ కూడా..

(మొదటి పేజీ తరువాయి)



ప్రశ్నించింది. ఓటర్లు తమ గుర్తింపును ధ్రువీకరించుకోవడానికి అనుమతించే పత్రాల జాబితాలో.. ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డులను గుర్తింపు పత్రాలుగా పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఈ ప్రక్రియపై పలు పార్టీలు, ఎన్జీవోలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. అలా దాఖలైన పదికిపైగా పిటిషన్లను.. జస్టిస్ సుధాన్షు ధూలియా, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం విచారించచింది. ఎన్నికల కమిషన్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది.. ఆధార్‌ను పౌరసత్వ గుర్తింపు పత్రంగా అంగీకరించలేమని కోర్టుకు తెలిపారు. దీనికి కోర్టు.. పౌరసత్వాన్ని ధ్రువీకరించాల్సింది హోం శాఖ అని, అది ఈసీ పని కాదని గుర్తుచేసింది. గుర్తింపు ప్రక్రియకు ఈసీఐ అనుమతిస్తున్న 11 పత్రాల జాబితా సమగ్రమైనదేమీ కాదని.. కనుక, ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డులను కూడా పరిగణనలోకి తీసుకుంటే అందరికీ న్యాయం జరుగుతుందన్నది తమ అభిప్రాయమని పేర్కొంది. అయితే, దీనిపై తుది నిర్ణయం తీసుకునే అధికారం ఈసీదేనని.. ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు కారణాలు మాత్రం వెల్లడించాలని ఆదేశించింది. "మీరు ఈ ప్రక్రియను చేపట్టడం సమస్య కాదు. కానీ.. చేపట్టిన సమయమే సమస్య. నవంబరులో జరిగే శాసనసభ ఎన్నికలకు దీనికి ముడిపెట్టడమెందుకు? ఎన్నికలతో సంబంధం లేకుండా దీన్నెందుకు నిర్వహించలేరు? కొంచెం ముందే దీన్ని ఎందుకు నిర్వహించలేదు?" అని విచారణ సందర్భంగా కోర్టు ప్రశ్నించింది. ఓటర్ల జాబితా ఒక్కసారి ఖరారైతే కోర్టులు అందులో జోక్యం చేసుకోవని.. ఇదంతా ఎన్నికలకు ముందు జరగడం వల్ల.. నష్టపోయిన వ్యక్తులు సవరించిన జాబితాను కోర్టులో సవాల్ చేసే అవకాశాన్ని కోల్పోతారని పేర్కొంది. ఇక.. పిటిషనర్లలో ఒకరైన అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణన్ వాదనలు వినిపించారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలో సమగ్ర సవరణ, సంక్షిప్త సవరణ గురించి మాత్రమే ఉందని.. 'ప్రత్యేక సమగ్ర సవరణ' గురించి అందులో ఎక్కడా లేదని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఓటరు జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ చేయడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి అని తెలిపారు. మరీ ముఖ్యంగా 2003 తర్వాత ఓటరుగా నమోదు చేసుకున్నవారంతా తమ గుర్తింపును ధ్రువీకరించుకోవాలంటూ కటాఫ్ తేదీని పేర్కొనడం అన్యాయమన్నారు. పిటిషనర్ల తరఫున వాదన వినిపించిన మరో న్యాయవాది అభిషేక్ సింఘ్వీ.. ఇది ఓటరు జాబితా స్క్రీనింగ్‌లా కాక, పౌరసత్వ స్క్రీనింగ్ ప్రక్రియలాగా ఉందని వ్యాఖ్యానించారు. అందరి వాదనలూ విన్న ధర్మాసనం.. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 21(3) ప్రకారం ఈసీకి ఆ అధికారం ఉందని పేర్కొంది. ఈసీని అనుమానించడానికి ఏమీ లేదని స్పష్టం చేసింది. అయితే, దీనిపై విచారణ జరగాల్సి ఉందని పేర్కొంది. పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలపై జూలై 21లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఈసీకి సూచించి.. తదుపరి విచారణను జూలై 28కి వాయిదా వేసింది. ఆలోగా ముసాయిదా జాబితాను ఈసీ ప్రచురించదని పిటిషనర్లకు తెలిపింది.

విపక్షాలకు చెంపపెట్టు: బీజేపీ

ఎస్ఐఆర్ ప్రక్రియలో గుర్తింపు ధ్రువీకరణకు.. ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డులను పరిగణనలోకి తీసుకోవాలంటూ సుప్రీం ద్విసభ్య ధర్మాసనం చేసిన సూచన ప్రజాస్వామ్యానికి ఊపశమనాన్నిచ్చిందని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ వ్యాఖ్యానించారు. ఈసీ ఆ సూచనను పరిగణనలోకి తీసుకుంటుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. మరోవైపు.. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నిలిపివేతకు సుప్రీంకోర్టు నిరాకరించడం, ఆ ప్రక్రియను కొనసాగించడానికి అనుమతించడం ప్రతిపక్షాలకు చెంపపెట్టు అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి రాజీవ్ ప్రతాప్ రూడీ అన్నారు. ఓటర్లను తొలగించేస్తున్నారంటూ ఏడ్చేకన్నా.. ఓటర్ల మనసును చూరగొనే ప్రయత్నం చేయాలని విపక్షాలకు ఆయన సూచించారు.

హెల్త్ ఇన్సూరెన్స్ మోసాలపై ఇక కొరడా

(మొదటి పేజీ తరువాయి)

అంచనా వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా గతంలో 20 శాతం వరకు పెరిగిన బీమా ప్రీమియంలు 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేవలం 9 శాతం పెరిగాయి. భారతదేశంలో మాత్రం 12 శాతం పెరిగాయి. ఆసుపత్రులు వైద్యానికి ఇష్టం వచ్చినట్లు ఫీజులు వసూలు చేస్తున్న నేపథ్యంలో దేశంలో వైద్య బీమా ప్రీమియంలు భారీగా పెరుగుతున్నాయి. దీని వల్ల ప్రజలు ఆరోగ్య బీమాకు మరింత దూరమయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో నేషనల్ హెల్త్ క్లెయిమ్స్ ఎక్స్ఛేంజీని ఆర్థిక శాఖ పరిధిలోకి తెచ్చి బలోపేతం చేస్తే ఆసుపత్రులతో బేరమాడే శక్తి బీమా కంపెనీలకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఈ హెల్త్ ఎక్స్ఛేంజీ బీమా సంస్థలకు, ఆసుపత్రులకు, ఆరోగ్య బీమా చేయించుకొనే వారికి అనుసంధానకర్తగా వ్యవహరిస్తుంది. ఇక నుంచి ఐఆర్‌డీఏఐ బీమా మోసాలను పసిగట్టడంలో, ధరలను పర్యవేక్షించడంలో, క్లెయిమ్‌ల ప్రామాణికతను నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. రిజర్వు బ్యాంకు తరహాలో నియంత్రణ బాధ్యతలు చేపడుతుంది. క్లెయిముల డేటా మొత్తం ఒకచోట ఉండటం వల్ల బీమా సంస్థలు బిల్లులను పెంచి చూపించే ఆస్పత్రులను ఇట్టే పసిగట్టి పక్కనపడేస్తాయి. విధివిధానాలు పాటించని బీమా సంస్థలకు భారీగా జరిమానాలను విధించేందుకు అవకాశం ఉంటుంది. ఇలా చేయడం ద్వారా క్లెయిముల భారం తగ్గి ప్రీమియం కూడా బాగా తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. కేంద్రీకృత పోర్టల్ వల్ల పారదర్శకంగా, ప్రమాణాలతో కూడిన క్లెయిముల పరిష్కారం జరుగుతుంది. వృథా, మోసం, నిర్వహణ వైఫల్యాలను అరికట్టవచ్చు. ఒకే చోట డేటా ఉండటం వల్ల తప్పుడు విధానాలను ఎప్పటికప్పుడు పసిగట్టవచ్చు. అనుగుణంగా మార్పులు చేసుకోవచ్చు.

వీడియోల్లో ఏఐ కంటెంట్ ఉంటే స్పష్టం చేయాల్సిందే

- 15 నుంచి యూట్యూబ్ కొత్త నిబంధనలు

న్యూఢిల్లీ, జూలై 10: ఈ రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో సృష్టించిన వీడియోలు, ఆడియోలు యూట్యూబ్‌లో ఎక్కువయ్యాయి. ఈ వీడియోలు నిజమైనవో కాదో చాలామంది తెలుసుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ఏఐ జనరేటెడ్ వీడియోల కట్టడికి యూట్యూబ్ చర్యలు తీసుకుంది. ఇకపై క్రియేటర్లు తమ వీడియోల్లో ఏఐ జనరేటెడ్ వాయిస్‌లు, ముఖాలు లేదా వీక్షకులను తప్పుదారి పట్టించే విజువల్స్ ఉంటే ఆ విషయాన్ని స్పష్టంగా వెల్లడించాలని, లేదంటే వారి వీడియోలను తొలగించడం కానీ, డీమానిటైజేషన్ చేయడం గానీ చేస్తామని వెల్లడించింది. ఈ కొత్త నిబంధనలు ఈ నెల 15 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది. ఏఐతో కూడిన విస్తృత కంటెంట్ వల్ల... ఆలోచనాత్మకమైన, అసలైన కంటెంట్‌ను కోల్పోకుండా చూసేందుకు ఈ నిబంధనలు తీసుకొచ్చినట్టు యూట్యూబ్ వెల్లడించింది. పారదర్శకత తీసుకొచ్చేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపింది. అయితే.. వీడియోలో కనిపిస్తూ.. సొంత స్వరంతో మాట్లాడుతూ.. తమ ఆలోచనలను, క్రియేటివిటీని వీడియోలోకి తీసుకొచ్చే వారికి ఎలాంటి ఇబ్బందీ ఉండదని పేర్కొంది. ఏఐని సహాయక సాధనంగా ఉపయోగించే వారిని కూడా లక్ష్యంగా చేసుకోవడం లేదని యూట్యూబ్ స్పష్టం చేసింది.

14న భూమికి రానున్న శుభాంశు

- నాసా ప్రకటన..అంతరిక్షంలో విధులు పూర్తి
- 230 సూర్యోదయాలు.. 60 ప్రయోగాలు

న్యూఢిల్లీ, జూలై 10: ప్రస్తుతం అంతరిక్ష యాత్ర చేస్తున్న వ్యోమగామి శుభాంశు శుక్లా, ఆయన సహచరులు ఈ నెల 14న భూమికి తిరిగి రానున్నారు. ఈ విషయాన్ని గురువారం నాసా ప్రకటించింది. రెండు వారాల పాటు సాగిన ఈ యాత్రలో వారు 230 సూర్యోదయాలు చూశారు. సుమారు కోటి కిలోమీటర్ల మేర ప్రయాణించారు. భూమికి 250 మైళ్ల ఎత్తులో ఉన్న అంతరిక్ష ప్రయోగశాల ఇంటర్నేషనల్ స్పేస్ సెంటర్ (ఐఎస్ఎస్)కు యాక్సియం-4 (ఏఎక్స్-4) మిషన్ ద్వారా శుభాంశుతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ యుజానస్కీ విష్నేవ్‌స్కీ, టిబోర్ కపు వెళ్లిన విషయం విదితమే. అక్కడ వివిధ రకాల ప్రయోగాలు చేసిన ఆ నలుగురు వ్యోమగాములు గురువారం చివరిగా విధులు నిర్వర్తించారు. ఈ రెండు వారాల పాటు భూమి చుట్టూ 230 సార్లు ప్రదక్షిణ చేశారు. ఆ లెక్కన 96.5 లక్షల కిలోమీటర్ల మేర ప్రయాణించారు. కఠినమైన పరిస్థితుల మధ్య 60 ప్రయోగాలు చేశారు. బయోమెడికల్ సైన్స్, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, న్యూరోసైన్స్, వ్యవసాయం, స్పేస్ టెక్నాలజీ రంగాల్లో ఈ ప్రయోగాలు కొనసాగాయి. ఇంతవరకు ప్రయివేటు స్పేస్ మిషన్ల ద్వారా జరిగిన ప్రయోగాల్లో ఇవే అధికం కావడం విశేషం. అంతరిక్షంలో మరిన్ని ఆవిష్కరణలకు, భూమిపై జీవనవిధానంలో మార్పులకు ఇవి సహకరిస్తాయి. మధుమేహం, కేన్సర్ వంటి వ్యాధుల చికిత్సకు కూడా ఈ ప్రయోగాలు ఉపకరిస్తాయి. మధ్యమధ్యలో లభించిన విరామ సమయంలో భూమిని వీడియోల ద్వారా చిత్రీకరించారు. కావాల్సిన వారితో మాట్లాడారు. ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి జూన్ 25న ఆకాశంలోకి దూసుకుపోయిన ఏఎక్స్-4 మిషన్ వ్యోమనౌక 28 గంటల ప్రయాణం అనంతరం అంతరిక్ష కేంద్రంతో అనుసంధానమయింది.

నిమిష ప్రియ మరణశిక్షపై చివరి నిమిషంలో మలుపు

ఆదుకోవాలంటూ సుప్రీంకోర్టులో వ్యాజ్యం.. 14న విచారణ

- 16నే శిక్ష అమలు చేయనున్నట్లు యెమెన్ ప్రకటన
- దౌత్యపరంగా సాయం చేయాలని ఏజీకి సూచన
- 'బ్లడ్ మనీ' చెల్లిస్తే శిక్ష రద్దు



న్యూఢిల్లీ, జూలై 10: హత్య చేసిందన్న నేరంపై యెమెన్ దేశంలో మరణశిక్ష పడ్డ కేరళ నర్సు నిమిష ప్రియ (36) కేసు చివరి నిమిషంలో మలుపు తిరిగింది. ఆమెను భారత ప్రభుత్వం కాపాడాలని కోరుతూ సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలయింది. దానిపై ఈ నెల 14న విచారణ జరపనున్నట్లు గురువారం సుప్రీంకోర్టు ప్రకటించింది. ఆమెను ఈ నెల 16న ఉరితీయనున్నట్టు ఆ దేశ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించడం గమనార్హం. 'నిమిష ప్రియ- ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్' ఈ పిటిషన్ దాఖలు చేసింది. దీనిని జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ జోయ్‌మాల బాగ్చీల ధర్మాసనం విచారణకు స్వీకరించింది. కేసుపై విచారణ చేపట్టేలోగా దౌత్యపరమైన సహాయం పొందే విషయమై అటార్నీ జనరల్ (ఏజీ) కార్యాలయాన్ని సంప్రదించాలని పిటిషన్ దాఖలు చేసిన సీనియర్ న్యాయవాది రఘేంత్ బసంత్, న్యాయవాది సుభాష్ చంద్రన్ కేఆర్‌లను సూచించింది. దౌత్యపరంగా సాయం చేసే విషయాన్ని పరిశీలించాలని కేంద్రానికి తెలిపింది. తమ తరఫున సాధ్యమైనంత సాయం చేస్తామని ఇరాన్ దేశ దౌత్యాధికారి ఒకరు చెప్పినట్టు తెలిసింది. యెమెన్ దేశంలో అంతర్యుద్ధం నడుస్తుండడం, ప్రయాణాలపై ఆంక్షలు ఉండడంతో ఆమెకు సహాయం అందించడం కష్టంగా మారింది. హత్యకు గురయిన వ్యక్తి కుటుంబానికి 'దియాహ్' (రక్తపు సొమ్ము- బ్లడ్ మనీ) కింద తగినంత సొమ్ము ఇచ్చి, వారి క్షమాభిక్ష కోరితే శిక్ష నుంచి తప్పించుకునే అవకాశం ఉన్నా ఆంక్షల కారణంగానే సాధ్యపడడం లేదు. అందువల్ల ఉన్నత స్థాయిలో దౌత్యపరంగా జోక్యం చేసుకోవడమే మార్గమని న్యాయవాదులు సూచించారు. ఈ దిశగా ప్రభుత్వానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 'బ్లడ్ మనీ' చెల్లింపునకు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈలోగా మరణశిక్ష అమలును వాయిదా వేయించాలని విజ్ఞప్తి చేశారు. ఆమెకు ఆర్థిక సాయం చేయాలని పలువురు ఎంపీలు ప్రభుత్వాన్ని కోరారు. నర్సింగ్ శిక్షణను పూర్తి చేసుకున్న నిమిషప్రియ 2008లో యెమెన్ వెళ్లి రాజధాని సనాలోని పలు ప్రయివేటు ఆస్పత్రుల్లో పనిచేసింది. యెమెన్‌లో అంతర్యుద్ధం చెలరేగడం కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో 2014లో ఆమె భర్త, చిన్నపాప అయిన కుమార్తెను తీసుకొని భారత్‌కు తిరిగి వచ్చేశారు. ఆమె మాత్రం అక్కడే ఉండి స్థానిక వ్యక్తి మెహదీ సాయంతో ఆస్పత్రి ప్రారంభించింది. యెమెన్‌లో వ్యాపారం చేయాలంటే స్థానిక భాగస్వామ్యం తప్పనిసరి కావడంతో ఆమె ఆ నిర్ణయం తీసుకోకతప్పలేదు. అతడు మోసగించడంతో నష్టపోయింది. అతడు లాక్కొన్న తన పాస్‌పోర్టును తిరిగి తీసుకునే క్రమంలో 2017లో అతడికి మత్తుమందు ఇచ్చింది. మత్తుమందు డోస్ ఎక్కువ కావడంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఆరోపణను ఆమెను తిరస్కరించింది. నీళ్ల ట్యాంకులో శవం లభించడంతో హత్యా నేరాన్ని మోపారు. విచారణ జరిపిన కోర్టు ఆమెకు 2020లో మరణశిక్ష విధించింది. ఆమె చేసిన అప్పీలును 2023లో సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఆమెకు విధించిన మరణశిక్షకు ఆమోదం తెలుపుతూ హౌతీ రెబల్ గ్రూపు సుప్రీం కౌన్సిల్ హెడ్ మహదీ అల్ మషాత్ జనవరి నెలలో ఆదేశాలు ఇచ్చారు. అందుకు అనుగుణంగా మరణశిక్ష విధింపునకు తేదీని ఖరారు చేశారు. దానిని నిలువరించే దిశగా ప్రస్తుతం భారత్‌లో ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

భారత్‌పై 500% సుంకం.. పూర్తిగా నా అభిమతమే!

- రష్యా నుంచి చమురుకొనే దేశాలపై భారీ సుంకాల బిల్లుకు ట్రంప్ మద్దతు



వాషింగ్టన్, జూలై 10: రష్యా నుంచి ముడి చమురు, ఇతర ఇంధనాలను కొనుగోలు చేసే భారత్, ఇతర దేశాల దిగుమతులపై ఏకంగా 500% సుంకాలు విధించే బిల్లు తన అభిమతం ప్రకారం రూపొందినదేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. తన సన్నిహితుడు, రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహమ్ ప్రతిపాదించిన 'శాంక్షనింగ్ రష్యా యాక్ట్-2025' బిల్లుకు మద్దతు తెలిపారు. గురువారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్న సమయంలో ఈ ఆంక్షల అంశం ప్రస్తావనకు రాగా.. "దీన్ని గమనిస్తున్నాను. అది నా అభిమతానికి అనుగుణంగానే ఉంది. దానిని అమలు చేయాలా, తిరస్కరించాలా అన్నది నా చేతిలోనే ఉంటుంది. ఈ అంశాన్ని నేను కాస్త గట్టిగానే పరిగణిస్తున్నాను.." అని ట్రంప్ పేర్కొన్నారు.

ఉక్రెయిన్‌పై యుద్ధం ఆపేందుకు..!

ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆపేలా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు భారీగా ఆంక్షలు, సుంకాలు విధించేలా లిండ్సే గ్రాహమ్ ఈ బిల్లును ప్రతిపాదించారు. రష్యా కు కీలక ఆదాయ వనరులైన ముడి చమురు, సహజవాయువు, యు రేనియం, తదితర ఇంధనాలను ఇతర దేశాలు కొనుగోలు చేయకుండా నియంత్రించడం కూడా ఇందులో భాగం. అలా రష్యా నుంచి ఇంధనాలు కొనుగోలు చేసే దేశాలపై 500% సుంకాలు విధించాలని బిల్లులో ప్రతిపాదించారు. రష్యా ఇంధన ఎగుమతుల్లో సుమారు 70% భారత్, చైనాలే కొనుగోలు చేస్తున్నాయి. రష్యాపై ఆంక్షల బిల్లు చట్టంగా మారితే.. రష్యాతోపాటు భారత్, చైనాలపై ప్రభావం పడుతుంది. యూరప్‌కు చెందిన ది సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అంచనాల ప్రకారం.. ఈ ఏడాది ఒక్క మే నెలలోనే రష్యా నుంచి భారత్ చేసిన ఇంధన కొనుగోళ్ల సుమా రు రూ.42 వేల కోట్ల (420 కోట్ల యూరోలు) పైమాటే.

'ఎమర్జెన్సీ'.. మాయని మచ్చ

- నాడు క్రూరత్వం రాజ్యమేలింది
- గ్రామీణ ప్రాంతాల్లో బలవంతంగా వేసెక్టమీ ఆపరేషన్లు చేయించిన సంజయ్‌గాంధీ
- కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్

న్యూఢిల్లీ, జూలై 10: భారతదేశ చరిత్రలో ఎమర్జెన్సీ మాయని మచ్చ అని, ఆ కాలాన్ని ఒక చీకటి అధ్యాయం గా మాత్రమే గుర్తుంచుకోకూడదని, దాన్నొక పాఠంగా అర్థం చేసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎంపీ శశిథరూర్ అన్నారు. దేశంలో అత్యవసర పరిస్థితి విధించి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన రాసిన వ్యాసం ఓ మలయాళ దినపత్రికలో ఇటీవల ప్రచురితమైంది. ఇందిరా గాంధీ పాలనలో అధికార దుర్వినియోగం, బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల నిర్వహణ, మురికివాడల తొలగింపు తదితర అంశాలను అందులో ఆయన తీవ్రంగా విమర్శించారు. "అప్పట్లో ఇందిరాగాంధీ కుమారుడు సంజయ్‌గాంధీ గ్రామీణ ప్రాంతాల్లో వేసెక్టమీపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించి, బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిపించారు. ఏకపక్షంగా నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడం కోసం హింసను ఆయుధంగా ఉపయోగించారు. ఇలాంటి చర్యలు క్రమంగా నిరంకుశత్వానికి దారితీశాయి. ఇవ న్నీ భారత రాజకీయాల్లో మాయని మచ్చలా మిగిలిపోయాయి. నాటి రోజుల నుంచి పాఠాలు నేర్చుకొని మన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి" అని శశి థరూర్ పేర్కొన్నారు.

వర్షాకాలం.. వాగు దాటాలంటే హడల్!



ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలో వాగును దాటుతున్న కొత్తపల్లి గ్రామస్థులు(ఫైల్)

- ఆదిలాబాద్ ఏజెన్సీ గ్రామాల్లో గిరిజనుల పాట్లు
- అత్యవసర సమయాల్లో ప్రమాదకరంగా ప్రయాణం

ఆదిలాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ఏజెన్సీలోని పలు గ్రామాల్లో చిన్నపాటి వర్షాలకే వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో గిరిజనులు పడరాని పాట్లు పడుతున్నారు. వాగులను దాటలేక కొన్ని సార్లు రోజుల తరబడి గ్రామాలకే పరిమితమవుతున్నారు. అత్యవసర సమయాల్లో దేవుడే దిక్కు అన్నట్లుగా కాలం గడుపుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి, సిరికొండ, నార్నూర్, ఉట్నూర్, బజార్‌హత్నూర్, ఇచ్చోడ మండలాల్లోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ముఖ్యంగా ఇంద్రవెల్లి మండలంలోని చిట్టాబట్ట, జెండాగూడ, జైత్రంతండా, ఆర్కాపూర్, మామిడిగూడ, బజార్‌హత్నూర్ మండలం కొత్తపల్లి, మోర్కాండి, ఉమర్ధా, బుద్దునాయక్‌తండా, మన్కాపూర్, ఉట్నూర్ మండలం నర్సాపూర్ జె, ఆడగూడ, వంకతుమ్మ, పాటగూడ, నార్నూర్ మండలంలో ఉమ్రి, చిట్టగూడ గ్రామాలకు వెళ్లే దారులు ప్రమాదకరంగా ఉన్నాయి. వాగులు, వంకలపై బ్రిడ్జిలు లేకపోవడంతో వరద నీటిని దాటేందుకు ప్రాణాలు పణంగా పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. బజార్‌హత్నూర్ మండలంలోని కొత్తపెల్లి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ గత ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికలను గ్రామస్థులు బహిష్కరించారు. చివరకు అధికారులు, పోలీసులు జోక్యం చేసుకుని హామీ ఇవ్వడంతో సాయంత్రం గంటసేపు మాత్రమే ఓట్లు వేశారు. అయినా.. ఇప్పటిదాకా ఆ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించకపోవడం గమనార్హం.



ఉట్నూర్ మండలం వంకతుమ్మ వాగును ప్రమాదకరంగా దాటుతున్న గ్రామస్థులు (ఫైల్)

మీడియాపై దాడి చేస్తే కఠినచర్యలు

- వైసీపీ నేతలే దగ్గరుండి దాడి చేయించారు
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం
- 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శివకుమార్‌కు ఫోన్‌లో పరామర్శ

అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ బంగారుపాళ్యం పర్యటనను కవర్ చేస్తూ, వైసీపీ కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడిన ఏపీలోని చిత్తూరు జిల్లా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌ను ఏపీ సీఎం చంద్రబాబు ఫోన్‌లో పరామర్శించారు. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివకుమార్‌ను అడిగి ఆయన ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. శివకుమార్‌కు, ఆయన కుటుంబ సభ్యులకు సీఎం ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం శివకుమార్‌పై దాడి ఘటనను ఖండిస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో చంద్రబాబు పోస్టు చేశారు. 'చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ రౌడీ మూకల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. విధి నిర్వహణలో భాగంగా న్యూస్ కవరేజ్‌కు వెళ్లిన ఫొటోగ్రాఫర్‌పై తీవ్రస్థాయిలో దాడి చేసి గాయపర్చడం అమానుషం. శివకుమార్‌పై దాడిచేసినవారిపై కఠినచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాను. మీడియా హక్కులను కాపాడే విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది"అని చంద్రబాబు స్పష్టం చేశారు. కాగా, ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌ను కొట్టిన వైసీపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేశారు. ప్రధాన నిందితుడు ప్రకాశ్ ఆచారి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. మరోవైపు, శివకుమార్‌పై దాడి చేసిన వారికి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

నిమ్స్ మ్యాన్‌హోల్లో శిశువు మృతదేహం!

పంజాగుట్ట/నిమ్స్, జూలై10(ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆస్పత్రిలోని ఓ మ్యాన్‌హోల్లో నెలలు నిండకుండా పుట్టిన శిశువు మృతదేహం కనిపించడం తీవ్ర కలకలం రేపింది. మరుగుదొడ్డిలో నీళ్లు పోకపోవడంతో.. అది సరిచేసేందుకు మ్యాన్‌హోల్‌ను తెరిచిచూడగా ఓ మగబిడ్డ మృతదేహం లభ్యమైంది. ఆస్పత్రి పాత భవనంలోని ఆర్థో విభాగం సమీపంలోని ఈ ఘటన వెలుగుచూసింది. ఆస్పత్రికి వచ్చిన గుర్తు తెలియని గర్భిణి, టాయ్‌లెట్‌కు వెళ్లినప్పుడు నెలలు నిండకుండానే ప్రసవించి ఉంటుందని భావిస్తున్నారు. కాగా పోలీసులొచ్చి శిశువు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ గర్భిణి ఎవరు? అనేది గుర్తించేందుకు ఆస్పత్రిలోని సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

కల్తీ కల్లుకు మరో ఇద్దరు బలి

ఎనిమిదికి పెరిగిన మృతుల సంఖ్య!.. హైదరాబాద్‌లో ఒకరు.. నాగర్‌కర్నూల్‌లో మరొకరు

- వివిధ ఆస్పత్రుల్లో 35 మందికి వైద్యం
- నలుగురి అరెస్టు.. 2 దుకాణాల సీజ్
- ఘటనపై ఆగస్టు 20లోగా నివేదిక ఇవ్వాలని హెచ్‌ఆర్సీ ఆదేశం

హైదరాబాద్ సిటీ/హైదర్‌నగర్/ కూకట్‌పల్లి, నిమ్స్, ఖిల్లాఘణపురం జూలై 10 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో మరో ఇద్దరు మహిళలు మరణించారు. హైదరాబాద్‌లోని ఈఎస్‌ఐ ఆస్పత్రిలో నర్సమ్మ (54), నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో సింగనమోని వెంకటమ్మ (65) మృతి చెందారు. దీంతో ఈ ఘటనలో మృతుల సంఖ్య ఎనిమిదికి పెరిగింది. హైదరాబాద్, షంషీగూడలోని సాయిచరణ్ కాలనీకి చెందిన నర్సమ్మ (54) ఈఎస్‌ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించింది. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలానికి చెందిన సింగనమోని వెంకటమ్మ (65) హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీలో తన చిన్న కుమార్తె ఇంట్లో రెండు నెలలుగా ఉంది. ఆది, సోమవారాల్లో కేపీహెచ్‌బీ కాలనీలో కల్లుతాగి అస్వస్థతకు గురైన వెంకటమ్మ చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూలులో ఉన్న కుమారుడు దగ్గరకు వెళ్లింది. బుధవారం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన వెంకటమ్మ.. అదే రోజు రాత్రి మరణించింది. ఈ మేరకు నాగర్ కర్నూల్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, కల్తీ ఘటనలో మరో 35 మంది హైదరాబాద్‌లోని వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఘటన నేపథ్యంలో కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లోని కల్లు కాంపౌండ్‌లను తనిఖీలు చేసిన ఎక్సైజ్ శాఖ అధికారులు నలుగురిని అరెస్టు చేశారు. హైదర్‌నగర్‌లోని హెచ్‌ఎంటీ హిల్స్, సర్దార్‌పటేల్ నగర్ దుకాణాల్లోని కల్లులో అల్ప్రాజోలం కలిపినట్టు కనుగొన్నారు. దీంతో నిర్వాహకులను అరెస్ట్ చేసి, దుకాణాల లైసెన్సులను



వెంకటమ్మ, నర్సమ్మ (ఫైల్)

రద్దు చేశారు. కాగా, కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురైన మరి కొందరు ఆస్పత్రులకు క్యూకడుతున్నారు. హైదరాబాద్, ఆల్విన్‌కాలనీ డివిజన్ సాయిచరణ్‌కాలనీలో అన్నదమ్ములు నీలారెడ్డి, మన్నెంరెడ్డి, సత్తిరెడ్డి గురువారం గాంధీ ఆస్పత్రిలో చేరారు. నీలారెడ్డి పరిస్థితి విషమంగా ఉంది. అలాగే హైదర్‌నగర్‌కు చెందిన సత్యనారాయణ, సుగుణమ్మను గురువారం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

సమగ్ర దర్యాప్తుకు హెచ్‌ఆర్సీ ఆదేశం

కల్తీకల్లు ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి ఆగస్టు 20 లోగా నివేదిక ఇవ్వాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్(హెచ్‌ఆర్సీ) రెవెన్యూ విభాగం (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్) ప్రిన్సిపల్ సెక్రటరీకి గురువారం ఆదేశించింది. రామారావు అనే వ్యక్తి చేసిన ఫిర్యాదుకు స్పందించి కేసు నమోదు చేసిన హెచ్‌ఆర్సీ ఈ మేరకు చర్యలు తీసుకుంది. మరో పక్క, కల్తీ కల్లు తాగి ఆస్పత్రిపాలైన వారికి మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సంబంధిత అధికారులను టెలీకాన్ఫరెన్స్ ద్వారా గురువారం ఆదేశించారు. ఈ సంఘటనకు బాధ్యులైనవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, ఘటనపై సమగ్ర నివేదికను అందించాలని ఎక్సైజ్



నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించేందుకు వస్తున్న ఎన్. రాంచందర్ రావు

అధికారులను ఆదేశించారు.

రెండ్రోజుల్లో డిశ్చార్జిలు : రాజనర్సింహ

కల్తీ కల్లు వల్ల అస్వస్థతకు గురైన వారంతా కోలుకుంటున్నారని, మరో రెండు రోజుల్లో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అవుతారని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని మంత్రి గురువారం పరామర్శించారు. అనంతరం మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ.. ఘటనపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కల్లు కాంపౌండ్లపై దాడులు జరుగుతాయని తెలిపారు.

బీజేపీ, బీఆర్ఎస్ నేతల పరామర్శలు

కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కల్తీ కల్లు ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కూకట్‌పల్లి ఘటనలో ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం కనపడుతోందని ఆరోపించారు. ఇక, నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్.. కల్లులో ఏ రకమైన రసాయనాలు కలిపారనే విషయాన్ని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఇక, కల్తీ కల్లు ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మౌనం వహించడం బాధ్యతారాహిత్యమని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. కాగా, కల్తీ కల్లు ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పేర్కొన్నారు.

సారూ.. ఇటు చూడరూ..!

కల్తీ కల్లు ఘటన నేపథ్యంలో కల్లు కాంపౌండ్ల నిర్వాహకుల తీరు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కొందరు ప్రైవేటు దుకాణదారులు ప్రభుత్వ దుకాణమంటూ బోర్డు పెట్టి దందా నిర్వహిస్తున్నారు. కూకట్‌పల్లి డివిజన్‌లోని తాంధ్రపాపరాయుడు విగ్రహం సమీపంలోని దుకాణానికి నిర్వాహకులు ప్రభుత్వ కల్లు దుకాణం బోర్డు పెట్టారు. అలాగే, మూసాపేట, జనతానగర్‌లో మరో దుకాణాన్ని కూడా ఇలాగే నడిపిస్తున్నారు. ఇందులో ఎన్నింటికీ అనుమతులున్నాయో తెలుసుకునేందుకు ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓని ఫోన్‌లో సంప్రదించేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రయత్నించిగా స్పందించలేదు.



భూముల రీ సర్వే పూర్తి

కేంద్ర మార్గదర్శకాల మేరకు నిర్వహణ.. పైలట్ ప్రాజెక్టు కింద 5 గ్రామాల్లో సర్వే

- నక్ష పటాలను సిద్ధం చేసిన అధికారులు
- ఆమోదం కోసం ఉన్నతాధికారులకు నివేదిక

జగిత్యాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ భూముల రీసర్వేను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్ మోడ్రనైజేషన్ ప్రోగ్రామ్ (డీఐఎల్ఆర్ఎంపీ) మార్గదర్శకాలకు అనుగుణంగా డ్రోన్లు వినియోగిస్తూ.. ప్యూర్ గ్రౌండ్ ట్రూతింగ్ పద్ధతిలో ఆయా గ్రామాల్లో సర్వే చేపట్టారు. ఇందులో జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని కోమన్‌పల్లి, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని ములుగుమడ, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలంలోని సాహెబ్‌నగర్, ములుగు జిల్లా వెంకటాపూరం మండలంలోని నూగూరు, మహబూబ్‌నగర్ జిల్లా గండీడు మండలంలోని సలార్‌నగర్ ఉన్నాయి. నక్ష పటాలు లేని ఆయా గ్రామాల్లో ప్రత్యేక బృందాలతో రీ సర్వే జరిపారు. ఇందుకోసం మూడు ఏజెన్సీలను ఎంపిక చేయగా, జగిత్యాల జిల్లాలో మార్వెల్ జియో స్పేషియల్ సొల్యూషన్స్ ఏజెన్సీ సహకారంతో సర్వే, ల్యాండ్ రికార్డ్స్ శాఖ సర్వే నిర్వహించింది. వాస్తవానికి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన రైతులకు 1983-84లో బీర్‌పూర్ మండలం కోమన్‌పల్లి శివారులో అప్పటి ప్రభుత్వం పునరావాసం కల్పించింది. ప్రభుత్వ భూములను అందించి వాటిని వ్యవసాయానికి ఆమోదయోగ్యంగా మార్చింది. బాధితులందరికీ భూములపై హక్కులు కల్పిస్తూ డీ-1 పట్టాలు ఇచ్చింది. అయితే, కోమన్‌పల్లికి చెందిన భూములకు నక్ష పటం రూపొందించలేదు. దీంతో తరచూ భూ వివాదాలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే పైలట్ ప్రాజెక్టు కింద కోమన్‌పల్లిని ఎంపిక చేశారు. తొలుత గ్రామంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి రైతులకు రీ సర్వే జరిగే పద్ధతిని వివరించారు. ప్యూర్ గ్రౌండ్ ట్రూతింగ్ పద్ధతి ద్వారా సర్వే నిర్వహించి సరిహద్దులు గుర్తించారు. సర్వే ద్వారా నక్ష మ్యాప్‌ను తయారు చేశారు. ఇదే విధంగా మిగతా గ్రామాల్లోనూ ఏ సర్వే నంబరులో ఎంత భూమి ఉంది? ఏ సర్వే నంబరు ఎక్కడ ఉంది? గ్రామ భూములతో పాటు, గ్రామ కంఠంలో ఎన్ని ఎకరాల భూములున్నాయి? అసైన్డ్ భూములు ఎన్ని? అనే లెక్క తేల్చారు. ప్రస్తుతం ఉన్న సర్వే నంబర్లకు అధికారులు బై నంబర్లు ఇచ్చారు. రికార్డుల్లో ఉన్న భూమికి, క్షేత్ర స్థాయిలో ఉన్న భూమికి తేడాలను గుర్తించారు. సంబంధిత రికార్డులను ఉన్నతాధికారుల ఆమోదం కోసం పంపించారు. అక్కడ ఆమోదం పొందితే భూ సరిహద్దులకు సంబంధించి.. ఎలాంటి వివాదాలకు ఆస్కారం ఉండదని అధికారులు చెబుతున్నారు. సర్వేలో ఎదురైన అనుభవాలతో రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీ సర్వేకు మార్గదర్శకాలు రూపొందించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

హద్దులు నిర్ధారించి.. నక్ష రూపొందించాం

రాష్ట్రంలో భూముల రీ సర్వేకు నక్ష పటాలు లేని ఐదు గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా గుర్తించారు. ఇందులో భాగంగానే కోమన్‌పల్లిలో పకడ్బందీగా రీ సర్వే పూర్తి చేశాం. భూములకు సరిహద్దులను నిర్ధారించడంతోపాటు నక్ష పటాన్ని రూపొందించాం. జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు కమిషనర్ ఆఫ్ సర్వే సెటిల్‌మెంట్ అండ్ డైరెక్టర్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్‌కు పంపించాం.

\- వెంకట్‌రెడ్డి, ఏడీ, ల్యాండ్ అండ్ రికార్డ్స్, జగిత్యాల



ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలంలో గ్రామాలను చుట్టుముట్టిన ప్రాణహిత బ్యాక్ వాటర్

మేడిగడ్డకు భారీ వరద

- ప్రాణహితకు 6.65 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ఆసిఫాబాద్ జిల్లాలో 11 ఊళ్లకు దారి బంద్
- కాళేశ్వరం, భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి
- జూరాల, శ్రీశైలం, సాగర్‌కు నిలకడగా ప్రవాహం
- కృష్ణా ప్రాజెక్టుల్లో జల విద్యుత్ కాంతులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

మహారాష్ట్రలో వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోంది. దీంతో గోదావరి నది నిండుకుండలా ప్రవహిస్తోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ వద్ద గురువారం సాయంత్రం 6.65 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దీంతో 85 గేట్లను ఎత్తి అంతే నీటిని వదులుతున్నారు. కాళేశ్వరం వద్ద గోదావరి 10.6 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద గురువారం సాయంత్రం గోదావరి నీటి మట్టం 25.8 అడుగులకు చేరింది. గద్వాల జిల్లాలో కృష్ణా నదిపై ఉన్న జూరాల జలాశయానికి 1.07 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. 12 గేట్లు ఎత్తి, విద్యుత్ ఉత్పత్తి చేస్తూ, కాల్వల ద్వారా 1.13 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. 9 టీఎంసీల సామర్థ్యానికిగాను ప్రాజెక్టులో 7.4 టీఎంసీల నీరు ఉంది. శ్రీశైలం రిజర్వాయర్‌కు 1.75 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. మూడు గేట్లను పది ఫీట్ల మేర ఎత్తడంతో పాటు విద్యుదుత్పత్తి చేస్తూ, పోతిరెడ్డిపాడు, ఎంజీకేఎల్‌ఐ ద్వారా 1,70,347 క్యూసెక్కులను వదులుతున్నారు. ప్రాజెక్టులో 203.4 టీఎంసీల నీరు ఉంది. నాగార్జున సాగర్‌కు 1,20,191 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. వరద ఇలాగే కొనసాగితే శుక్రవారం సాయంత్రం ప్రాజెక్టు నీటి మట్టం (546 అడుగులు) గేట్లను తాకనుంది. సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు(312టీఎంసీలు) కాగా గురువారం సాయంత్రానికి 541.20 అడుగులు(190.8 టీఎంసీలు)గా ఉంది. ఎడమ కాల్వ ద్వారా 3,202 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,500 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 4,204 క్యూసెక్కులు.. మొత్తంగా 8,906 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కృష్ణాకు వరద పోటెత్తుతుండటంతో ఆ నదిపై ఉన్న జలవిద్యుత్ కేంద్రాల్లో గురువారం 26 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగింది.

ఆదిలాబాద్ జిల్లాలో జోరు వాన..

ఆదిలాబాద్ జిల్లాలో నాలుగైదు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి సాయంత్రం ముసురు వాన పడింది. అత్యధికంగా భీంపూర్ మండలంలో 76.8 మి.మీ, జైనథ్‌లో 76.1, సాత్నాలలో 68.3, ఇంద్రవెల్లిలో 52.1, బోరజ్‌లో 51.0, నార్నూర్‌లో 47.4, బేలలో 45.4, ఆదిలాబాద్ అర్బన్‌లో 38.5 మి.మీ వర్షం కురిసింది. గాదిగూడ మండలంలో ఖడ్కి వాగు ఉప్పొంగి ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆసిఫాబాద్ జిల్లాలో ప్రాణహితకు వరద పోటెత్తడంతో నది సరిహద్దున ఉన్న సిర్పూర్(టి), కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూరు, పెంచికల్‌పేట, దహెగాం మండలాల్లో బ్యాక్‌వాటర్ ముంచెత్తడంతో వాగులు, ఒర్రెలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో బెజ్జూరు మండలంలోని 11 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రాణహిత తీరంలో సుమారు 1,500 ఎకరాల్లో పత్తి, ఇతర పంటలు నీట మునిగాయి. కుమరంభీం ప్రాజెక్టులోకి 850 క్యూసెక్కుల వరద వచ్చి చేరడంతో రెండు గేట్లు ఎత్తి 880 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.



శాకంబరి అలంకరణలో భద్రకాళి

గురుపౌర్ణమి వేళ భద్రకాళి అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని పుడమి తల్లిగా 12 మంది అర్చకులు 15 వేల కిలోల కూరగాయలతో అలంకరించారు. 50 వేల మందికి పైగా భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. మంత్రి కొండా సురేఖ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. - వరంగల్ కల్చరల్, ఆంధ్రజ్యోతి

వృద్ధురాలైన తల్లిని రోడ్డు మీద వదిలేసి..

- మహబూబాబాద్ జిల్లాలో ముగ్గురు కుమారుల దాష్టీకం



రైతు వేదిక వద్ద వృద్ధురాలు భద్రమ్మ

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), జూలై 10 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలైన తల్లిని నెల రోజుల చొప్పున వంతులవారీగా పోషించేలా మాట్లాడుకున్న ఆ ముగ్గురు కుమారులు.. చివరకు ఆమెను రోడ్డు మీద వదిలేశారు. మహబూబాబాద్ జిల్లా గూడూ రు మండలం భూపతిపేటలో ఈ ఘటన వెలుగుచూసింది. వెంగంపేటకు చెందిన బొడ్డు భద్రమ్మ (75)కు ఆరుగురు సంతానంలో వెంకన్న, సుధాకర్, రమేశ్, యాకస్వామి కుమారులు. ఆరుగురికీ పెళ్లిళ్లు అయ్యాయి. భద్రమ్మ భర్త ముత్తయ్య 20 ఏళ్ల క్రితం మృతిచెందాడు. పెళ్లిళ్లయ్యాక కుమారులకు 30 గుంటల చొప్పున సాగుభూమిని భద్రమ్మ పంచి ఇచ్చింది. పెద్ద కుమారుడు వెంకన్న పదేళ్ల క్రితం మృతిచెందాడు. భద్రమ్మ కూలి పనులకు వెళుతూ బతుకుతోంది. వయసు మీద పడటంతో తన పనులు తాను చేసుకోలేని స్థితికొచ్చిన తల్లిని.. ముగ్గురు కుమారులు, పెద్ద కోడలు కొన్నాళ్లుగా వంతులవారీగా పోషిస్తున్నారు. అయితే.. పెద్ద కోడలు అనసూర్య వంతు వచ్చేసరికి.. ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూ అత్తను పోషించలేనని తేల్చిచెప్పింది. దీంతో తల్లిని యాకస్వామి భూపతిపేట రైతువేదక వద్ద వదిలేసి తన ఊరికి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు.. గ్రామస్థుల సమక్షంలో ముగ్గురు కుమారులు, వారి భార్యలను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆపై ముగ్గురు కోడళ్లు సులోచన, ఉపేంద్ర, నాగలక్ష్మి కలిసి ఆటోలో అత్త భద్రమ్మను వెంటబెట్టుకొని పెద్దకోడలు అనసూర్య ఇంటికి తీసుకువెళ్లారు.

వరకట్న వేధింపులతో నిండు గర్భిణి ఆత్మహత్య

- భర్తే హత్యచేశాడని ఆరోపణలు



మానస (ఫైల్)

టేక్మాల్ జూలై 10 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులతో ఓ నిండు గర్భిణీ ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని మహ్మద్‌పల్లి గ్రామంలో జరిగింది. హస్సన్ మహ్మద్ పల్లి గ్రామానికి చెందిన ఎక్కిల్ల మానస (17)కు మహ్మద్ పల్లి గ్రామానికి చెందిన గంగమేశ్వర్‌కు రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వరకట్నంగా 5 తులాల బంగారం, ఒక బైక్‌ను ఇవ్వడానికి మానస తల్లిదండ్రులు అంగీకరించారు. ఒక తులం బంగారం, బైకుతో పాటు ఇతర సామగ్రిని అందజేశారు. మిగతా నాలుగు తులాల బంగారం ఖరీఫ్ పంట చేతికొచ్చిన తర్వాత ఇస్తామని ఒప్పుకున్నారు. వివాహానికి ముందే గంగమేశ్వర్‌ను వారి తల్లిదండ్రులు దత్తత తీసుకున్నారు. రెండు నెలల క్రితం బంగారం విషయంలో తండ్రి బీరయ్యతో గంగమేశ్వర్ గొడవ పడ్డాడు. మానస 9 నెలల గర్భవతి కావడంతో ప్రసవం నిమిత్తం కూతురును పుట్టింటికి పంపిచమని ఆమె తల్లిదండ్రులు అడగగా అత్తింటివారు పంపించలేదు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మానస ఉరేసుకుంది. గంగమేశ్వర్ ఇంటికి వచ్చి ఉరివేసుకున్న మానసను చూసి తన స్వగ్రామమైన పెద్దశంకరంపేట మండలం మూసాయిపేటకు పారిపోయాడు. సమాచారం అందుకున్న మానస తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. వరకట్నం పేరుతో వేధించి మానసను భర్త గంగమేశ్వరే హత్యచేసి, తన స్వగ్రామానికి పారిపోయాడని మానస తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఘటనా స్థలాన్ని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ పరిశీలించారు.

14 నుంచి పాఠశాల విద్యాశాఖలో ఈ-ఆఫీస్

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో కాగిత రహిత పాలన అమల్లోకిరానుంది. ఇకపై తన కార్యాలయానికి జిల్లాల నుంచి కాగితదస్త్రాలు పంపకూడదని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ గురువారం అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులను ఆదేశించారు. అత్యవసర దస్త్రాలు కూడా పాఠశాల విద్యాశాఖ పోర్టల్ ద్వారానే స్వీకరిస్తామని స్పష్టం చేశారు. విద్యాశాఖలో కాగితరహిత పాలన లక్ష్యంగా విద్యాశాఖ కార్యదర్శిగా ఉన్న సందీప్ కుమార్ సుల్తానియా ఈ-ఆఫీస్ అమలుపై 2021 మేలోనే ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే ఉన్నత విద్య, సాంకేతిక విద్య, ఇంటర్ బోర్డుల్లో ఇది అమల్లో ఉంది. ఈ నెల 14 నుంచి పాఠశాల విద్యలో పూర్తిస్థాయిలో దీనిని అమలు చేయాలని నవీన్ నికోలస్ ఆదేశాలు జారీ చేశారు.

తెలంగాణ ప్రభుత్వం
అటవీశాఖ హనుమకొండ జిల్లా
సంక్షిప్త టెండరు ప్రకటన

ఆర్.సి.నెం.794/2025/ఎస్4 తేది: 09.07.2025

హనుమకొండ జిల్లాలో గల "కాకతీయ జంతు ప్రదర్శన శాల"లో 2025-26 సంవత్సరమునకు క్రింద పేర్కొనబడిన (02) రెండు పనులకు గాను వేరువేరుగా (ప్రతి పనికి వేరుగా టెండర్ ఫారం దాఖలు చేయాలి) నమోదిత కాంట్రాక్టర్లు/ పని అనుభవం గల సంస్థలు మరియు వ్యక్తిగత సీల్డ్ టెండర్లు ఆహ్వానించబడినవి. 1) జంతువులు మరియు పక్షులకు ఆహారము మరియు ధాన్యాలు (4 ఐటమ్స్‌లలో) సరఫరా చేయుట. 2) జంతు ప్రదర్శన శాలలో మోటారు వాహనాల పార్కింగ్ నిర్వహణ చేయుట. టెండరు డాక్యుమెంట్లు పొందుటకు మరియు పైన పేర్కొనబడిన (3) మూడు పనుల సమగ్ర సమాచారం కొరకు జిల్లా అటవీ శాఖాధికారి, హనుమకొండ & జనగాం జిల్లా గారి కార్యాలయం యొక్క పని దినములలో **11.07.2025 నుండి 18.07.2025 మ.2.00 గం. వరకు** సంప్రదించగలరు. పై (2) రెండు పనులకు గాను, 1) టెండరు ఫారంలు పొందుటకు ఆఖరు తేది: **18.07.2025 మ.2.00 గం.కు.** 2) సీల్డ్ టెండర్ ఫారంల దాఖలుకు ఆఖరు తేది: **18.07.2025 సా.04.00 గం.కు** 3) సీల్డ్ టెండర్లు తెరచు తేది: **18.07.2025 సా.05.00 గం.కు**

సం/- జిల్లా అటవీ శాఖాధికారి (పూ.అ.భా), హనుమకొండ మరియు జనగాం

DIPR RO No.4813-PP/CL/ADVT/1/2025-26 తేది:10.07.2025

తెలంగాణ ప్రభుత్వం
తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ

NIT No.E/5510/TGMREIS/2025 **ఇ-సంక్షిప్త టెండరు ప్రకటన** తేది: 09.07.2025

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని 33 జిల్లాలలో ఉన్న అన్ని TGMR పాఠశాలలు మరియు జూనియర్ కళాశాలలలో ఇన్‌స్టాల్ చేయబడిన ప్రస్తుత CCTV సిస్టమ్‌లు నిరంతరాయముగా పనిచేయడానికి స్పేర్స్/ కాంపోనెంట్స్ మరమ్మతులు మరియు రీప్లేస్‌మెంట్ సర్వీసులు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ శాఖలకు అట్టి సర్వీసులను అందించడంలో కనీసం మూడు (03) సంవత్సరాల అనుభవం కలిగిన మరియు తెలంగాణ ప్రభుత్వం యొక్క సమర్థ ప్రాధికారులు / డిపార్ట్‌మెంట్‌లచే జారీచేయబడిన అవశ్యకమైన వ్యాలిడ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు / లైసెన్సులు కలిగిన ప్రభుత్వ ఏజెన్సీలు/ ప్రభుత్వరంగ ఏజెన్సీల నుండి తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలో ఉన్న 268 భవనాల క్యాంపస్‌లలో ఉన్న 205 TGMR పాఠశాలలు మరియు జూనియర్ కళాశాలలను నిర్వహిస్తున్న TGMREI సొసైటీ వారు రెండు భాగాలలో (టెక్నికల్ బిడ్ మరియు ఫైనాన్షియల్ బిడ్) ఇ-సంక్షిప్త టెండర్లు కోరుచున్నారు.

ఇందుకు సంబంధించి ఇ-సంక్షిప్త టెండరు: **https://tender.telangana.gov.in** వెబ్‌సైట్‌లో 11.07.2025 నుండి 22.07.2025 వరకు లభిస్తుంది. వివరణ: క్ర.సం: **01)** ఇ-టెండరు ప్రచురణ తేది: 11.07.2025. **02)** ప్రి-బిడ్ సమావేశం: 14.07.2025 మ.03:00 గం. **03)** టెండర్ల దాఖలుకు చివరి తేది: 22.07.2025 సా.05:00 గం. **04)** టెండరుదారులచే హార్డ్‌కాపీ దాఖలు చేయుట: 23.07.2025 సా.05:00 గం. **04)** టెక్నికల్ బిడ్లు తెరచుట: 24.07.2025 మ.03:00 గం. **05)** ఫైనాన్షియల్ బిడ్లు తెరచు తేది: 25.07.2025 మ.03:00 గం.

సం/- సెక్రటరీ, TGMREIS

DIPR RO No.4830-PP/CL/ADVT/1/2025-26, Dt: 10.07.2025

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

నిర్లక్ష్యం కూల్చిన వంతెన

గుజరాత్‌లోని వడోదరలో మహి నదిపైన నలభైయేళ్ళక్రితం నిర్మించిన బ్రిడ్జి పాక్షికంగా కూలిన ఘటనలో మృతుల సంఖ్య పదహారుకు పెరిగింది. మరో ముగ్గురి ఆచూకీ తెలియాల్సి ఉన్నదని, గాలింపుచర్యలు కొనసాగుతున్నాయని చెబుతున్నా, ఆశలూ అవకాశాలూ అంతంతమాత్రమే. భారీశబ్దాలతో ఓ భాగం కూలడం, దానిపైన ప్రయాణిస్తున్న వాహనాలు వరుసపెట్టి నదిలో పడిపోవడం అతిదగ్గరగా గమనించిన మత్స్యకారులు భయంతో వొణికిపోయారు. ఈ వంతెనకు రిపేర్లు, తనిఖీలు, నాణ్యత పరీక్షలు ఎప్పుడు, ఎవరు నిర్వహించారన్న వివరాలు తెప్పించుకొని మరీ నలుగురు ఇంజనీర్లను ముఖ్యమంత్రి భూపేంద్రపటేల్ గురువారం సస్పెండ్ చేశారట. ఆ నివేదికలో ఇంకా ఏమున్నదో, పాపులు వీరని ఎలా నిర్ణయించారో మనకు తెలియదు. అయితే, సరిగ్గా మూడేళ్లక్రితం వడోదరకు చెందిన ఒక సామాజిక కార్యకర్త ఈ బ్రిడ్జి నిర్వహణకు సంబంధించి ఒక అధికారితో చేసిన సంభాషణ ఈ ప్రమాదం నేపథ్యంలో వెలుగులోకి వచ్చింది. వంతెన పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నందున తనిఖీలు, మరమ్మతులు వెంటనే చేపట్టాలంటూ తాము ఇప్పటికే ప్రతిపాదనలు పంపామంటూ సదరు అధికారి వివరిస్తున్న సంభాషణ అది. ఈ వంతెన ఏడాదికంటే నిలవదని, కూలడం ఖాయమని ఆ అధికారి అప్పట్లోనే చెబితే, అది మరో మూడేళ్ళు నిలిచి, ఎవరూ ఎంతకూ పట్టించుకోని కారణంగా ఇప్పటికి ఇలా కూలిందని అర్థం.

ఇది కాంగ్రెస్ ఏలుబడిలో నిర్మించిన బ్రిడ్జి అనీ, వారి చేతిచలువవల్లనే, నాలుగుదశాబ్దాలకే దానికి నూరేళ్ళూ నిండిపోయాయని బీజేపీ నాయకులు ఎద్దేవా చేస్తున్నారు. ఇది పూర్తిగా నిర్వహణ లోపమనీ, రాష్ట్రంలో గత నాలుగేళ్ళలో ఈ తరహాఘటనలు కనీసం ఏడు జరిగిన నేపథ్యంలో సిట్ విచారణకు ఆదేశించాలని కాంగ్రెస్ అంటోంది. గుజరాత్‌లో అవినీతి పతాకస్థాయిలో ఉన్నందున, ప్రతీ దానినీ డబ్బుతో ముడిపెడుతూ చివరకు ప్రజల ప్రాణాలకు కూడా రక్షణలేకుండాపోయిందని కాంగ్రెస్ విమర్శ. గతంలో బ్లాక్‌లిస్ట్ చేసిన కంపెనీలు కూడా ఇప్పుడు కాంట్రాక్టులు సంపాదిస్తున్నాయని, అవి కట్టినవి కూలిపోతున్నా, మరమ్మతులు నిలవకున్నా పాలకులు నిమ్మకునీరెత్తినట్టు ఉంటున్నారని కాంగ్రెస్ వాదన. మధ్య గుజరాత్‌ను సౌరాష్ట్రతో అనుసంధానించే అతి కీలకమైన ఈ బ్రిడ్జి నిర్వహణలోనూ అవినీతి, నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగిందన్నది విమర్శ. ఆనంద్–వడోదర జిల్లాలను కలిపే ఈ బ్రిడ్జి కూలిన కారణంగా ఈ మార్గం గుండావెళ్ళే వాహనాలు ఇప్పుడు యాభైకిలోమీటర్లు చుట్టూ తిరిగిపోవలసి వస్తోంది.

ఈ వంతెనలో నిర్మాణపరమైన లోపాలేమీ లేవని, కూలిన భాగాలు ముందే దెబ్బతిన్న సూచనలూ కనబడలేదని, వందేళ్ళు నిలవాల్సిన ఈ నిర్మాణానికి గత ఏడాది కూడా చిన్నచిన్న రిపేర్లతో నిర్వహణ సుబ్బరంగా చేశామని, సామాజిక మాధ్యమాల్లో సాగుతున్న ప్రచారాలను ఏ మాత్రం నమ్మవద్దని అత్యున్నత ఇంజనీర్ ఒకాయన గురువారం మీడియాకు వివరణ ఇచ్చారు. ఏ లోపమూ లేదు, ఏ లోటూ చేయలేదు కానీ, అదే తనకుతానుగా కూలిందన్నట్టుగా ఆయన మాట్లాడారు. మానవతప్పిదాలు, నిర్లక్ష్యాలు, లేదా కుట్రలు లేనిదే ఈ స్థాయి ప్రమాదాలు జరగవు. రాకపోకలు ఆపకుండా, ప్రయాణానికి పనికిరాదని నిర్ధారించకుండా, మరోవైపు మరమ్మతులు చేయకుండా నిర్వహణను గాలికి వదిలేసి ఇప్పుడు ఎందుకు కూలిందో తెలియదన్నట్టుగా మాట్లాడటం విచిత్రం. నష్టపరిహారాలు ఇవ్వడం, కమిటీలు వేయడం ఇటువంటి సందర్భాల్లో సహజంగా జరిగిపోతాయి. బలంగా ఉన్నదనీ, నూరేళ్ళు నిలవాల్సినదనీ అంటున్న బ్రిడ్జి అర్థంతరంగా ఇలా ఎందుకు ఒరిగిందన్న సత్యం ఎప్పుడు తెలుస్తుందో, ఎవరు ఆ గుట్టు విప్పుతారో చూడాలి. ఉదయం ఏడున్నర గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది కాబట్టి సరిపోయింది కానీ, రద్దీ వేళల్లో అయితే మృతుల సంఖ్య చాలా హెచ్చుగా ఉండేది. రద్దీసమయాల్లో అతివేగంగా వాహనాలు పోతున్నప్పుడు ఈ భాగం నుంచి భారీ శబ్దాలు వెలువడేవని మత్స్యకారులు చెబుతున్నారు. ప్రమాదఘంటికలు ఎంతోకాలంగా వినిపిస్తున్నా ఎవరికీ పట్టకపోవడం ఆశ్చర్యం. 2022లో మోర్బీ బ్రిడ్జి కుప్పకూలిన ఘటన నుంచి గుజరాత్ ఏ పాఠాలూ నేర్చుకోలేదని, ప్రజల భద్రత పాలకులకు పట్టలేదని ఈ ఘటన తెలియచెబుతోంది.

ఈ శతాబ్ద ఆధిపత్యం ఎవరిది?





■ రాహుల్ కుమార్

కాల విభజనలేని పరిస్థితిని ఊహించలేం. శకం, యుగం, శతాబ్దం, దశాబ్దం అంటూ ఎన్నో విభజనలు పెట్టుకుని ప్రగతినీ క్షీణతనీ మదింపు వేసుకుని ఆశనిరాశల్లో కొట్లాడటం అన్ని కాలాల్లోనూ ఉంది. 20వ శతాబ్దం దీనికి అతీతం కాదు. దాన్ని విప్లవాత్మకమైందిగా, యుద్ధ బీభత్సమైందిగా, పర్యావరణ వినాశనకరమైందిగా పేర్కొంటూ ఎన్నో వ్యాఖ్యానాలూ వచ్చాయి. వాటితోపాటు శతాబ్ది, దశాబ్ది ఆధిక్యతలనూ కొన్ని దేశాలకు ఆపాదించటమూ జరిగింది. కిందటి శతాబ్దం అమెరికాదే నంటూ పేర్కొనటం అలాంటిదే. ఆ సూత్రీకరణలో నిజం లేకపోలేదు! శాస్త్ర, సాంకేతిక, ఆర్థిక, సైనిక, రాజకీయ శక్తిగా అమెరికాకు సాటిరాగల దేశం 20వ శతాబ్దంలో ఏదీ లేదు. ఆ ఘనతను అమెరికాకు ఆపాదించటంలో పెద్దగా భిన్నాభిప్రాయాలు వ్యక్తం కాలేదు. ఒక శతాబ్దం పాటు ఒక దేశం తిరుగులేని శక్తిగా ఉండటం సాధారణ విషయం కాదు. ప్రజాస్వామ్యం, స్వయంపాలన, సమానత్వం కోసం ఎన్నో రూపాల్లో, ఎన్నో దేశాల్లో ప్రజలు నినదించి ఉద్యమించిన శతాబ్దంలో దాన్ని సాధించటమే ఒక విశేషం!

కీలక రంగాల్లో ఆ ఆధిక్యత అగ్రరాజ్య హోదానీ అమెరికాకు కట్టబెట్టింది. సోవియట్ యూనియన్ కొంతకాలం సైనికశక్తిపరంగా అమెరికాకు బలమైన సవాల్ విసిరినా ఆర్థిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దీటైన పోటీని ఇవ్వలేకపోయింది. అందుకే 20వ శతాబ్దం అమెరికాదేనన్న భావనపై పెద్దగా వివాదం నెలకొనలేదు. ఇప్పుడు ఆ పరిస్థితి వేగంగా మారిపోతోంది. 21వ శతాబ్దంలో అమెరికాకు అగ్రతాంబూలం ఇచ్చే పరిస్థితి రోజురోజుకీ తరిగిపోతోంది. ఒకనాటి బ్రిటన్ పరిస్థితే అమెరికాకు 2050 నాటికి ఎదురవుతుందన్న అంచనాలు పెరుగుతున్నాయి. మరోవైపు ఆసియాదే 21వ శతాబ్దం అన్న భావన బలం పుంజుకుంటోంది. డొనాల్డ్ ట్రంప్ సారథ్యంలో అమెరికా ప్రతిచర్యనూ సందిగ్ధ దృష్టితో చూడటం దేశదేశాలకు అలవాటైపోతోంది. అగ్రరాజ్య అధ్యక్షుడి వ్యవహారశైలిపై దేశాధినేతలు లోలోపల రగిలిపోవటం అంతర్జాతీయ వ్యవహారాల్లో ఎప్పుడూ చూడని పరిణామం.

అమెరికా ఆధిపత్యానికి గండిపడుతున్న దృశ్యం మూడు విషయాలను పరిశీలిస్తే స్పష్టంగా అర్థమవుతుంది. ఆర్థికాభివృద్ధి ఆశించిన స్థాయిలో వేగం పుంజుకోవటం లేదు. 2008 ఆర్థిక సంక్షోభం తర్వాత ఒకటి రెండేళ్ల మినహా పరిస్థితి ఏ మాత్రం మెరుగుపడలేదు. స్థూలదేశీయ ఉత్పత్తి (జీడీపీ) 1990 నుంచి సగటున 2.40శాతం దాటలేదు. అదే కాలంలో చైనా సగటు జీడీపీ 8.74శాతం ఉంది. ఖర్చులకు అనుగుణంగా పన్ను ఆదాయాన్ని పెంచుకోలేని దుస్థితిలో అమెరికా పడిపోయింది. ప్రపంచ దేశాలకు లోటు బడ్జెట్‌ల గురించీ అప్పుల కట్టడి గురించీ నిత్యమూ పాఠాలు వినిపించిన అమెరికా ఈ రెండు విషయాల్లో క్రమేపీ సంక్షోభ స్థితిలోకి వెళుతోందనే ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. 2024 ఫెడరల్ బడ్జెట్‌లో 6.75 ట్రిలియన్ డాలర్లను ఖర్చుపెట్టాలని ప్రతిపాదిస్తే వచ్చే ఆదాయాన్ని 4.92 ట్రిలియన్ డాలర్లుగా చూపించారు. ఈ లోటును భర్తీ చేసుకోటానికి అప్పులు తప్ప మరోమార్గం లేదు. ఇప్పటికే అమెరికా అప్పులు 37 ట్రిలియన్ డాలర్లకు చేరాయి. ట్రంప్ మానసపుత్రికగా చెప్పుకొనే 'బిగ్ బ్యూటిఫుల్ బడ్జెట్ బిల్' చట్టంతో అవి 40 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతాయి. జీడీపీతో పోల్చితే అప్పులు 133 శాతానికి చేరుకుంటాయి. అప్పులపై చెల్లింపులే వచ్చే 10 ఏళ్లల్లో 13.8 ట్రిలియన్ డాలర్లకు పైగా ఉంటాయి. 2024 బడ్జెట్‌లో వీటి కోసం 14.06 శాతం నిధులను ప్రతిపాదించారు.

అప్పుల భారం తీవ్రంగా ఉన్నా పన్ను రాయితీలను మరింతగా పెంచుతున్నారు. ఆదాయ అసమానతలను ఇవి తగ్గిస్తున్నాయా? అంటే అదీలేదు. 1980ల నుంచీ సంపద, ఆదాయాల్లో అసమానతలు విపరీతంగా పెరిగిన దేశాల్లో అమెరికా ఒకటి. పన్ను రాయితీలన్నీ అధికాదాయం కలిగిన 10 శాతం జనాభాకే లబ్ధిని చేకూర్చుతున్నాయి. 2017లో ట్రంప్ ప్రవేశపెట్టిన పన్నురాయితీలు ఈ డిసెంబరుతో ముగిసిపోతాయి. వాటిని కొనసాగించటానికే ప్రధానంగా కొత్త చట్టాన్ని ఆమోదించారు. ఆరోగ్య, ఆహార సబ్సిడీల్లో కోతలు విధించి రక్షణ బడ్జెట్‌కు అదనంగా 150 బిలియన్ డాలర్లను ఇస్తున్నారు. శుద్ధ ఇంధనంపై రాయితీలను తగ్గించారు. రిపబ్లికన్ పార్టీ దృష్టిలో పర్యావరణ విధ్వంసానికి విలువ ఉండదు. అసలు విధ్వంసం జరుగుతున్న విషయాన్నే అంగీకరించని సందర్భాలు ఎక్కువ. ప్రగతి వ్యతిరేకులు మాత్రమే విధ్వంసం గురించి మాట్లాడతారని రిపబ్లికన్ నేతలు ఎద్దేవా చేస్తారు. వలసల నియంత్రణకు బడ్జెట్‌ను విపరీతంగా పెంచారు. వచ్చే అయిదేళ్లలో 100 బిలియన్ డాలర్లను ఇందుకోసం ఖర్చుపెడతారు. ప్రస్తుతం ఏటా 8 బిలియన్లు ఉన్న ఖర్చు 20 బిలియన్లకు పెరుగుతుంది. అంటే విదేశీ విద్యార్థులు, ఉద్యోగార్థులతో పాటు అక్రమంగా అమెరికాలో ప్రవేశించే వారిపై తనిఖీలు, వెనక్కి పంపటాలు ఎక్కువవుతాయి. లోటు బడ్జెట్‌ను తగ్గించటానికి ధనికుల నుంచి అధిక పన్నులను వసూలుచేసే వెసులుబాటు ఉన్నా దాన్ని కాదనుకుని అనుచితంగా వాణిజ్య యుద్ధాలను ప్రకటించి అన్ని దేశాల్లో ఆగ్రహాన్ని రేకెత్తించటం ఇంతలా ఎప్పుడూ జరగలేదు.

1990ల నుంచి సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులతో మంచి ఉద్యోగాలు ఉన్నత చదువులు ఉన్నవారికే పరిమితం అవుతున్నాయి. కృత్రిమ మేధతో అదింకా ఉధృతం అవుతోంది. సంపదను సృష్టించే రంగాల్లో ఉద్యోగ కల్పన తగ్గుముఖం పడుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దటానికి కొత్త విధానాలు చేపట్టే దిశగా అమెరికాలో అడుగులు పడటం లేదు. అందినంత మేర అప్పులు చేయటం, భారీలోటు బడ్జెట్లతో బండినెట్టుకు రావటమే విధానమైపోయింది. ఆర్థికాభివృద్ధి వేగం పుంజుకోక పోవటానికి విపరీత ఆదాయ అసమానతలు ప్రధాన కారణంగా పేర్కొంటూ ఎన్నో అధ్యయనాలు వెలువడ్డాయి. కొనుగోలు శక్తి కొద్ది మంది చేతుల్లో భారీగా ఉండటం ఆర్థిక వ్యవస్థకు అవసరమైన వస్తువుల గిరాకీని బాగా తగ్గిస్తుంది. దీన్ని సరిదిద్దకుండా చౌక ధరలకు ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్న దేశాలను శత్రువులుగా చూపించటమే ట్రంప్ హయాంలో సర్వసాధారణమైంది. ఇతర దేశాల నుంచి దిగుమతులు అవుతున్న ఉత్పత్తులతో అమెరికాలోని పారిశ్రామిక కార్మికులకు డిమాండు తగ్గిపోయింది. పెరిగిన ధరలతో పోల్చితే వేతనాల్లో పెరుగుదల నిలిచిపోయింది. పాఠశాల విద్య వరకూ చదివి కిందిస్థాయి ఉద్యోగాలకు పరిమితమైనవారు.. వేతనాల పెంపు కోసం సంఘటితమయ్యే పరిస్థితిని కోల్పోయారు. అన్నివైపులా అసంతృప్తి నెలకొన్న ఈ నేపథ్యంలోనే అమెరికాను మళ్లీ గొప్పదేశంగా మార్చుతానంటూ ట్రంప్ మొదటిసారి అధికారంలోకి వచ్చారు. బైడెన్ హయాంలోనూ పరిస్థితులు పెద్దగా మారకపోవటంతో రెండోసారి ట్రంప్ సునాయాసంగానే ఎన్నికల్లో గెలిచారు.

అమెరికా వృద్ధి, క్షీణతలను విశ్లేషించిన నిపుణులు నాలుగు కీలక విషయాలను ప్రస్తావిస్తున్నారు. మొదటిది.. అసమానతలు విపరీతంగా పెరగటం వల్ల ఆదాయంలో సింహభాగం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమైంది. రెండోది.. కిందటి శతాబ్దంలో జరిగినంత వేగంగా విద్యావ్యాప్తి జరగటం లేదు. ఉత్పాదకతలో పెరుగుదలను ఇది తగ్గిస్తోంది. మూడోది.. సగటు పనిగంటలు తగ్గుతున్నాయి. నాలుగోది.. వృద్ధుల సంఖ్య పెరగటంతో జనాభాలో పనిచేసే సామర్థ్యం ఉన్న వారి శాతం క్రమంగా తగ్గిపోతోంది. ఈ నాలుగు అంశాలూ ఇలాగే కొనసాగితే మెజారిటీ ప్రజల వాస్తవిక ఆదాయంలో ఎదుగుదల వచ్చే 25 ఏళ్లలో కూడా కన్పించని పరిస్థితినే తీసుకురావచ్చు. దీంతో అమెరికా ఆధిపత్యానికి కచ్చితంగా గండిపడే అవకాశాలే ఎక్కువ.

> **అమెరికా వృద్ధి, క్షీణతలను విశ్లేషించిన నిపుణులు నాలుగు కీలక విషయాలను ప్రస్తావిస్తున్నారు. మొదటిది.. అసమానతలు విపరీతంగా పెరగటం వల్ల ఆదాయంలో సింహభాగం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమైంది. రెండోది.. కిందటి శతాబ్దంలో జరిగినంత వేగంగా విద్యావ్యాప్తి జరగటం లేదు. ఉత్పాదకతలో పెరుగుదలను ఇది తగ్గిస్తోంది. మూడోది.. సగటు పనిగంటలు తగ్గుతున్నాయి. నాలుగోది.. వృద్ధుల సంఖ్య పెరగటంతో జనాభాలో పనిచేసే సామర్థ్యం ఉన్న వారి శాతం క్రమంగా తగ్గిపోతోంది. ఈ నాలుగు అంశాలూ ఇలాగే కొనసాగితే మెజారిటీ ప్రజల వాస్తవిక ఆదాయంలో ఎదుగుదల వచ్చే 25 ఏళ్లల్లో కూడా కన్పించని పరిస్థితినే తీసుకురావచ్చు. దీంతో అమెరికా ఆధిపత్యానికి ఖచ్చితంగా గండిపడే అవకాశాలే ఎక్కువ.**

కిందటి శతాబ్దం అమెరికాదిగా భావించటానికి మరో ముఖ్యమైన కారణం అక్కడి విశ్వవిద్యాలయాలు నిర్వహించిన పాత్ర. శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి ఉరుకులు పరుగులెత్తటంలో అమెరికా విశ్వవిద్యాలయాల చేయూత అసాధారణమైంది. వస్తూత్పత్తి రంగం (మాన్యుఫాక్చరింగ్ సెక్టార్) అమెరికాలో 1870–1970 మధ్య కీలకపాత్ర పోషించింది. 1945 నాటికి ప్రపంచ పారిశ్రామిక ఉత్పత్తిలో అమెరికా వాటా 50 శాతం ఉండేది. 1990ల నాటికి అది గణనీయంగా పడిపోయినా సాఫ్ట్‌వేర్, డిజిటల్ రంగాల్లో సాధించిన మౌలిక ఆవిష్కరణలు చరిత్రలో ఎన్నడూ లేనంతగా ప్రపంచం అనుసంధానం అవ్వటానికి దోహదం చేశాయి. ఆ ఆవిష్కరణల్లో కంపెనీలు, సంస్థలతో పాటు విశ్వవిద్యాలయాల పాత్ర విస్మరించలేనిది. సామాజిక శాస్త్ర పరిశోధనల్లో కూడా విశ్వవిద్యాలయాలు గణనీయపాత్రను పోషించాయి. భారత్‌కు సంబంధించిన అనేక విషయాలపై లోతైన పరిశోధనలు, విశ్లేషణలు అందివ్వటంలో అమెరికా వర్సిటీలు చాలా ముందున్నాయి. నిధుల లభ్యత, మార్కెట్ అవసరాలతో పాటు స్వతంత్ర పరిశోధనలు వర్సిటీలకు అస్తిత్వాలుగా మారాయి. భారత్‌కు సంబంధించి ఏ విషయంలోనైనా మౌలిక పరిశోధనలు పదింటిని లెక్క పెడితే అందులో సగమైనా అమెరికా వర్సిటీల నుంచి వెలువడినవే అయివుంటాయి. అమెరికాకు ఎనలేని గుర్తింపు తెచ్చిన వర్సిటీలపై ప్రభుత్వం వైపు నుంచి బహిరంగంగా వేధింపులు.. నిధుల కోతలు, గుర్తింపు రద్దులు లాంటి హెచ్చరికలు గతంలో ఎప్పుడూ లేవు. అసమ్మతిని, ప్రభుత్వ వ్యతిరేకతను సహించటం, ప్రత్యామ్నాయ ఆలోచనల మంచిచెడ్డలపై సమాలోచనలు జరపటం అక్కడ వర్సిటీలకు ఉన్న బలం. ఇప్పుడా బలాన్ని దెబ్బతీయటం మొదలైంది. ఇదింకా పేట్రేగితే అమెరికా ఆధిపత్యానికి కారణమైన మేధో పునాదే బీటలు వారటం మొదలవుతుంది.

> **అసమ్మతిని, ప్రభుత్వ వ్యతిరేకతను సహించటం, ప్రత్యామ్నాయ ఆలోచనల మంచిచెడ్డలపై సమాలోచనలు జరపటం అమెరికా వర్సిటీలకు ఉన్న బలం. ఇప్పుడా బలాన్ని దెబ్బతీయటం మొదలైంది. ఇదింకా పెట్రేగితే అమెరికా ఆధిపత్యానికి కారణమైన మేధో పునాదే బీటలు వారటం మొదలవుతుంది.**

అంతర్జాతీయ వ్యవహారాల్లో ఈ శతాబ్దంలో అమెరికాకు ఎదురుదెబ్బలే ఎక్కువ. అమానవీయ చర్యలతో, తప్పుడు నిర్ణయాలతో స్నేహ దేశాల దృష్టిలోనూ పెద్దరికాన్ని కోల్పోతోంది. ఇరాక్‌పై యుద్ధాన్ని (2003) మొదలుపెట్టి ఘోరంగా విఫలమైంది. ఇస్లామిక్ తీవ్రవాదంపై పోరుతో సాగించిన యుద్ధం అదింకా పెరిగేలా చేసింది. ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబాన్లకు తిరిగి అధికారాన్ని కట్టబెట్టేలా వ్యవహరించింది. పాలస్తీనా సమస్యను ఆరని అగ్నిగుండంగా మార్చింది. హమాస్ తీవ్రవాదులపై దాడుల పేరుతో గాజాలో నరమేధాన్ని సాగిస్తోందన్న ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలిచి ఆ ఘోరకలిని పర్యవేక్షిస్తోందన్న అపకీర్తిని తెచ్చుకుంటోంది. నాటో కూటమిని విస్తరించి రష్యా–ఉక్రెయిన్‌ల మధ్య చిచ్చు రగిల్చింది. వియత్నాం నుంచి మొదలుకుని ఇప్పటివరకూ ప్రత్యక్ష సైనిక జోక్యం చేసుకున్న ఏ దేశంలోనూ ప్రజాస్వామ్యాన్ని, పటిష్ఠ ఆర్థిక వ్యవస్థనూ ఏర్పాటు చేయలేకపోయింది. అనేక దేశాల్లో ఏర్పరచుకున్న సైనిక స్థావరాలు ఆర్థికంగా గుదిబండలుగా మారాయి. ఇతర కారణాలు ఎన్ని ఉన్నప్పటికీ ఆర్థిక మందగమనాలు, మేధోరంగంపై దాడులు, విదేశీ వ్యవహారాల్లో తప్పటడుగులతో అమెరికా ఆధిపత్యం ప్రశ్నార్థకంగా మారుతోంది!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

భావజాల మార్పుతోనే హిందూరాజ్య స్థాపన

సుమారు ఆరున్నర దశాబ్దాల హిందూ వ్యతిరేక పాలన తర్వాత అనూహ్యంగా ఆవిర్భవించిన ప్రస్తుత బీజేపీ నాయకత్వంలోని ప్రధాని మోదీ పాలన దేశాన్ని హిందూ రాజ్యం వైపుగా నడిపిస్తున్నదనడంలో ఎవరికీ సందేహం లేదు. ఈ తరుణంలోనే రాజ్యాంగ ప్రవేశిక నుంచి 'సెక్యులర్', 'సోషలిస్ట్' అనే పదాలను తొలగించాలని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ కోరడం కూడా గమనార్హం. దేశం యాభై ఏళ్ల ఎమర్జెన్సీని గుర్తు చేసుకుంటున్న సందర్భంలో, హిమంత బిశ్వశర్మ భారతీయ రాజ్యాంగ ప్రవేశిక నుంచి 'లౌకిక' (సెక్యులర్), 'సామ్యవాద' (సోషలిస్ట్) పదాలను రద్దు చేయాలని పిలుపునిచ్చారు. ఈ పదాలను మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ పాలనలో రాజ్యాంగంలో చేర్చారని, తొలినాటి రాజ్యాంగంలో ఇవి లేవని ఆయన అన్నారు. 'లౌకికవాదం' అనేది భారతదేశం ప్రాథమిక నమ్మకమైన సర్వధర్మ సమభావన (అన్ని మతాలను సమానంగా గౌరవించడం) అనే దానికి విరుద్ధమని, 'సోషలిజం' ఎప్పుడూ అసలు భారతీయ ఆర్థిక ఆలోచన కాదని కూడా ఆయన వాదించారు. బదులుగా, భారతదేశం ఎల్లప్పుడూ సర్వోదయ (అందరికీ మంచి), అంత్యోదయ (అత్యల్ప వర్గాలకు ప్రయోజనం) సూత్రాలను అవలంబించిందని ఆయన పేర్కొన్నారు.



ఈ తరుణంలో భారత్ 'లౌకిక' దేశంగా ఉండటంలో తప్పేముంది అన్న ప్రశ్న ప్రజల మనసుల్లో తలెత్తడం సహజం. దారితప్పిన లౌకికవాదం వల్ల హిందూ ధర్మానికి, సమాజానికి కలిగే హానితోపాటు ఈ దేశాన్ని పూర్తి స్థాయి హైందవ దేశంగా పునరుద్ధరించడం ఎందుకు ముఖ్యమో ప్రజలందరూ తెలుసుకోవాలి. 1947లో జరిగిన భారత్ విభజనతో ఈ కథ ప్రారంభమైంది. ఇది అసంపూర్ణంగానే కాకుండా ఏకపక్షంగా, పూర్తి అహేతుకంగా జరిగిందన్న అభిప్రాయం అనేకులలో ఉంది. 1947 విభజన సమయంలో హిందువులు ఎక్కువగా నష్టపోయారన్నది వాస్తవం. బ్రిటిష్ వారు భారత్‌ను దోచుకున్న తర్వాత, ఇస్లామిక్ పాకిస్థాన్ రూపంలో మన దేశానికి శాశ్వత తలనొప్పిని మిగల్చాలని నిర్ణయించుకున్నారు. కొత్తగా ఏర్పాటైన రెండు దేశాల మధ్య పూర్తి జనాభా మార్పిడి గురించి వీర సావర్కర్, డాక్టర్ అంబేడ్కర్ ఇచ్చిన వివేకవంతమైన సలహాను ఆనాడు గాంధీ, నెహ్రూ ప్రభృతులు ఎవరూ పట్టించుకోలేదు. భారతదేశంలోకి స్థానభ్రంశం చెందిన ముస్లిం జనాభాకు వక్ఫ్ బోర్డును ప్రసాదించారు. ప్రతిగా స్థానభ్రంశం చెందిన హిందువులకు మాత్రం రిక్తహస్తం చూపించారు. పాకిస్థాన్‌లో ప్రతిదీ వదులుకున్న హిందువులకు శూన్యమే మిగిలింది. ఇన్ని దశాబ్దాల అనంతరం కూడా భారతదేశంలో హిందువుల పరిస్థితి మెరుగుపడలేదు. ఈ అసమానత్వం 1940ల్లోనే ప్రామాణికంగా నమోదైంది. అయినా, రాజకీయంగా సరిదిద్దే యత్నం జరగలేదు.

ఈ పరిస్థితికి ప్రధాన కారణమైన రాజకీయ వర్గం ఉదాసీనత ఏమేరకు వ్యాపించిందో చరిత్రకు బాగా తెలుసు. వారి ముస్లిం సంతృప్తీకరణ భావజాలం పతాక స్థాయికి చేరింది. నాటి నుంచి నేటి వరకూ రాజకీయ నాయకులు ముస్లింలను సంతృప్తిపరుస్తూనే ఉన్నారు. ఇదే సమయంలో హిందూ ప్రయోజనాలను తుంగలో తొక్కుతూనే ఉన్నారు. 2014 నుంచి ఈ దృశ్యం బాగా మారిపోయింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్, ఇతర ప్రభుత్వాలు ముస్లింలను సంతృప్తిపరచడానికి చాలా వేగంగా పోటీ పడుతూ ముందుకు సాగాయి. ఓట్ల కోసం చివరకు భారతీయ నగరాల మురికివాడల్లో బంగ్లాదేశీయులను అక్రమంగా స్థిరపరిచినట్లు కూడా కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు ఉన్నాయి. ప్రధాని మోదీకి ముందున్న బీజేపీ ప్రభుత్వం (వాజ్‌పేయి హయాంలో) కూడా ఎక్కువగా లౌకికవాదంగానే ఉండేది. అయితే, నాటి బీజేపీ పాలకులు హిందువుల పట్ల ఎప్పుడూ వివక్ష చూపకపోవడమే రక్షణాత్మక దయగా భావించాలి.

భారత్‌లో మెజారిటీ హిందువులు. అయినా, దురవస్థ తప్పడం లేదంటే దాని కారణాలు విశ్లేషించుకొని ఆ మేరకు రాజకీయ నిర్ణయాలు తీసుకోవలసి ఉంది. హిందూ ద్వేష భావజాలాన్ని నిర్మూలించకుండా, బలవంతంగా హిందుస్థాన్‌ను ఏర్పరచడం వల్ల దేశ మనుగడ మళ్లీ ప్రశ్నార్థకం అవుతుంది. మానవీయ కోణంలో ఈ దిశగా అందరూ ఆలోచించాలి.

– దోర్బల బాలశేఖరశర్మ

సరైన ప్రణాళికలుంటే, జనాభా వరమే!

జనాభా అంశంపై ప్రపంచ దేశాలు రెండుగా విడిపోయాయి. కొన్ని దేశాలు ఇప్పటికే అధిక జనాభాతో ఉన్నట్లు భావించి నియంత్రణ చర్యలు పాటిస్తుండగా, మరికొన్ని దేశాలు జనాభా పెరుగుదలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. గతంలో జనాభా నియంత్రణను కఠినంగా అమలు చేసిన దేశాలు కూడా ఇప్పుడు ఆ నిబంధనను సడలిస్తున్నాయి. భారతదేశంలోని రాష్ట్రాల పరిస్థితులు కూడా అలాగే ఉన్నాయి. ఉత్తర భారతానికి చెందిన యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాలు ఇప్పటికీ జనాభా నియంత్రణకు ప్రాధాన్యమిస్తుండగా, దక్షిణాదికి చెందిన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాలు జనాభా పెరుగుదలను ప్రోత్సహించే దిశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో జనాభా అనేది ప్రధాన సమస్య కాదని, ప్రభుత్వాల వద్ద సరైన ప్రణాళికలు లేకపోవడమే అసలు కారణమని తెలుస్తున్నది. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకొని, సరైన ప్రణాళికలతో జనాభాను వినియోగించుకుంటే అది దేశానికి వరమే అని పలు దేశాలు నిరూపించాయి.



143 కోట్ల జనాభాతో ప్రపంచంలో భారతదేశం మొదటి స్థానంలో ఉండగా, 142 కోట్లతో చైనా రెండో స్థానంలో ఉన్నది. జనాభా పెరుగుదల సమస్యలు దేశాల ఆర్థిక, సామాజిక, పర్యావరణంపై ఆధారపడి ఉంటాయి. సరైన ప్రణాళిక లేనప్పుడు జనాభా పెరుగుదల ఒత్తిడిని సృష్టిస్తుంది, కానీ సమర్థవంతమైన విధానాలతో ఈ సవాళ్లను అధిగమించవచ్చు.

జనాభాను అంకెల పరంగానే కాకుండా జనసాంద్రత పరంగా పరిశీలిస్తే కొన్ని దేశాలు సరైన ప్రణాళికలతో ఎలా అభివృద్ధిపథంలో నడిచాయో తెలుస్తుంది. ఇందులో అధిక జనసాంద్రత ఉన్నా, సింగపూర్ సమర్థవంతమైన ప్రణాళిక ద్వారా ఆర్థిక, సామాజిక అభివృద్ధిని సాధించింది. ప్రపంచంలో జనసాంద్రత పరంగా సింగపూర్ మూడో స్థానంలో ఉంది. ఈ దేశ వైశాల్యం 719.9 చదరపు కిలోమీటర్లు కాగా, చదరపు కిలోమీటర్‌కు 8,595 మంది నివసిస్తున్నారు. అయితే అధిక ఆర్థిక వృద్ధి, అత్యుత్తమ గృహనిర్మాణం, ఆరోగ్య సేవలతో ప్రపంచంలోనే ఈ దేశం అగ్రగామిగా ఉంది. 1960–70లలో 'స్టాప్ ఎట్ టూ' కార్యక్రమం ద్వారా జనన రేటును తగ్గించగా, 1980ల నుంచి బేబీ బోనస్ స్కీమ్ ద్వారా జనన రేటును సమతుల్యం చేసింది.

జనసాంద్రత పరంగా చైనా ప్రపంచవ్యాప్తంగా 83వ స్థానంలో ఉంది. చదరపు కిలోమీటర్‌కు 153 మంది నివసిస్తున్నారు. 1980 నుంచి 2015 వరకు చైనా వన్ చైల్డ్ పాలసీని అమలు చేసి, దాదాపు 40 కోట్ల జనాభాను నియంత్రించింది. ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చిన ఆ దేశం జనాభా వనరులను సమర్థవంతంగా ఉపయోగించింది. ఫలితంగా చైనా రెండో అతిపెద్ద ఆర్థిక శక్తిగా మారింది. అయితే కఠిన విధానాలు జనాభా నియంత్రణలో విజయవంతమైనా, దీర్ఘకాల సామాజిక పరిణామాలను పరిగణనలోకి తీసుకోకపోవడం సమస్యలను సృష్టించింది. వృద్ధ జనాభా ఎక్కువ కావడం, లింగ నిష్పత్తిలో తేడాలు రావడంతో వెంటనే అప్రమత్తమై 2015లో టూ చైల్డ్ పాలసీ, 2021లో ముగ్గురు పిల్లల విధానాన్ని ప్రవేశపెట్టింది.

ఇక, భారతదేశంలో జనసాంద్రత (485/చ.కి.మీ.) కూడా ఎక్కువే. ప్రపంచంలోని ఇతర దేశాలతో పోల్చుకుంటే భారతదేశంలో యువ జనాభా 65 శాతం (35 ఏళ్లలోపు) ఉంది. ఈ అంశం సరైన ప్రణాళికతో ఆర్థిక వృద్ధికి దోహదపడుతుంది. సరైన అర్బన్ ప్లానింగ్ పాలసీ, ఆర్థిక సంస్కరణలు, సాంకేతిక వినియోగం వంటి వాటిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి. ఎక్స్‌పోర్ట్ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా యువ జనాభాను ఉత్పాదక శక్తిగా మార్చవచ్చు. సాంకేతికతను ఉపయోగించి, గ్రామీణ–నగర అసమానతలను తగ్గించవచ్చు. జనాభా సమస్యల సవాళ్ల నుంచి అభివృద్ధికి మార్గాలను వెతికితే.. కొన్ని దశాబ్దాల్లోనే భారతదేశం నంబర్ వన్ ఆర్థిక శక్తిగా మారే అవకాశముంది.

– ఫిరోజ్ ఖాన్

(నేడు ప్రపంచ జనాభా దినోత్సవం)

ప్రజాస్వామిక వైఖరి, రెండు భిన్నధ్రువాలు!

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధిపత్య ధోరణి పట్ల తెలంగాణ సమాజం 2023 అసెంబ్లీ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో తిరుగులేని నిరసన తెలిపింది. ఏ మాత్రం ఆత్మశోధన చేసుకున్నా ఈ రెండు ఫలితాల తర్వాత ఆ పార్టీ వైఖరిలో మార్పు కనిపించేది. ఆ మార్పు లేదు, ఇక రాదు అనడానికి తెలంగాణ జాగృతి నాయకురాలు కవిత వ్యవహారమే ఒక సులభమైన ఉదాహరణ. బీఆర్ఎస్ రాజకీయ వైఖరిని ప్రశ్నించినందుకు కన్నబిడ్డ కవిత పట్ల కేసీఆర్ ఎలా ప్రవర్తించారో ప్రపంచమంతా చూసింది. ఆయన ఆధిపత్య వైఖరికి మరో నిదర్శనం– తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరు పలకడానికి కూడా కేసీఆర్‌కు నోరు సహకరించకపోవటం. ఈ నాయకుడేనా ప్రజాస్వామిక తెలంగాణ గురించి ఊరు వాడా తిరిగి ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చింది! ఆ పునాదుల మీద పదేళ్ల అధికారాన్ని అనుభవించింది!!

భిన్న వాదనల్ని తనలో ఇముడ్చుకొని వందేళ్లకు పైగా ప్రయాణం సాగించిన రాజకీయ నౌక కాంగ్రెస్. అలాంటి పార్టీలో ఎన్నికలకు ముందు పీసీసీ సారథిగా, ఎన్నికలు అయ్యాక ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఎలా నెట్టుకొస్తారో అన్న సందేహాలు చాలామందిలో ఉండేవి. బీఆర్ఎస్ కూడా కాంగ్రెస్ అంతర్గత రాజకీయాల్ని చూసి ఆనందిద్దాం అనుకుంది. కానీ, రాజకీయంగా ఎదురైన ఆటుపోట్లతో, ఎదురుదెబ్బలతో రేవంత్‌రెడ్డి రాటుదేలడమే కాదు, తన భవిష్యత్ గమనం, గమ్యం ప్రజాస్వామ్యమేనని గాఢంగా నమ్మారు. ఎన్ని కఠిన పరిస్థితులు ఎదురైనా ప్రజాస్వామిక విలువల్ని దాటి వ్యవహరించకూడదని రేవంత్‌రెడ్డి పెట్టుకున్న నమ్మకమే నేడు ఆయనకు సర్వరక్షగా నిలుస్తోంది. ఒకప్పుడు ఆయనను ప్రత్యర్థిగా భావించిన చాలామంది నేడు ఆయనలో ఒక శ్రేయోభిలాషిని చూస్తున్నారు.

పీసీసీ అధ్యక్షుడిగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల భారాన్ని భుజస్కందాలపై మోసిన రేవంత్‌రెడ్డికి గెలుపు తర్వాత ముఖ్యమంత్రి పీఠం కూడా ప్రజాస్వామిక పద్ధతిలోనే దక్కింది. అంతా తానే అయినప్పుడు ముఖ్యమంత్రి పీఠం కోసం పోటీ ఏమిటని ఆయన అనుకోలేదు. ఎంతో పరిణతితో ఆ పోటీలో తనను తాను నిరూపించుకున్నారు. ముఖ్యమంత్రి పీఠం కోసం పోటీ పడ్డ నాయకుల్ని మంత్రులుగా పెట్టుకుని పాలనా పగ్గాలు అందుకోవాలంటే అంతులేని ధైర్యం లేదా అసమాన ప్రజాస్వామిక నైజం ఉండాలి. ఆ రెండూ కలబోసిన నేత రేవంత్‌రెడ్డి అని గడిచిన ఏడాదిన్నర కాలంగా ఆయన తెలంగాణ సమాజాన్ని నడిపిన తీరు చెబుతుంది. తనను నమ్మి ఓటేసిన ప్రజలకు ఆయన భ్రమలు కల్పించలేదు. కఠినమైన ఆర్థిక పరిస్థితుల గురించి ప్రతి సందర్భంలోనూ ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. ఆ కష్టకాలంలో కూడా ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీల్ని– ముఖ్యంగా రైతు రుణమాఫీ సహా ఎన్నో క్లిష్టమైన హామీలను నిలబెట్టుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ సమ్మె సైరన్ మోగినపుడు కార్మిక నాయకుల పట్ల కేసీఆర్ ఎంత దూకుడుగా వ్యవహరించారో, ఏ స్థాయిలో బెదిరించారో చూశాం. అదే సందర్భం రేవంత్‌రెడ్డికి ఎదురైనప్పుడు– ఆర్థిక పరిస్థితి బాగా లేనందున సర్దుకుపోవాలని ఆయన కార్మికులకు నచ్చచెప్పారు. అందుకే రాజకీయాల్లో ఎప్పుడో తప్ప నేతల వైఖరిని అంతగా సమర్థించని లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ సైతం ప్రజలకు బాధ్యతాయుతంగా జవాబుదారీతనంతో వాస్తవాలు చెప్తున్న రేవంత్‌రెడ్డిని మెచ్చుకున్నారు.



> **'ప్రజాస్వామిక వైఖరి విషయంలో రాజకీయ నాయకులకు రేవంత్‌రెడ్డి మార్గదర్శి' అని అంటే పెద్ద స్టేట్‌మెంట్‌లా అనిపించవచ్చు. కానీ, రాజకీయంగా ప్రశ్నించినందుకు కన్నబిడ్డల్ని కాదనుకున్నవారు ఉన్న ఈ రోజుల్లో, తమను తిట్టిపోసిన వారి గొప్పతనాన్ని గుర్తించే విశాల హృదయం ఉండటం విశేషమే!**


బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డిని ఎంత ఇబ్బందిపెట్టారో చూశాం. కన్నబిడ్డ పెళ్లికి బెయిల్ మీద రావడం, చంచల్‌గూడ జైల్లో తీవ్రవాదులను ఉంచే సెల్‌లో ఆయన్ను ఉంచడం లాంటివి మర్చిపోలేని ఘట్టాలు. అధికారాన్ని అందుకున్న రేవంత్ కచ్చితంగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల మీద ప్రతీకారం తీర్చుకోవాలని కాంగ్రెస్ శ్రేణులు భావించాయి, ఒత్తిడి కూడా తెచ్చాయి. ఫోన్ ట్యాపింగ్ అంశం చేతికి అందివచ్చింది కూడా. అయినా రేవంత్ తొందరపడలేదు. న్యాయపరంగా కేసులు నడిపించారే గాని దుందుడుకు ధోరణి ప్రదర్శించలేదు. పైగా ఏ సమస్య ప్రస్తావన వచ్చినా కేసీఆర్ అనుభవంతో పరిష్కారం చూపిస్తే అనుసరిస్తామని కూడా అసెంబ్లీ సాక్షిగా చెబుతూ వచ్చారు.

తన పేరు ఉచ్చరించడానికి ఇష్టపడని నేతకు సైతం తాను ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వడం ప్రజాస్వామిక విధానానికి ప్రాథమిక మెట్టు. బీఆర్ఎస్ విషయంలో రేవంత్ సంయమన వ్యవహారశైలితో ఇప్పటికే ఇలాంటి ఎన్నో మెట్లు ఎక్కేశారు.

పాలనాపరంగానే గాక పార్టీ అంతర్గత వేదికల్లోనూ అదే సంయమనాన్ని, ప్రజాస్వామ్య వైఖరిని రేవంత్‌రెడ్డి ప్రతి అడుగులోనూ పాటిస్తున్నారు. ఇటీవల సొంత పార్టీ నేతలు కొందరు వివిధ అంశాల్లో అసంతృప్తి చెందారు. రేవంత్‌రెడ్డి వారి ఆగ్రహం వెనుక కారణాలను కనుక్కొని సమస్యను పరిష్కరించారు. గద్దర్ అవార్డుల సందర్భంగా నటుడు అల్లు అర్జున్‌ను రేవంత్‌రెడ్డి అభినందించిన తీరుకూ, మరోపక్క గతంలో ఆయన్ని అరెస్ట్ సందర్భంలో ప్రదర్శించిన కఠిన వైఖరికీ మధ్య ఎంత వైరుధ్యం కనిపించినా, వీటన్నిటి వెనుకా రేవంత్‌రెడ్డి ప్రజాస్వామిక వైఖరి వెల్లడవుతున్నది. ఈ విషయంలో 'సమకాలీన, భవిష్యత్తు రాజకీయ నాయకులకు రేవంత్‌రెడ్డి మార్గదర్శి' అని అంటే అది పెద్ద స్టేట్‌మెంట్‌లా అనిపించవచ్చు. కానీ రాజకీయంగా ప్రశ్నించినందుకు కన్నబిడ్డల్ని కాదనుకున్నవారు ఉన్న ఈ రోజుల్లో, తమను తిట్టిపోసిన వారి గొప్పతనాన్ని గుర్తించే విశాల హృదయం ఉండటం విశేషమే! తెలంగాణలో ప్రజాస్వామిక విలువల మీద పోయిన నమ్మకాన్ని తిరిగి నిలబెట్టినందుకు రేవంత్‌రెడ్డిని తెలంగాణ ప్రజలు ఎప్పటికీ గౌరవభావంతో చూస్తారు.

■ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

శాసనసభ్యులు, మహబూబ్‌నగర్



తడబడుతున్న 'స్టైప్'!

నామా వశిష్టంగా వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం

- ఒకటి, రెండు ట్రేడ్‌లకే పరిమితమైన శిక్షణ
- శిక్షణకు ముందుకు రాని యువత
- ఫీజు చెల్లించాల్సి రావడంతో వెనుకడుగు
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

7

శాకంబరీ దేవీ.. పాహిమామ్..

- సంపూర్ణ శాకంబరీ అలంకరణలో భద్రకాళి అమ్మవారు
- ఆలయానికి పోటెత్తిన భక్త జనం, కిక్కిరిసిన క్యూలైన్లు
- భారీ ఎత్తున ఏర్పాట్లు, పోలీసుల బందోబస్తు

7





సంపూర్ణ శాకంబరీగా భక్తులకు దర్శనమిచ్చిన భద్రకాళి అమ్మవారు

16 రోజుల పాటు విశేష అలంకరణ, పూజలు, హోమాలతో సాగిన భద్రకాళి అమ్మవారు.. గురువారం శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా భద్రకాళి అమ్మవారిని 15వేల కిలోల కూరగాయలతో అలంకరించారు. 12 మంది అర్చకులు తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు అమ్మవారిని అలంకరించారు. కరువు కాటకాలు, బాధలు, అనారోగ్యాల నుంచి అనుగ్రహించి ఆశీర్వదించు అమ్మా.. అంటూ పూజా ఆరాధనలు నిర్వహించి భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేశారు. వచ్చే యేడు శాకంబరీ వరకు చల్లగా చూడమంటూ వేలాది మంది భక్తులు తల్లిని దర్శించుకొని వేడుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, వరంగల్ కల్చరల్



భద్రకాళి సాయిబాబా ఆలయం వద్ద సాయినాథుడు

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

- వాడవాడలా భజనలు, అన్నదానాలు
- ఆలయాల్లో అభిషేకాలు, హారతులు

వరంగల్ కల్చరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం నగరంలో గురుపౌర్ణమిని భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గురు మందిరాలు, దత్త దేవాలయాలు, సాయిబాబా దేవాలయాల్లో అభిషేకాలు, పౌర్ణమి హోమాలు, అన్నదానాలు, హారతులు నిర్వహించారు. వాడవాడలా ఏర్పాటు చేసిన భజన మండళ్ల ప్రాంగణాల్లో 24 గంటల పాటు (మిగతా 6వ పేజీలో..)

ఆర్వోబీ పనులు త్వరితగతిన

పూర్తి చేయాలి

అధికారులకు హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశం




కాజీపేట ఆర్వోబీ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్

కాజీపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కాజీపేట ఫాతిమానగర్ ఆర్వోబీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. కాజీపేట ఆర్వోబీ పనులను గురువారం కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన ఆర్వోబీ నిర్మాణ పనులు, ఇంకా పూర్తి కావల్సిన పనుల గురించి ఆర్అండ్‌బీ శాఖ ఈఈ సురేశ్‌బాబును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. 72మీటర్ల బోస్ట్రింగ్ గడ్డర్స్ ఒక వైపు పూర్తయ్యిందని, మరోవైపు పనులు పూర్తికావాల్సి ఉందని కలెక్టర్‌కు ఈఈ వివరించారు. ఆర్అండ్‌బీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సాధ్యమైనంత త్వరలో బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తిచేయాలని కలెక్టర్ చెప్పారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రాథోడ్ రమేశ్, తహసీల్దార్ బావుసింగ్‌తో పాటు ఇతర ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

పని ఒత్తిడి.. అప్పుల భారం..

- అవస్థలు పడుతున్న పంచాయతీ కార్యదర్శులు
- క్షణం తీరిక లేని గ్రామ పంచాయతీ పనులు
- నిధులు విడుదల కాకపోవడంతో ఆవేదన
- శాఖకు సంబంధం లేని పనులు చేస్తున్న వైనం
- సర్పంచ్‌లు లేక తలకుమించిన భారం

7



'ఆత్మీయ భరోసా' అందేనా..?!

- భూమిలేని నిరుపేదలకు ఏటా రూ.12వేల ఆర్థికసాయం
- గత జనవరిలో అట్టహాసంగా ప్రారంభించిన ప్రభుత్వం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 67,136 మంది లబ్ధిదారుల ఎంపిక
- 74 పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లో తొలివిడతలో రూ.6వేలు జమ
- ఆరు నెలలైనా మిగతా లబ్ధిదారులకు అందని భరోసా
- ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సాయంపై ఎదురుచూపులు
- ప్రభుత్వ ప్రకటన లేకపోవటంతో ఆందోళనలో నిరుపేదలు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. గుంట భూమి లేని నిరుపేదలు.. ప్రభుత్వం అందించే ఆత్మీయ భరోసా కోసం ఎదురుచూస్తున్నారు. ఏటా రెండు విడతల్లో నిరుపేదలకు రూ.12వేల ఆర్థికసాయాన్ని అందించేలా ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని తీసుకువచ్చింది. జనవరి 26వ తేదీన ఈ పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. తొలుత ప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ గ్రామంగా తీసుకుని, ఎంపిక చేసిన లబ్ధిదారులకు తొలి విడత రూ.6వేలను వారి ఖాతాల్లో జమ చేశారు. అయితే ఆరు నెలలు కావస్తున్నప్పటికీ మిగతా లబ్ధిదారులకు తొలివిడత ఆత్మీయ భరోసా సాయం అందకపోవటంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఆత్మీయ భరోసా సాయంపై ఎలాంటి ప్రకటన చేయకపోవటంతో సాయం అందేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

భూమి లేని పేదలకు..

రైతులకు ఏటా ఎకరాకు రూ.12వేల ఆర్థిక సాయాన్ని రైతు భరోసా ద్వారా ప్రభుత్వం అందిస్తోంది. ఇదే తరహాలో భూమి లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా అందిస్తామని ఆరు గ్యారంటీల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అయితే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హుల ఎంపిక కోసం ప్రభుత్వం అనేక నియమాలు పెట్టింది. ప్రధానంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద కనీసం 20 పని దినాలైనా పూర్తి చేసి ఉండాలి. గుంట భూమి కూడా లేని నిరుపేదలను అర్హులుగా నిర్ణయించింది. కుటుంబంలో యాజమానిగా ఎవరు ఉన్నప్పటికీ, ఆ కుటుంబంలోని మహిళను లబ్ధిదారుగా ప్రభుత్వం గుర్తించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో మొత్తం 7,39,609 జాబ్‌కార్డులు ఉండగా, 1525,252 మంది కూలీలు నమోదై ఉన్నారు. ఇందులో 67,136మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. తొలివిడత ఉమ్మడి జిల్లాలోని 74 మండలాల నుంచి ఒక్కొక్క గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. 2,581 మంది లబ్ధిదారులను గుర్తించి ఒక్కొక్కరికి తొలివిడత ఆత్మీయ భరోసా సాయం రూ.6వేల చొప్పున రూ.15.48కోట్లను నిరుపేదల ఖాతాల్లో జమ చేశారు. ఇంకా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 64,555మందికి ఆత్మీయ భరోసా పథకం ద్వారా రూ.38.73కోట్ల ఆర్థిక సాయం అందాల్సి ఉంది. పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లో లబ్ధిదారులకు తొలివిడత సాయం అందించి ఆరు నెలలు కావొస్తోంది. దీంతో మిగతా లబ్ధిదారులు తమకు ఎప్పుడు ఆత్మీయ భరోసా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు తొలివిడత రూ.6వేల సాయాన్ని పొందిన లబ్ధిదారులకు కూడా రెండో విడత సాయాన్ని ఈ నెలఖారులోగా జమ చేయాల్సి ఉంది. అయితే మిగతా లబ్ధిదారులకు తొలి విడత సాయమే అందించలేదని, రెండో విడత తమకు వస్తుందా లేదా అనే ఆందోళన ఉన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతే ఉండటంతో ఇందిరమ్మ ఆత్మీయ పథకం అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఆత్మీయ భరోసాకు ఎంపికైన లబ్ధిదారుల వివరాలు

జిల్లా	జాబ్ కార్డులు	కూలీలు	ఆత్మీయ భరోసా లబ్ధిదారులు
వరంగల్	1,20,127	2,39,463	10,543
హనుమకొండ	86,043	1,70,022	10,672
జనగామ	1,17,729	2,31,005	9,102
మహబూబాబాద్	2,19,509	4,61,007	21,673
భూపాలపల్లి	1,09,960	2,41,994	7,748
ములుగు	86,246	1,81,761	7,181
మొత్తం	7,39,609	15,25,252	67,136

లబ్ధిదారుల ఎంపికపై..

ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపికపై విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ కూలీలతో పాటు పట్టణ ప్రాంత పేదలకు కూడా ఈ పథకాన్ని వర్తింప చేయాలనే డిమాండ్ ఉంది. వీటితో పాటు లక్షల్లో కూలీలు ఉంటే 10శాతం కూడా లబ్ధిదారులను ఎంపిక చేయలేదనే విమర్శలు ఉన్నాయి. ఉదాహరణకు జిల్లాలో 2,19,509 జాబ్‌కార్డులు ఉంటే

(మిగతా 6వ పేజీలో..)



మహ్మద్ అబ్దుల్ షుకూర్

సీఐ షుకూర్‌కి ఉత్కృష్ట్ సేవా పతకం

వరంగల్ టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందించే ఉత్కృష్ట్ సేవా పతకానికి ఇంతేజార్‌గంజ్ సీఐ మహ్మద్ అబ్దుల్ షుకూర్ ఎంపికయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2004ఎస్సై బ్యాచ్‌కు చెందిన షుకూర్.. 2008లో ప్రెసిడెంట్ మెడల్ ఫర్ గ్యాలంటరీ పతకాన్ని రాష్ట్రపతి నుంచి అందుకున్నారు. 2012లో షుకూర్ సీఐగా పదోన్నతి పొందారు. 2019లో సేవా పతకంతో పాటు 40క్యాష్ రివార్డులు, 100 ఇతర రివార్డులు పొందారు. ఈసందర్భంగా సీఐ షుకూర్ మాట్లాడుతూ.. ఉత్కృష్ట్ సేవా పతకానికి ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ పతకాన్ని ఆగస్టు 15న డీజీపీ చేతులమీదుగా అందుకోనున్నట్లు ఆయన తెలిపారు. కాగా, షుకూర్‌ను జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందించారు.

కాంగ్రెస్ నేతలవి దిగజారుడు రాజకీయాలు

- తెలంగాణ ఏర్పాటులో కేసీఆర్ పాత్ర లేదనడం సిగ్గుచేటు
- ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, నన్నపునేని నరేందర్

హనుమకొండ టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ చరిత్ర తెలియని కాంగ్రెస్ ద్రోహులు.. దిగజారుడు రాజకీయ విమర్శలు మానుకోవాలని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి హితవు పలికారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, నన్నపునేని నరేందర్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటులో కేసీఆర్ పాత్ర లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వక్రీకరిస్తున్నాడని మండిపడ్డారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యేది కాదన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చి అధికారం చేపట్టిందని, తర్వాత అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో యూరియా కోసం లైన్‌లో నిల్చొనే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం గత ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. నిరుద్యోగులకు జాబ్‌క్యాలెండర్ ప్రకటించాలని సెక్రటేరియేట్ ఎదుట ధర్నాలు చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజాసమస్యలపై చర్చించడానికి సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు రావడంలేదని, ఢిల్లీ పర్యటనలు చేస్తూ మూటలు మోస్తున్నాడని ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో ఎంతోమంది సీఎంలను చూశామని, ప్రజలను చులకనభావంతో చూసే పద్ధతిని రేవంత్‌రెడ్డి మార్చుకోవాలని హితవు పలికారు. ఇప్పటికైనా ప్రజా సమస్యలపై దృష్టిసారించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మధుసూదనాచారి సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఒంటరితనం భరించలేక..

తల్లిని వదలలేక..

- జనగామ గిర్నిగడ్డలో తల్లీకొడుకుల బలవన్మరణం
- రాగిజావలో విషగుళికలు కలిపి తాగి ఆత్మహత్య



అహల్యాదేవి, రాందయాకర్‌రెడ్డి (ఫైల్)

జనగామ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలు వారిని చావుపై నడిపించింది. తను చనిపోతే తల్లి ఒంటరి అవుతుందనుకున్నాడో ఏమో.. తల్లితోపాటు తనూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అవివాహితుడు కావడంతో ఒంటరితనం కూడా దీనికి ఆజ్యం పోసినట్టయింది. ఉదయమే ఇంట్లో రాగిజావలో విషగుళికలు కలుపుకుని తల్లీకొడుకులు తనువు చాలించారు. మృతుడు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ కావడం మరింత విషాదాన్ని నింపింది. ఈఘటన గురువారం జనగామ జిల్లాకేంద్రంలోని గిర్నిగడ్డలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. చారబుడ్డి లక్ష్మారెడ్డి, అహల్యాదేవి(85) దంపతులకు ఇద్దరు కుమారులు లక్ష్మారెడ్డి రిటైర్డ్ టీచర్ కాగా, గతంలోనే మృతిచెందాడు. చిన్న కుమారుడు అవివాహితుడైన చారబుడ్డి రాందయాకర్‌రెడ్డి(55) కాంగ్రెస్ సీనియర్ నాయకుడుగా కొనసాగుతున్నాడు. 2001లో జనగామ కౌన్సిలర్ కూడా పనిచేశాడు. రాందయాకర్‌రెడ్డి గిర్నిగడ్డలో తల్లితో కలిసి ఉంటున్నాడు. అతడి అన్న వాసుదేవరెడ్డి వృత్తిరీత్యా హైదరాబాద్ ఉంటున్నాడు. రాందయాకర్‌రెడ్డి తల్లి అహల్యాదేవి వృద్ధాప్యంతోపాటు అనారోగ్యంతో బాధపడుతోంది. దీనికి తోడు ఇటీవల కోతుల దాడిలో కిందపడడంతో వెన్నుముకకు తీవ్ర గాయమైంది. కొద్దిరోజులుగా రాందయాకర్‌రెడ్డికి సైతం వెన్నుముక నొప్పి సమస్యతో బాధపడుతున్నాడు. అవివాహితుడు కావడంతో తనకు, తల్లికి అనారోగ్యం, ఒంటరితనంతో మథనపడుతున్నట్టు తెలుస్తోంది. అనారోగ్యంతో బాధపడుతున్న రాందయాకర్ రెడ్డి, తల్లి అరోగ్యంపై కొంతకాలంగా కలత చెందుతున్నాడు. తాను చనిపోతే తన

(మిగతా 6వ పేజీలో..)

రైల్వే క్యాంటీన్ మూసివేత

● తిండి కోసం ప్రయాణికుల తిప్పలు

కాజీపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట రైల్వే స్టేషన్‌లోని క్యాంటీన్ మూసివేశారు. టెండర్ కాలం ముగియడంతో ఈ నెల 4 నుంచి క్యాంటీన్ మూసివేశారు. నిత్యం వందల కొద్ది రైళ్ల రాకపోకలు, వేలాదిగా రైల్వే ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉండే స్టేషన్‌పై ఉన్న క్యాంటీన్ మూసివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



స్టేషన్‌లో మూసివేసిన క్యాంటీన్

రైలు ఆగినప్పుడు ప్రయాణికులు ఈ క్యాంటీన్ వద్దకు పరుగులు తీయడంతో క్యాంటీన్ మూసివేసి ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అమ్మకందారులు బయటనుంచి భోజనం ప్యాకెట్‌లు తెచ్చి అమ్మకాలు జరుపడంతో నాణ్యతపై ప్రయాణికులు అసంతృప్తి వెలిబుచ్చుతున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు చొరవ చూపి రైల్వే క్యాంటీన్‌కు టెండర్‌లు వేసి త్వరగా ప్రారంభించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మేదరి సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా సరిత



వరంగల్ కార్పొరేషన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మేదరి మహేంద్ర సంఘం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా హనుమకొండ వినాయకనగర్‌కు చెందిన డీకొండ సరిత నియామకమయ్యారు. ఇటీవల హనుమకొండ హంటర్‌రోడ్డులో జరిగిన రాష్ట్ర మేదరి మహేంద్ర సంఘం రాష్ట్రస్థాయి సమావేశంలో సరితను రాష్ట్ర నాయకులు నియమించారు. ఈ మేరకు గురువారం సరిత బాధ్యతలు స్వీకరించారు. వినాయకనగర్‌కు చెందిన సరిత ప్రస్తుతం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో జేఏవోగా విధులు నిర్వర్తిస్తున్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు జొర్రీగల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కోన రాజశేఖర్, కోశాధికారి పాతకోటి ఉమ, ప్రచార కార్యదర్శి ప్యారసాని రమాకాంత్‌లకు సరిత కృతజ్ఞతలు తెలిపారు.

నర్సంపేట అటానమస్ డిగ్రీ కళాశాల ఫలితాల విడుదల


ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం తదితరులు

కేయూ క్యాంపస్ జూలై 10, (ఆంధ్రజ్యోతి): నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల బీఏ, బీకామ్, బీఎస్సీ రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ మేరకు గురువారం కేయూ పరిపాలన భవనంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఫలితాలను విడుదల చేశారు. పరీక్షలను మే 2025లో నిర్వహించగా బీఎస్సీలో 41.74 శాతం, బీఏలో 51.85 శాతం, బీకామ్‌లో 39.2 ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ తెలిపారు. మొత్తంగా 42.62 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వెల్లడించారు. ఫలితాలను కళాశాలలో వెబ్‌సైట్‌లో, క్యూఆర్‌కోడ్, లింక్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, కళాశాల విద్య ఉన్నతాధికారులు బాల భాస్కర్, రాజేందర్‌సింగ్, కమలాకర్, రాజీరు, భద్రు, రహీముద్దీన్‌లు పాల్గొన్నారు.

కాజీపేట మీదుగా టూరిస్టు స్పెషల్ రైలు

కాజీపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19 నుంచి కాజీపేట జంక్షన్ మీదుగా దివ్య దక్షిణ యాత్ర జ్యోతిర్లింగం అనే ప్యాకేజీ పేరుతో భారత్ గౌరవ్ టూరిస్టు స్పెషల్ రైలు నడిపించనున్నట్లు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం అసిస్టెంట్ మేనేజర్ పి.వి.వెంకటేశ్ తెలిపారు. ఈ సందర్భంగా కాజీపేట రైల్వే వీఐపీ లాంజ్‌లో గురువారం టూరిజం రైలు కరపత్రాన్ని ఆవిష్కరించిన అనంతరం మీడియా సమావేశంలో రైలు వివరాలు తెలిపారు. ఈ రైలు ఈ నెల 19న మధ్యాహ్నం సికింద్రాబాద్‌లో ప్రారంభమై కాజీపేటకు 1:55 నిమిషాలకు చేరుకుంటుంది.

ఈ నెల 19 నుంచి 26 వరకు 7 రాత్రులు, 8 రోజుల పాటు సాగే ఈ టూరిజం యాత్ర తరువణ్ణామలై, రామేశ్వరం, మదురై, కన్యాకుమారి, త్రివేంద్రం, తిరుచ్చి, తంజావూరి తదితర పర్యాటక ప్రదేశాలు కవర్ చేయనుందని చెప్పారు.. ఒక్కొక్కరికి సాధారణ టికెట్ దర 14,100, థర్డ్ ఏసీ 22,300, సెంకండ్ ఏసీ ధర 29,200 ఉంటుందని, ఉచిత భోజనంతో సహా ఈ చార్జీలు నిర్ణయించినట్లు చెప్పారు. వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు. గూడూరు, రేణిగుంట రైల్వే స్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. బుకింగ్, ఇతర వివరాలకు 97013 60701, 9281495843, 9281030749 లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐఆర్‌సీటీసీటూరిజం.కాం అనే వెబ్‌సైట్‌ను సంప్రదించాలని అసిస్టెంట్ మేనేజర్ వి.వి. వెంకటేశ్ చెప్పారు. ఈ సమావేశంలో టూరిజం మానిటర్లు కె. ప్రశాంత్, ఎం. శ్రీకాంత్‌లు ఉన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఐఆర్‌సీటీసీఅధికారి పీవీ వెంకటేశ్

భాగ్యనగర్, గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లకు అదనపు ఏసీ బోగీలు

సికింద్రాబాద్ - సిర్పూర్ కాగజ్‌నగర్‌ల మధ్య నడిచే (17233, 34) భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ - గుంటూరుల మధ్య నడిచే (17201,02) గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు ఒక్కో ఏసీ బోగీలు ఏర్పాటు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.. ఈ బోగీలు ఈ నెల 13 నుంచి అందుబాటులోకి వస్తాయని చెప్పారు. అదనపు ఏసీ బోగీలు ఏర్పాటుతో సెలవుల్లో వివిధ ప్రాంతాలకు వెళ్లే రైల్వే ప్రయాణికులకు రిజర్వేషన్ లభించే అవకాశం ఉంటాయని రైల్వే ప్రయాణికులు చెబుతున్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

(5వ పేజీ తరువాయి)

ఏకనామం భజనలు, అన్నదానాలతో పాటు కాగడ, ధూప, దీప హారతులను నిర్వహించారు. ములుగురోడ్‌లోని గణపతి సచ్చిదానంద వరద దత్తాక్షేత్రంలో దత్తాత్రేయస్వామికి తైలాభిషేకం, పౌర్ణమి హోమం, భక్తులకు అన్నదానం చేశారు. భద్రకాళి దేవాలయ సమీపంలోని సాయిబాబా దేవాలయంలో నాలుగు హారతులు, అభిషేకం, అన్నదానం, భజనలు జరిగాయి. శ్రీకృష్ణకాలనీలోని సాయిబాబా భజన మండలి ఆధ్వర్యంలో, ఎల్లంబజార్‌లోని సాయి సేవాదళ్ భజన మండలి ఆధ్వర్యంలో 24 గంటల పాటు సాయి నామస్మరణ భజన కార్యక్రమం, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దుర్గేశ్వరాలయం వీధిలోని సేవాశ్రమంలో గురుపౌర్ణమి వేడుకలు, అన్నదానం, భజనలు కొనసాగాయి. ఇవే కాకుండా యాదవనగర్ సాయి దేవాలయం, దేశాయిపేటలోని సాయి దేవాలయం, మండిబజార్, వరంగల్, ఓసిటీలోని సాయిబాబా దేవాలయాల్లో అన్నదానాలు, భజనలు, హారతులు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలను సందర్శించి సాయిబాబాను దర్శించుకున్నారు.

'ఆత్మీయ భరోసా' అందేనా..?!

(5వ పేజీ తరువాయి)

4,61,007మంది కూలీలు ఉన్నారు. వీరిలో కేవలం 21,673మందిని మాత్రమే ఆత్మీయ భరోసా పథకం కింద లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. 5శాతం కూడా పేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేయకపోవటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో పనిదినాలను కాకుండా 2023-24 ఆర్థిక సంవత్సరం పని దినాలను పరిగణంలోకి తీసుకోవాలని ఉపాధిహామీ కూలీలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గతంలో ఎంపిక చేసిన లబ్ధిదారులనే ఫైనల్ చేసి భరోసా నిధులు విడుదల చేస్తుందా..? లేదా మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు ఏమైనా అవకాశం ఇస్తుందా..? అనే ఆశతో నిరుపేదలు ఎదురుచూస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ భరోసా పథకం అమలుపై ఎలాంటి ప్రకటన రాకపోవటంతో లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

మున్నూరు కాపు సంఘాన్ని బలోపేతం చేయాలి

● మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు

వడ్డెపల్లి, జూలై10 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపులంతా సంఘటితమై సంఘాన్ని బలోపేతం చేయాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ అన్నారు. గురువారం హనుమకొండ రాంనగర్‌లోని కొండా మురళీధర్‌రావు నివాసంలో వరంగల్ జిల్లా మున్నూరు కాపు సంఘం సమావేశాన్ని నిర్వహించారు. వరంగల్ జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా ముష్కమల్ల సుధాకర్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కొండా దేవయ్య పటేల్ మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలోని అన్ని మండలాల్లో మున్నూరు కాపు సంఘానికి ఎన్నికలు నిర్వహించాలని నూతన అధ్యక్షుడి ని ఆదేశించారు. మున్నూరు కాపు కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ సమావేశంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌రాజు పటేల్, రాష్ట్ర కార్యదర్శి బండి రమేష్, వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కటకం పెంటయ్య, జిల్లా నాయకులు కంచి మనోహర్, బొరిగం భాస్కర్, వలిశెట్టి సుధాకర్, దారం ఆనంద్, వనం శ్యామ్, ముష్కమల్ల దేవేందర్, సతీష్, తోట తిరుమల్, కోలా కృష్ణ, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.


ముష్కమల్ల సుధాకర్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న కొండా మురళీధర్‌రావు, కొండా దేవయ్య పటేల్

మూలనపడ్డ కోటిన్నర యంత్రం

వరంగల్ మెడికల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం వెచ్చించిన రూ.1 కోటి 50 లక్షల విలువజేసే పరికరం ప్రారంభానికి నోచుకోకుండానే మూలనపడిపోయింది. మూడేళ్లుగా ఈ యంత్రం కవరు విప్పిన పాపాన పోలేదు. కాకతీయ మెడికల్ కళాశాలలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో న్యూరో సర్జరీ విభాగానికి కోటిన్నర రూపాయల విలువజేసే ఆపరేటింగ్ మైక్రోస్కోప్ అనే యంత్రాన్ని ప్రభుత్వం పంపించింది. మెదడు, వెనుముక సర్జరీలో ఈ యంత్రంతో అధునాతన పద్ధతిలో శస్త్ర చికిత్స చేసేందుకు అవకాశం ఉంటుంది. నిమ్స్ ఆస్పత్రిలో మాత్రమే ఈ తరహా పరికరం ఉంది. ఇలాంటి విలువైన పరికరాన్ని ఉపయోగించకుండా మూడేళ్లుగా మూలనపడేశారు. దీంతో సూపర్‌స్పెషాలిటీలో న్యూరో సర్జరీ శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయి. రెగ్యులర్ వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాంట్రాక్టు వైద్యులు ఈ పరికరాన్ని ఉపయోగించకపోవడం రోగులకు శాపంగా మారింది.


కోటిన్నర రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన యంత్రం

మానవ అక్రమ రవాణాపట్ల అప్రమత్తంగా ఉండాలి

వరంగల్ క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాపట్ల కిషోర బాలలు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం సీఐ జె. శ్యాంసుందర్ అన్నారు. మానవ అక్రమ రవాణా, బాలల సంక్షేమంపై గురువారం లష్కర్‌బజార్‌లోని మర్కజీ ఉన్నత పాఠశాలలో అవగహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. 10 నుంచి 18 ఏళ్ల మధ్యలో ఉన్న కిషోర దశ బాలలు ప్రలోభాలకు గురై ఇతరుల చేతుల్లో మోసపోయే అవకాశం ఎక్కువగా ఉందని, పిల్లలు ఏ విషయమైనా తల్లితండ్రులతో పంచుకునే స్నేహపూర్వక వాతావరణం ఏర్పరుచుకోవాలన్నారు. అపరిచితులతో చనువు ఉండకూడదని, సెల్‌ఫోన్ వినియోగం తగ్గించుకోవాలన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోవడానికి జీవన నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. పిల్లలచే బిక్షాటన చేయించడం, మాదక ద్రవ్యాల సరఫరాకు వినియోగించుకోవడం, యుక్తవయస్సులో ఉన్న వారిని అనైతిక చర్యల్లోకి దింపడం, బాల్యవివాహాలు వంటివి మీ దృష్టికి వస్తే 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. హనుమకొండ ఎస్సై సుధాకర్, ఏఎస్సై భాగ్యలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ శ్యాంసుందర్

ముచ్చర్లలో బెల్ట్ షాపులపై నిషేధం

● గ్రామస్థుల ఏకగ్రీవ తీర్మానం

హసన్‌పర్తి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 1వ డివిజన్ పరిధి ముచ్చర్లలో త్వరలో బెల్ట్‌షాపులపై నిషేధం నిర్వహించాలని గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా గురువారం బెల్ట్‌షాపుల నిర్వాహకులు వారం గడువు కోరుతూ ఒప్పందం చేసుకొని పత్రంపై సంతకాలు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. వారం తరువాత ఈనెల 17వ తేదీ నుంచి గ్రామంలో మద్యం అమ్మకాలు జరిపితే గ్రామస్తుల నిర్ణయానికి కట్టుబడి ఉంటామని తెలిపారు. ఒకవేళ ఒప్పందాన్ని విస్మరించి మద్యం అమ్మకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు కట్టుబడి ఉంటామని నిర్వాహకులు ఒప్పుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

మూడు రోజుల మూగ రోదన

వ్యవసాయబావిలో పడిపోయిన రెండు శునకాలు

కాపాడిన డీఆర్‌ఎఫ్ సిబ్బంది.. అబినందించిన కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా మూగజీవాలు నీటిలో పడి ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడాయి. చివరికి బావిలో ఓ కొంచెం నీరు ఉన్న గడపైకి చేరి అరవడం ప్రారంభించడంతో సమీపంలో ఉన్న ప్రజలు స్పందించి గ్రేటర్ వరంగల్ అధికారులకు సమాచారం అందించారు. సకాలంలో స్పందించిన డీఆర్‌ఎఫ్ సిబ్బంది కష్టపడి రెండు శునకాల ప్రాణాలు కాపాడి గడ్డకు వేసి బతికించారు. గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ డీఎఫ్‌వో శంకర్‌లింగం తెలిపిన వివరాల ప్రకారం..

గ్రేటర్ పరిధిలోని 17వ డివిజన్ ఖిలావరంగల్, స్తంభంపల్లి గ్రామాల మధ్య నిర్మానుష్య ప్రదేశంలోని గల వ్యవసాయబావిలో సోమవారం ఉదయం రెండు వీధి కుక్కలు పడిపోయాయి. ముందుగా నీటిలో పడిపోయిన శునకాలు కొంత సేపటికి బావిలోని గడ్డ ప్రాంతానికి చేరుకుని అచేతన స్థితిలో ఉండిపోయాయి. మూడు రోజుల తర్వాత ఆకలికి తట్టుకోలేక పెద్దగా అరవడంతో చుట్టుపక్కల వారు గమనించారు. బావి వద్దకు వెళ్లి చూడగా చలికి వణుకుతూ రెండు కుక్కలు వ్యవసాయ భావిలో కనిపించాయి. అక్కడి ప్రజలకు బయటకు తీయాలని తాళ్లు వేసి ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో స్థానిక కార్పొరేటర్ సహాయంతో మునిసిపల్ అధికారులకు సమాచారం అందించారు.

వెంటనే స్పందించిన కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ డీఆర్‌ఎఫ్ బృందాలను అప్రమత్తం చేశారు. గురువారం సాయంత్రం డీఆర్‌ఎఫ్ టీం లీడర్ శంకర్ ఆధ్వర్యంలో మరో ఐదుగురు సిబ్బంది శునకాలు పడిపోయిన వ్యవసాయ భావి వద్దకు చేరుకున్నారు. లైఫ్‌సేవ్ జాకెట్లు ధరించి వారి వద్ద ఉన్న పరికరాలతో బావిలోకి దిగారు. రెండు గంటల పాటు జాలీ (నెట్స్)తో కష్టపడి రెండు శునకాలను బయటకు తీసి వదిలివేశారు. దీంతో స్థానికులు మునిపల్ డీఆర్‌ఎఫ్ సిబ్బందిని ప్రశంసించారు. శునకాలను వెలికి తీసిన డీఆర్‌ఎఫ్ సిబ్బందిలో ఉపేందర్, సాయికుమార్, శ్రీనివాస్, రాజు, రవీందర్‌లు ఉన్నారు. సకాలంలో స్పందించిన రెండు శునకాల ప్రాణాలు కాపాడిన సిబ్బందిని కమిషనర్ అభినందించారు.


శునకాలను వెలికితీస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది


నీటిలో పడి ఉన్న శునకాలు

ఒంటరితనం భరించలేక.. తల్లిని వదలలేక..

(5వ పేజీ తరువాయి)

తల్లిబాగోగులు ఎవరుచూస్తారో అన్న ఆందోళన చెందేవాడు. ఈక్రమంలోనే తల్లితోపాటు తానూ తనువు చాలించాలని భావించినట్టు ఉన్నాడు. దీంతో గురువారం ఉదయం 8గంటల సమయంలో ఇంట్లో పని మనుషులు బయటకు వెళ్లగానే రాగిజావ చేసుకొని తన తల్లికి ఒక గ్లాస్ ఇచ్చి, తాను ఒక గ్లాస్ తాగినట్లుగా సంఘటన స్థలాన్ని బట్టి తెలుస్తోంది. జావలో పురుగుల మందుగానీ, మరేదైనా విషపూరితమైన రసాయనం గానీ కలిపి తాగినట్లు తెలుస్తోంది. కాగా, జావా తాగిన తర్వాత వృద్ధురాలైన తల్లి కింద పడగా నోట్లో నుంచి రక్తం వచ్చిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. సంఘటన గురించి తెలిసిన వెంటనే క్లూస్‌టీం రంగంలోకి దిగింది. ఇంటి పరిసరాలతో పాటు తల్లి మృతదేహం ఉన్న బెడ్‌రూమ్, కొడుకు మృతదేహం ఉన్న ఇంటి వెనుక బాల్కనీలో ఆధారాలను సేకరించారు. ఘటనా స్థలాన్ని డీసీపీ రాజమహేంద్రనాయక్ పరిశీలించి స్థానికులు, పోలీసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జావా తయారు చేసిన వంట పాత్రను పోలీసులు బాత్‌రూమ్‌లో గుర్తించారు. అయితే వారి మృతిపై ఎలాంటి అనుమానాలు లేవంటూ మృతుడి అన్న వాసుదేవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాలను జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.

బైక్ చోరీ

కాజీపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి ఇంటి ముందు పార్క్‌చేసిన బైక్ చోరీ జరిగింది. కాజీపేట ఎస్సై లవన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట బాబుక్యాంప్‌నకు చెందిన వివేక్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ద్విచక్రవాహనాన్ని బుధవారం రాత్రి ఇంటిముందు పార్క్ చేశారు. తెల్లవారి చూసే సరికి బైక్ లేదు. బైక్ చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లవన్‌కుమార్ తెలిపారు

నేడు డయల్ యువర్ డీఎం

హనుమకొండ టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం కోసం వరంగల్-1 డిపోలో శుక్రవారం డయల్ యువర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గురువారం వరంగల్ డిపో మేనేజర్ పి.అర్పిత ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు హైదరాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్లల్లో ప్రయాణించే ప్రయాణికులు తమ సలహాలు సూచనలు ఫోన్ నంబర్ : 9959226047కు సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న బైక్

పాలకుర్తిలో యువకుడి దుర్మరణం

మృతుడిది రాయపర్తి మండలం మైలారం

పాలకుర్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందిన ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై దూలం పవన్‌కుమార్ కథనం ప్రకారం.

వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని మైలారంనకు చెందిన గాడిపెల్లి రంజిత్(24) హైదరాబాద్‌లోని ఓ వైన్ షాపులో తన సోదరుడుతో పాటు పని చేస్తున్నాడు. సొంత పనిమీద పాలకుర్తి మీదుగా హైదరాబాద్‌కు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న క్రమంలో జనగామ నుంచి పాలకుర్తికి రాగానే, బస్టాండ్ లోపలికి వెళ్తున్న ఆర్టీసీ బస్సును రంజిత్ బైక్ ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రంజిత్‌ను చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా, వైద్యం అందిస్తుండగా మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి తల్లి, సోదరుడు, చెల్లె ఉన్నారు.


బస్సును ఢీకొని మృతి చెందిన రంజిత్

మైలారంలో విషాదం

రాయపర్తి(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మైలారంలో విషాదం నెలకొంది. గాడిపెల్లి వెంకటయ్య, రజిత దంపతుల కుమారుడు గాడిపెల్లి రంజిత్ హైదరాబాద్‌లో బతుకు దెరువు కోసం వెళ్లి పనిచేస్తున్నాడు. తండ్రి ఐదేళ్ల కిందట మృతి చెందగా, తల్లి గ్రామంలోనే ఉంటోంది. తల్లి చెంతకు వచ్చి హైదరాబాద్ వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2349	1521
పల్లికాయ (సూక)	5800	3450
పల్లికాయ (పచ్చిది)	3600	1575
కందులు	5989	3022
పెసళ్లు	8001	3022
పత్తి	7510	5300
పసుపు (కాడి)	12259	9534
పసుపు (గోల)	10288	9700
తేజ ఏసీ	12500	11500
తేజ మిర్చి	11000	8500
వండర్‌హాట్	11000	6000
వండర్‌హాట్ ఏసీ	14000	11500
యూఎస్341ఏసీ	11500	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

ఆంధ్రజ్యోతి Classifieds

WANTED
★ Wanted Marketing Boy to Work in a Reputed Diagnostics Centre in Warangal Hanamakonda With Good Communication Skills. Contact.No : 9676042022, 9700238200, 9393113929
AJW-7670

FLATS FOR SALE
★ 1 BHK, 2 BHK & 3 BHK Flats with all facilities are for Sale @ 941 Sqft to 1914 Sqft with Reasonable prices at Vikas Nagar and Basit Nagar. Cell.No : 8897221187, 9177592335?
AJW-243338

WANTED
★ Multinational Company Part Time / Full Time work Training / Support Given. Contact : No.8106144217
AJW-243336

HOUSE FOR SALE
★ HNK భీమారం, రుద్రమదేవి కాలనీ, రోడ్ నెం.8, భీమారం, Opp: KUC Police Station, 3/2 BHK Ready to Move మూడు ఇండిపెండెంట్ ఇళ్ళు 160 Sqy. Rs. 68 to 71 Lakhs కి అమ్మకానికి కలవు. సం॥ప్ర॥ 9118706786, 8074280608.
AJW-237247

ఉచిత అడ్మిషన్లు
★ ల్యాబ్, ఎక్సరే, అనస్తీయ టెక్నిషియన్ ఆపరేషన్ థియేటర్ టెక్నిషియన్, మేల్ నర్సింగ్ చదువు మరియు ప్రాక్టికల్ ఉద్యోగం. సం॥ప్ర॥ 9177631014
AJW-243215

FOR SALE
★ హనుమకొండలోని ఎర్రగట్టు గుట్ట కిట్స్ కాలేజి దగ్గర శ్రీ వెంకటేశ్వర రెస్టారెంట్ అమ్మబడును. సంప్రదించండి. సెల్.నెం : 6304180313.
AJW-243151

WATER PROOFING
★ బిల్డింగ్ లీకేజెస్, రూఫ్/స్లాబ్ లీకేజెస్, సైడ్ వాల్స్ (విమ్ము), వాటర్ ట్యాంక్స్ మొదలగునవి వాటర్ ప్రూఫింగ్ రసాయనాల ద్వారా నివారించబడును. 10 సం॥ గ్యారెంటీ. సం॥ప్ర॥ 7386961381
AJW-243337

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటి

3+2 స్కీం కలదు

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-

గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
9985411677
వరంగల్
9985406150
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9985418040
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

ఉపాధి పనుల్లో అతివలే అగ్రపథం

- పురుషుల కంటే ఎక్కువ హాజరు
- వ్యవసాయం కన్నా ప్రాధాన్యతనిస్తున్న మహిళలు



దామెర మండల కేంద్రంలో ఉపాధి పనులు చేస్తున్న మహిళలు

హనుమకొండ కలెక్టరేట్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా మహిళలు ఉపాధి హామీ పనుల్లో అగ్రపథంలో ఉన్నారు. పురుషులతో సమానంగా గడ్డపార, పార, తట్టతో పనులు చేస్తూ మిగతా మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సంవత్సరం పని దినాలను వినియోగించుకోవడంలో పురుషుల కంటే అతివలు ముందు వరుసలో ఉన్నారు.

ఎక్కువ హాజరు

ఉమ్మడి జిల్లాలో మహిళా కూలీలు 4,54,123 మంది, పురుష కూలీలు 3,76,959 ఉండగా,వీరిలో 2,47,103మంది మహిళలు, 1,70,192 మంది పురుషులు పనులు చేశారు. మొత్తంగా 63,12,713 పని దినాలకు 37,23,340 మహిళలు, 24,89,373 పురుష కూలీలు పనులు చేశారు. దీంతో పురుషులకంటే మహిళలే సుమారు 12లక్షల పనిదినాలు ఎక్కువ పనులు చేసి రికార్డు సృష్టించారు. ఎండాకాలం సెలవులలో చదువుకునే యువతీ యువకులు కూడా చురుకుగా ఉపాధి హామీ పనుల్లో చేసి తమ కాళ్లపై తాము నిలబడటంతో పాటు కుటుంబ అవసరాలకు కూడా ఆర్థిక సహకారం అందించారు.

క్రమక్రమంగా పెరుగుదల

ఉపాధిహామీ పనుల మొదట్లో చెరువులు, కాలువ పూడికతీత పనులకు అధికంగా పురుషులే చేసేవారు. నైపుణ్యం లేని కూలీలకు పనులు అధికంగా దొరకడంతో క్రమక్రమంగా మహిళా కూలీల శాతం పెరిగింది. దీంతో వ్యవసాయ పనుల కంటే ఉపాధిహామీ పనులకే మహిళలు ప్రాధాన్యం ఇవ్వడం ప్రారంభించారు. పార, పలుగు పట్టి మట్టిని తవ్వుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. నేల స్వభావం ఎలా ఉన్నా ఉత్సాహంగా పనులు చేస్తున్నారు. చెరువులు, కాలువల పూడికతీత, మట్టి రహదారుల నిర్మాణంలో పనులలో భాగస్వామ్యం అవుతున్నారు. ఉపాధి హామీ పనుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని మహిళలు మహిళా సంఘాల పొదుపు చేసుకుంటూ, ఆ పొదుపు ద్వారా వచ్చిన డబ్బుతో సంఘాలను బలోపేతంచేస్తూ ప్రభుత్వం ద్వారా వడ్డీలేని రుణాలు పొందుతున్నారు. ఈ డబ్బులతో పిల్లల చదువులకు కానీ, వైద్యానికి కానీ ఖర్చు చేస్తూ కుటుంబ బాధ్యతలో తమ వంతు సహాయం చేస్తున్నారు.

మహిళలు ఉత్సాహంగా పనిచేస్తున్నారు..

మేన శ్రీను, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి



మహిళలు ఉపాధి హామీ పనులకు ఉత్సాహంగా వస్తున్నారు. రోజు రోజుకూ పనిచేసే మహిళా కూలీల సంఖ్య పెరుగుతోంది. ఉపాధి హామీ పనులు చేసే ప్రదేశాల్లో కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుండటంతో ఎక్కువ కూలీలు పనులు చేయడానికి వస్తున్నారు. పురుషులకంటే మహిళలు ఉపాధి హామీ పనుల్లో నిమగ్నం కావడం మంచి పరిణామం. ఉపాధి పనుల ద్వారా వచ్చిన డబ్బులను మహిళలు తమ పిల్లల ఫీజులు, వైద్య ఖర్చుల కోసం ఉపయోగించుకుంటున్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

- డీఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి

వడ్డెపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎదుట 200 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం(డీఎన్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ లో డీఎన్ఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కంచెర్ల సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత కరెన్సీపై రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రాన్ని ముద్రించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డీఎన్ఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లా మిథున్, జిల్లా నాయకులు శివరాజ్, శ్రావన్‌కుమార్ పాల్గొన్నారు.



దేవాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



దేవాలయంలో క్యూలైన్లలో భక్తుల రద్దీ

శాకంబరీ.. పాహిమామ్..

- సంపూర్ణ శాకంబరీ అలంకరణలో భద్రకాళి
- ఆలయానికి పోటెత్తిన భక్త జనం, కిక్కిరిసిన క్యూలైన్లు

వరంగల్ కల్చరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లోని భద్రకాళి దేవాలయంలో అమావాస్య నుంచి పౌర్ణమి వరకు కొనసాగిన శాకంబరీ ఉత్సవాల ముగింపు వేళ అమ్మవారిని శాకంబరీగా అలంకరించారు. నిండు పౌర్ణమి గడియల్లో అమ్మవారు తేజోవంతంగా శాకంబరీ అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం 6 గంటల నుంచే ఆలయానికి భక్తుల రాక మొదలైంది. రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనంతో దేవాలయ ప్రాంగణం భక్తులతో పోటెత్తింది. భక్తుల దర్శనానికి ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇంటిల్లిపాది కుటుంబ సభ్యులతో కాయగూరలతో శాకంబరీ అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు సంతోషంతో దర్శనం చేసుకున్నారు. శాకంబరీ అలంకరణలోఉన్న భద్రకాళి అమ్మవారిని 50వేలకు పైగా భక్తులు దర్శించుకున్నట్లు సమాచారం.

అమ్మవారి సన్నిధిలో మంత్రి సురేఖ



అమ్మవారికి హారతి ఇస్తున్న దృశ్యం

శాకంబరీ అలంకరణ సందర్భంగా మంత్రి కొండా సురేఖ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ శివసుబ్రహ్మణ్యం, ఈవో శేష భారతి, భద్రకాళి ప్రధానార్చకుడు భద్రకాళి శేషు, ఆలయ ధర్మకర్తలు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రసాదాలను ఈవో, చైర్మన్ అందజేశారు.

పోలీసుల సేవలు

గతంలో ఎన్నడూలేని విధంగా భక్తులకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక కార్యాచరణతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వరంగల్ ఏఎస్పీ శుభం ప్రకాష్ ఆదేశాలతో ప్రత్యేక క్యూలు, పార్కింగ్‌లు, దర్శనాలకు కేటగిరీల వారీగా లైన్లు ఏర్పాటు చేయడం, పెట్రోలింగ్ వాహనాలు, వీఐపీల దర్శనాలకు ఇబ్బందులు లేకుండా చూశారు. నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్సైలు పోలీసు సిబ్బందితో సహా దాదాపు 250 మంది పోలీసు శాఖ అధికారులు సేవలందించారు.

ఉచిత ప్రసాద వితరణ

భద్రకాళి సేవా సమితి నిర్వాహకులు ఐతా గోపీనాథ్ నేతృత్వంలో శాకంబరీ వేడుకలకు తరలివచ్చిన భక్తులకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు దాదాపు 6 క్వింటాళ్ల ప్రసాదాన్ని పంపిణీ చేశారు. తాగునీరు, బాదం పాలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ జరిగాయి. 8 రకాల ప్రసాదాలను భక్తులకు ఉచితంగా ఇచ్చారు.

తడబడుతున్న 'స్టెప్'!

- నామావశిష్టంగా వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం
- ఒకటి, రెండు ట్రేడ్‌లకే పరిమితమైన శిక్షణ
- శిక్షణకు ముందుకు రాని యువత
- ఫీజు చెల్లించాల్సి రావడంతో వెనుకడుగు
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం



హనుమకొండ బస్‌స్టేషన్ రోడ్డులోని వృత్తినైపుణ్య శిక్షణా కేంద్రం

హనుమకొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి శిక్షణ ఇప్పించాలనే లక్ష్యంతో హనుమకొండ బస్‌స్టేషన్ రోడ్డులో కాకతీయ డిగ్రీ కళాశాలకు ఎదురుగా ఏర్పాటు చేసిన వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రభుత్వ ఉదాసీన, యువత అనాసక్తి మూలంగా నిరుపయోగంగా మారిపోతోంది. ఈ శిక్షణ కేంద్రం ఏర్పాటు వెనుక ఉన్న లక్ష్యం నీరుగారి పోతోంది. కేంద్రం ఉనికి క్రమంగా నామావశిష్టంగా మారుతోంది. యువజన సేవల విభాగం ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రమోషన్(స్టెప్) నిర్వహణలో ఈ కేంద్రం ఒకటి ఉందన్న విషయం చాలామంది నిరుద్యోగ యువతీ యువకులకు తెలియదు. తెలిసినా ఇందులో ఉపాధి శిక్షణ పొందేందుకు ముందుకు రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. మారిన కాలమాన పరిస్థితులకు అనుగుణంగా డిమాండ్ ఉన్న స్వయం ఉపాధికి సంబంధించిన సరికొత్త ట్రేడ్‌లలో శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవడం లేదు. ఈ కేంద్రం ఏర్పాటై పదేళ్లవుతున్నా ఇప్పటికీ సంప్రదాయ వృత్తుల్లోనే శిక్షణ ఇస్తుండడంతో నిరుద్యోగులు అంతగా ఆసక్తి కనబరచడం లేదు. ఒకప్పుడు 21 ట్రేడ్‌లలో శిక్షణ ఇచ్చే ఈ కేంద్రంలో ప్రస్తుతం రెండింటిలోనే శిక్షణ ఇస్తున్నారు.

గతమెంతో ఘనకీర్తి

గతంలో యువజన సర్వీసుల శాఖ విడిగా ఉన్నప్పుడు యువత కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించేవారు. సబ్సిడీపై రుణాలిచ్చి స్వయం ఉపాధి కల్పించేవారు. కళాకారులకు పెద్దపీట వేసి అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. ఏడాదిలో రెండుసార్లు యూత్ ఎక్స్ఛేంజీ ప్రోగ్రామ్(వైఈపీ) చేపట్టేవారు. నగదు ప్రోత్సాహకాలు అందించేవారు. ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన యువత ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకునేవారు. యువజన సంఘాలను బలోపేతం చేయడానికి, వారికి స్వయం ఉపాధి కల్పించడానికి యువ చేతన పథకాన్ని ప్రారంభించారు. కానీ, ఈ పథకం నమోదు ప్రక్రియకే పరిమితమైంది. ఆ తర్వాత అమలుకు నోచుకోలేదు. రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటి సంరక్షించడం, కేరీర్ గైడెన్స్, జన చైతన్య వంటి కార్యక్రమాలు జరిగేవి. అవి ఇప్పుడు జరగడం లేదు. యువజన సేవల విభాగం ఆధీనంలోనే ఉండే స్టెప్ నిర్వహణలో ఏర్పాటైన వృత్తిశిక్షణ కేంద్రాలు ఎంతో విజయవంతంగా నడిచేవి. ఇందులో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లతో పాటు స్వయం ఉపాధి కల్పనకు 18-35 ఏళ్లలోపు యువతకు రాజీవ్ యువశక్తి పథకం కింద సబ్సిడీపై రూ.లక్ష వరకు రుణం మంజూరు చేసేవారు.

కానీ ఇప్పుడు..

నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో టైలరింగ్, కంప్యూటర్‌లో మాత్రమే శిక్షణ ఇస్తున్నారు. సీసీ కెమెరా ఇన్‌స్టాలేషన్, మొబైల్ రిపేరింగ్, ఆర్ అండ్ ఏసీ వంటి కోర్సులను ప్రవేశపెట్టినా ఇందులో శిక్షణ తీసుకోవడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో చివరికి వాటిని రద్దు చేశారు. ప్రస్తుతం శిక్షణా కేంద్రంలో ముగ్గురు శిక్షకులు ఉన్నారు. టైలరింగ్, కంప్యూటర్‌లో శిక్షణ కోసం నిరుద్యోగ యువతీ యువకులు వస్తున్నారు. 30 నుంచి 40 మందికి ప్రస్తుతం ఈ రెండు కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు.

కళతప్పిన స్టెప్

తెలంగాణ ఏర్పాటైన తర్వాత 2016లో జిల్లాల విభజన అనంతరం యువజన సర్వీసు శాఖను క్రీడా ప్రాధికారిక సంస్థలో విలీనం చేశారు. గతంలో ఉన్న సిబ్బందిలో మూడొంతులు తగ్గించారు. గతంలో కొనసాగిన పథకాలు ఒక్కొక్కటిగా రద్దయ్యాయి. దీంతో స్టెప్ కళావిహీనంగా మారింది. గతంలో ఈ కేంద్రంలో ఏ కోర్సులో అయినా ఉచితంగా శిక్షణ ఇచ్చేవారు. కానీ, ఇప్పుడు ఆయా కోర్సులకు రూ.1500 నుంచి రూ.3000 వరకు ఫీజు చెల్లించాలి. యువత శిక్షణ ముందుకు రాకపోవడానికి ఇది కూడా ఒక కారణంగా చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ వృత్తులలో ఉచితంగా శిక్షణ ఇస్తుండగా ఇక్కడ మాత్రం ఫీజులు వసూలు చేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. పైగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ ఆయా కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ పొందగోరే వారికి ఉచిత బస, భోజన వసతులు లేవు. యువత ఈ వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రం వైపు కన్నెత్తి చూడకపోవడానికి ఇది కూడా ఒక కారణం. ఎస్సీ, ఎస్టీ, బీసీ శాఖల ఆధ్వర్యంలోని శిక్షణ కేంద్రాల్లో శిక్షణ పొందేవారికి ఈ సౌకర్యాలను ఉచితంగా కల్పిస్తున్నాయి. ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన యువత కోసం ఏర్పాటు చేసిన శిక్షణా కేంద్రాల్లోనూ ఈ వెసులుబాట్లు ఉన్నాయి. కానీ ఇక్కడే లేకపోవడంతో దీనిని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక్క హనుమకొండలోనే ఈ కేంద్రం ఉంది.

ఆధునీకరించాలి

వృత్తిశిక్షణ కేంద్రానికి గతంలో ఇచ్చినన్ని నిధులు ఇవ్వడం లేదు. కేంద్రంలోని ఉద్యోగులకు వేతనాలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటోంది. మార్కెట్‌లో ఉద్యోగాలకు మంచి డిమాండ్ ఉన్న కొత్త కోర్సులను ప్రవేశపెట్టే విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. యువత తమ కాళ్లమీద తాము నిలబడేలా స్వయం ఉపాధిలో యువత శిక్షణ తీసుకొనేలా ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం లేదు. ప్రోత్సాహకాలను అందించడం లేదు. గతంలో యువజన సర్వీసు శాఖలో ఉన్నప్పటి పథకాలను, రాయితీలను, ప్రోత్సాహకాలను పునరుద్ధరిస్తే దీనికి పూర్వవైభవం వస్తుందని నిరుద్యోగ యువతీ యువకులు అభిప్రాయపడుతున్నారు.

యువత ముందుకు రావడం లేదు..

అశోక్, డీఎస్‌వో, శిక్షణా కేంద్రం ఇన్‌చార్జి, హనుమకొండ



స్టెప్ ఆధ్వర్యంలోని వృత్తినైపుణ్య శిక్షణా కేంద్రంలో కోర్సుల్లో శిక్షణ తీసుకోవడానికి యువతీ యువకులు అంతగా ఆసక్తి చూపడం లేదు. వారిని రప్పించేందుకు చాలా ప్రయత్నాలు చేస్తున్నాం. కళాశాలలకు వెళ్లి విద్యార్థులకు ఈ శిక్షణా కేంద్రంలోని వివిధ కోర్సుల గురించి తెలియచేస్తున్నాం. వీటిలో శిక్షణ పొందడం వల్ల స్వయం ఉపాధి కల్పనకు గల అవకాశాల గురించి అవగాహన కల్పిస్తున్నాం. స్వల్పకాలిక కోర్సులే అయినందున శిక్షణ పొందడం వల్ల భవిష్యత్తులో కలిగే ప్రయోజనాల గురించి వివరిస్తున్నాం. అయినా కూడా పెద్దగా ముందుకు రావడం లేదు. కేంద్రంలో ప్రస్తుతం టైలరింగ్, కంప్యూటర్‌లో శిక్షణ కొనసాగుతోంది. వీటికి మంచి ఆదరణ ఉంది. అంతకుముందు సెల్‌ఫోన్ రిపేరింగ్, ఏసీ రిపేరింగ్, ఎలక్ట్రీషియన్ వంటి కోర్సులను నిర్వహించాం. కానీ, ఎవరూ రాకపోవడంతో వాటిని మూసేశాం. విద్యావంతులైన నిరుద్యోగ యువతీ యువకులు ఇప్పటికైనా ఈ కేంద్రం సేవలను వినియోగించుకుంటే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

'న్యాస్'లో అద్భుత ప్రతిభ

- అభ్యసన సామర్థ్యాలలో జనగామ జిల్లా టాప్
- దేశవ్యాప్తంగా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నిర్వహణ
- 50 ఉత్తమ జిల్లాల్లో జనగామకు చోటు



కలెక్టర్‌తో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్న విద్యాశాఖ అధికారులు (ఫైల్)

జనగామ కల్చరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా గత డిసెంబరులో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 3, 6, 9 తరగతి విద్యార్థులకు పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ (నేషన్ అచీవ్‌మెంట్ సర్వే) న్యాస్-24 నిర్వహించగా ఫలితాలు ఈనెల 9న వెల్లడయ్యాయి. దేశవ్యాప్తంగా ప్రతిభ కనబరిచిన 50 జిల్లాల్లో జనగామకు చోటుదక్కడం విశేషం. న్యాస్‌పరీక్ష కోసం కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ నిర్వహించారు. ఎస్‌సీఈఆర్‌టీ, రాష్ట్ర విద్యా శాఖ సహకారంతో నిర్ణయించిన కార్యక్రమాలకు తోడు ఉపాధ్యాయులతో జిల్లాస్థాయి రిసోర్స్ గ్రూపును ఏర్పాటు చేశారు. ప్రశ్నల నిధి తయారుచేసి అన్ని పాఠశాలలకు అందజేసి 3, 6, 9 తరగతుల విద్యార్థులచే అభ్యాసం చేయించారు. ప్రతీ నెలా న్యాస్ ప్రిపరేషన్ పై హెచ్‌ఎం లతో సమీక్ష నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో న్యాస్ ప్రశ్నలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. మాదిరి పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో ప్రత్యేకంగా మోడల్‌టెస్టులు నిర్వహించి చివరగా గ్రాండ్‌టెస్టు నిర్వహించి సన్నద్ధతను ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు.

జిల్లాలో 2,133 మందికి నిర్వహణ

జిల్లాలో 3వ తరగతిలో 33 పాఠశాలలకు చెందిన 640 మంది విద్యార్థులు, 6లో 27 పాఠశాలలకు చెందిన 688 మంది, 9లో 31 పాఠశాలలకు చెందిన 805 మందితో మొత్తం 91 పాఠశాలల నుంచి 2,133 మంది విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించారు. జనగామ జిల్లా జాతీయ స్థాయిలో 3వ తరగతికి సంబంధించి 16వ స్థానం, 6వ తరగతిలో 35వ స్థానం, 9వ తరగతికి సంబంధించి 33వ స్థానంలో నిలిచింది. ప్రత్యేక కార్యాచరణ ఆసాంతం జనగామ డీఈవో దర్శనం భోజన్న నేతృత్వంలో జరిగింది. న్యాస్ పరీక్షపై ప్రత్యేక పీరియడ్ కేటాయించారు. ఎఫ్ఏ, ఎస్ఏలలో న్యాస్ ఆధారిత ప్రశ్నలు రూపొందించారు. మాదిరి ఓఎంఆర్ షీట్లపై ప్రాక్టీస్ చేయించి తప్పులను నిరోధించారు. తద్వారా జనగామ జిల్లా జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచింది.

ఆలయాల అభివృద్ధితో
పర్యాటక రంగం అభివృద్ధి

- మంత్రి కొండా సురేఖ



అమ్మవారి సన్నిధిలో మంత్రి కొండా సురేఖ

వరంగల్ కల్చరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం భద్రకాళి శాకంబరీ అలంకరణను పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో మంత్రి సురేఖ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను అభివృద్ధి పరుస్తుందని ఇందులో భాగంగానే బాసర సరస్వతి, వరంగల్ భద్రకాళి, భద్రాచలం సీతారామచంద్రస్వామి, వేములవాడలోని రాజరాజేశ్వరాలయం, ఇతర ఆలయాలను అభివృద్ధి పరుస్తున్నామన్నారు. తద్వారా అభివృద్ధితో పర్యాటకులు పెరిగి అన్ని రంగాల అభివృద్ధికి నాంది పలుకుతున్నామన్నారు. పర్యాటక ప్రాంతాలుగా ప్రజలు దర్శించుకోవడంతో ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. త్వరలోనే భద్రకాళి మాడ వీధుల పనులు పూర్తి చేయడానికి అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మంత్రితో కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాష్, ఆలయ ధర్మకర్తలు, ఈవో, చైర్మన్, ఏఎస్పీ శుభం ప్రకాష్, సీఐలు గోపి, షకూర్ పాల్గొన్నారు.

పని ఒత్తిడి.. అప్పుల భారం..

- అవస్థలు పడుతున్న పంచాయతీ కార్యదర్శులు
- తీరిక లేని గ్రామ పంచాయతీ పనులు
- నిధులు విడుదల కాకపోవడంతో ఆవేదన
- శాఖకు సంబంధం లేని పనులు చేస్తున్న వైనం
- సర్పంచ్‌లు లేక తలకుమించిన భారం



నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

నల్లబెల్లి/నెక్కొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలో పాలకవర్గాల కాలపరిమితి ముగియడంతో పరిపాలన భారం పంచాయతీ కార్యదర్శులపై పడుతోంది. ఫిబ్రవరి 2024లో పాలక మండలి పదవీ కాలం ముగియడంతో నాటి నుంచి కార్యదర్శులే గ్రామాల్లో పరిపాలన సాగిస్తున్నారు. పంచాయతీల్లో నిధుల కొరత ఉండగా 18 నెలలుగా ప్రభుత్వం నిధులను విడుదల చేయడం లేదు. ప్రధానంగా బ్లీచింగ్ పౌడర్, వీధి దీపాలు, తాగునీటి సరఫరా, చెత్త ట్రాక్టర్‌ల రవాణాకు సంబంధించిన డీజిల్, తదితర అత్యవసర ఖర్చులు కార్యదర్శులు సొంతంగా భరించాల్సి వస్తోంది. పరిపాలనకు నిధులు ఖర్చు అవుతున్నప్పటికీ అభివృద్ధి నిధులను మాత్రం మంజూరు చేయడం లేదు. దీంతో గ్రామ పంచాయతీల్లో అత్యవసరమైన పనుల కోసం కార్యదర్శులు అప్పులుచేసి అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

మానసిక ఒత్తిడి

గ్రామ పంచాయతీ కార్యదర్శులు పని ఒత్తిడిని తట్టుకోలేక తీవ్రమైన అవస్థలకు గురవుతున్నారు. డిపార్ట్‌మెంట్‌కు సంబంధంలేని పనులు కూడా చేయడంతో పని భారం మరింత పెరిగి మానసిక ఒత్తిడికి లోనవుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాక, సర్పంచుల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి మరిన్ని కష్టాలు ఎక్కువైనట్లు పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అలాగే ప్రతీరోజు జీపీ ఆవరణలో ఉండి ముఖ చిత్రంతో సెల్‌ఫోన్ ద్వారా హాజరు వేసుకోవాలి. గ్రామ పంచాయతీ వ్యవస్థలో ఏ సమస్య వచ్చినా ముందుగా కార్యదర్శులు డబ్బులు పెట్టి పనిచేయించాల్సి ఉంటుంది. ఆయా బిల్లులు ఆలస్యంగా రావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే జీపీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి బిల్లులు రాక 18 నెలలకు పైగా అవుతోంది. దీంతో జీపీల్లోని ప్రజా సమస్యలను తీర్చడంలో పంచాయతీ కార్యదర్శులపై ఆర్థిక భారం పడుతోంది. దీంతో మానసిక ఒత్తిడికి గురైతున్నట్లు వెల్లడిస్తున్నారు.

శాఖేతర పనులు

పంచాయతీ కార్యదర్శులు పని ప్రధానంగా రికార్డులు సక్రమంగా ఉండేలా చూసుకోవడం, గ్రామసభలను విజయవంతం చేయడం, శానిటైజేషన్ చేయడం, వీధి లైట్‌లను సరిచూడడం, ప్రజలకు తాగునీరును అందిచడం, బర్త్, డెత్ సర్టిఫికెట్‌లు అందించడం లాంటివి ప్రధానంగా చేస్తారు. కానీ, ఇవికాకుండా డిపార్ట్‌మెంట్‌కు సంబంధంలేని పని భారాన్ని పంచాయతీ కార్యదర్శులు కుల గణనను చేపట్టారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే ముగ్గులు పోయడం, రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు తీసుకొని, గ్రామ సభలు నిర్వహించడం, రేషన్ కార్డుల సర్వే లాంటి ఎన్నో పనులను పంచాయతీ కార్యదర్శులు చేస్తున్నారు. దీంతో జీపీల్లో అదనపు పని భారం ఏర్పడి తీవ్రమైన మానసిక ఒత్తిడికి, ఆర్థిక ఇబ్బందులకు లోనవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు విడుదల చేయాలి..

గుగులోత్ యాకూబ్‌నాయక్, ఏనుగల్లు జీపీ కార్యదర్శి



అప్పులు చేసి అభివృద్ధి పనులు చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేశాం. డీపీవో, జిల్లా కలెక్టర్‌కు, పంచాయతీ అధికారులకు తమ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాలను అందించాం. నిధులు విడుదల చేసి కార్యదర్శులను ఆదుకోవాలి.

సర్పంచ్‌లు లేక..

గ్రామ పంచాయతీ వ్యవస్థలో ప్రస్తుతం సర్పంచులు లేక ఆర్థిక భారం పడుతోందని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా సర్పంచ్‌లు ప్రజలకు తాగునీరు అందించండంలో పైపు లైన్ వ్యవస్థని బాగుచేయడం, చెత్తసేకరణతో గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉంచడం, వీధిలైట్‌ను ఎప్పటికప్పుడు సరిచూసుకోవడం లాంటివి చేస్తారు. ప్రస్తుతం సర్పంచ్‌లు లేక ఆర్థిక భారం తమపైనే పడుతోందని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెంటాడుతున్న బదిలీల భయం

జీపీల్లో అభివృద్ధి పనులకు అప్పులు చేస్తున్న కార్యదర్శులకు.. తాజాగా బదిలీల భయం వెంటాడుతోంది. జిల్లాలోని కొందరు శాసనసభ్యులు జిల్లా వ్యాప్తంగా కార్యదర్శుల బదిలీలు చేపట్టాలంటూ ఇటీవలనే సంబంధిత మంత్రి శ్రీనివాసరెడ్డిని కోరారు. ఈ సమయంలో తాము బదిలీ అయితే తాము చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఎలా అంటూ ఆందోళన చెందుతున్నారు.

ఆరోగ్య మందిరాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో

వరంగల్ మెడికల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.అప్పయ్య గురువారం సందర్శించారు. మల్లారెడ్డిపల్లిలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం, సిద్ధాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పరిసర ప్రాంతాలు పచ్చదనం ఉండేలా చూసుకోవాలని సూచించారు. ప్రతీ మంగళ, శుక్రవారం డ్రైడే కార్యక్రమం, ఫీవర్ సర్వే చేయాలని, దోమల వల్లే కలిగే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీపాల్, డాక్టర్ నవత, ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



హసన్‌పర్తి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి రజనీ కుమార్ అన్నారు. మండలంలోని సిద్ధాపూర్, భైరాన్‌పల్లి, హరిశ్చంద్రనాయక్ తండాలో గురువారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, ఎన్నికల ఇన్‌చార్జి కందు కూరి చంద్రమోహన్ హాజరై ఆయా గ్రామాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేసి తిరిగి అధికారంలోకి వచ్చి గ్రామాల అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగించేందుకు ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తండా ఇన్‌చార్జి 2వ డివిజన్ కార్పొరేటర్ లావుడ్య రవినాయక్, సిద్ధాపూర్ ఇన్‌చార్జి 65వ డివిజన్ కార్పొరేటర్ దివ్యరాజునాయక్, టీఆర్ఎస్వీ కేయూ ఇన్‌చార్జి జట్టి రాజేందర్, బొమ్మగాని వెంకటేష్, నద్దునూరి నాగరాజు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ముల్కలపల్లి జయశంకర్, మాజీ సర్పంచ్‌లు కుందూరు సాంబరెడ్డి, గడ్డం ఈశ్వర్, మొగిళి, మాజీ ఎంపీటీసీలు సారంగపాణి, కుమారస్వామి, మాజీ డైరెక్టర్ రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

వినయ్‌భాస్కర్‌ను విమర్శించే నైతికత అజీజ్‌ఖాన్‌కు లేదు



కార్యాలయంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

హనుమకొండ టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): డబ్బులు ముట్టజెప్పి నామినేటెడ్ పదవిలోకి వచ్చి దందాలు చేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్‌కు మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌ను విమర్శించే నైతికత లేదని బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఇమ్మడి లోహిత రాజు, సంకు నర్సింగ్ విమర్శించారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు చెన్నం మధు, ఇమ్మడి లోహిత రాజు, సంకు నర్సింగ్, సోదా కిరణ్, పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్‌లతో కలిసి విలేకరుల మాట్లాడారు. గ్రేటర్ వరంగల్ అభివృద్ధికి వేలకోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి చేసిన మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌పై విమర్శలు చేసే స్థాయి అజీజ్‌ఖాన్‌కు లేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీలో పదవి పొంది ఎన్నో దందాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. కార్పొరేషన్ ఎన్నికల కోసం ఎమ్మెల్యే మెప్పు కోసం ప్రయత్నాలు చేస్తున్న అజీజ్‌ఖాన్ బండారం బయటపెడుతామని మండిపడ్డారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఇమ్మడి రాజు, సదాంత్, చిన్న, కనకరాజు, సోని, దేవమ్మ, రఘు, ఖాదర్, రాంమూర్తి, బచ్చు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



ఎస్‌బీహెచ్ కాలనీ వేంకటేశ్వరాలయంలో అభిభాషణం చేస్తున్న సముద్రాల పురుషోత్తమాచార్యులు




కాజీపేటలోని శ్వేతార్క ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న దాస్యం వినయ్‌భాస్కర్

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

వడ్డెపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వివిధ డివిజన్లలో గురుపౌర్ణమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రేటర్ వరంగల్ 60వ డివిజన్‌లోని టీచర్ కాలనీ ఫేస్ -1, ఎస్‌బీహెచ్ కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో రుత్వికులు సముద్రాల పురుషోత్తమాచార్యులు , కండ్లకుంట్ల శ్రీనివాసాచార్యులు అభిభాషణం చేశారు. ఈ సందర్భంగా నగర సంకీర్తన , కాగడహారతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిర్ర రఘుపతి రెడ్డి, ప్రతినిధులు శేషగిరి, రవీందర్, పింగిళి స్వరూప రాణి, చంద్రమౌళి, జితేందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సావిత్రి,నవనీత, భానుమతి, నిర్మల, వకుల, పాల్గొన్నారు.

• హనుమకొండ గోపాల్‌పూర్ క్రాస్ రోడ్డులోని శ్రీవేంకటగణేశ సాయి సువర్చల అభయాంజనేయ స్వామి దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలను ఆలయ ప్రధానార్చకులు ఆరుట్ల కిరణ్‌కుమారాచార్యులు, అర్చకులు పానుగంటి మణిశర్మ, దుల్లూరి అరవింద్ శర్మ పర్యవేక్షణలో నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథుడికి పంచామృతాభిషేకం , సామూహిక శ్రీసాయి సత్యవ్రతంతో పాటు భక్తులకు అన్నదానాన్ని నిర్వహించారు.భక్తులు అశేషంగా తరలివచ్చి సిద్ధి సాయినాథుడిని దర్శించుకొని కొలిచారు.



మడికొండలో శాకంబరీ అలంకారంలో దర్శనమిస్తున్న మహంకాళి అమ్మవారు

• మడికొండ : మడికొండలోని మహంకాళి మాత ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి ఉపద్రష్ట మంత్రవాది వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులు అమ్మ వారికి పంచామృతాలు, పంచవర్ణాలతో అభిషేకం చేశారు. అనంతరం పలురకాల కూరగాయలతో అలంకరించారు. శాకంబరీ అవతారంలో దర్శనమిచ్చిన కాళీ మాతను భక్తులు భక్తి శ్రద్ధలతో పూజించారు. కార్యక్రమంలో దువ్వ విజయ, రాజేశ్వరి, సరస్వతి, సరిత, రుగ్వేజ్‌శర్మ, సమత, స్వప్న, లలిత, లక్ష్మీదేవి, శ్రీదేవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

• కాజీపేట: కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో గురువారం గురుపౌర్ణమిని పురస్కరించుకుని గురు దత్తాత్రేయ, షిర్డీ సాయిబాబాకు విశేష పూజలు చేశారు. పంచామృత, పంచవర్ణ ఏకాధార సహస్రధార, రుద్రాభిషేకాలు, అభిషేకాలు చేశారు. ఆ తర్వాత గురువులకు గురుపాదుక పూజను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ వ్యవస్థాపక చైర్మన్ ఐనవోలు వెంకటేశ్వర శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజలకు ఆలయ సిబ్బంది, స్థానిక భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

శాకంబరేశ్వరుడిగా రుద్రేశ్వరుడు

• శాకంబరీ దేవిగా రుద్రేశ్వరీ అమ్మవారు



శాకంబరేశ్వరుడి అలంకారంలో రుద్రేశ్వరుడి దర్శనం

హనుమకొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల గుడిలో గురుపౌర్ణమిని పురస్కరించుకొని 21 రకాల కూరగాయలతో రుద్రేశ్వరస్వామి వారిని శాకంబరేశ్వరుడిగా, రుద్రేశ్వరీదేవిని శాకంబరీ అమ్మవారుగా ఖడ్గమాలతో పేర్కొన్న విధంగా అందంగా, కళాత్మకంగా అలంకరించారు. భక్తులకు నయనానందకరంగా దర్శనమిచ్చారు. భక్తితో తన్మయులయ్యారు. వేలాది మంది భక్తులు రుద్రేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్ర శర్మ, వేదపండితులు గంగు మణికంఠ మూడు గంటల పాటు శ్రమించి ఈ అలంకరణ చేశారు. ఆలయం పచ్చని కూరగాయలతో శోభిల్లింది. అంతకు ముందు ఉదయం ప్రాతఃకాల నిత్యాహ్నిక పూజలు నిర్వర్తించి రుద్రేశ్వరుడికి ఘనంగా రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం పలు రకాల కూరగాయలతో రుద్రుడు, రుద్రేశ్వరిలకు ఈ అలంకరణలు చేశారు.

గురుపూర్ణిమను పురస్కరించుకొని ఆలయంలో గురుపూజోత్సవాన్ని కూడా నిర్వహించారు. విద్యారంగంలో విశేషంగా కృషి చేస్తున్న మహిళా గురువులు బొమ్మిరెడ్డిపల్లి గాయత్రీదేవి, హిందీ ఉపాధ్యాయురాలు కె.పద్మజ, మయూరిలను ఘనంగా సత్కరించారు. అర్చకులు సందీప్ శర్మ, ప్రణవ్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అనిల్‌కుమార్, సిబ్బంది రామక్రిష్ణ, మధుకర్, రజిత, సుజాత భక్తులకు సేవలను అందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం కలెక్టరేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎక్సైజ్ కాలనీ, రెవెన్యూకాలనీ, కేఎల్ఎన్‌రెడ్డి కాలనీ, సుబేదారి ఏరియాలో ఉదయం 9నుంచి 11గంటల వరకు విద్యుత్ ఉండదని హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మడికొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. మడికొండ ఎంఎన్‌నగర్‌లో గురువారం కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు స్థానిక పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 72,500 నగదు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి డీఎస్‌యూ పోరాటం

కేయూ క్యాంపస్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ధర్మ స్టూడెంట్స్ యూనియన్(డీఎస్‌యూ) పోరాతుందని డీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి పూరేళ్ళ విష్ణు అన్నారు. గురువారం కేయూలో ధర్మ స్టూడెంట్ యూనియన్ నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో విష్ణు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాడుతామని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాధికార సాధనకు డాక్టర్ విశారదన్ మహారాజ్ లక్ష కిలోమీటర్ల మహా భూమి రథయాత్రను విజయవంతం చేయాలని అన్నారు. డీఎస్‌యూ కేయూ కన్వీనర్‌గా పెండ్యాల ధర్మ మహారాజ్, కోకన్వీనర్లుగా ప్రతాప్, కమిటీ సభ్యులుగా రక్షిత, హర్షవర్ధన్, రాజేశ్, నందిని, చంద్రశేఖర్, పవన్‌లు నియామితులయ్యారని తెలిపారు. డీఎస్‌యూ నేతలు అన్నమయ్య, విజయ్, పవన్ పాల్గొన్నారు.





సెంట్రల్ జైలు పెట్రోల్‌పంపు ముందు నిలిచిన మురుగునీరు

ప్రధాన రహదారిపై మురుగు నీరు

అవస్థలు పడ్డ ప్రజలు, పట్టించుకోని అధికారులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని ములుగురోడ్డు ప్రధాన రహదారి జలమయమైంది. డ్రైనేజీ నుంచి ప్రవహించిన మురుగునీరు రోడ్డుపై నిలవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ములుగురోడ్డు నుంచి ఎంజీఎం ప్రధాన రహదారి సెంట్రల్ జైలు పెట్రోల్ పంపు ముందు ప్రధాన రహదారిపై గురువారం ఒక్కసారిగా చెరువును తలపించే విధంగా మురుగునీరు రోడ్డుపైకి చేరుకున్నాయి. దీంతో అటుగా ప్రయాణించే వాహనచోదకులు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. మురుగు నీరు ప్రధాన రహదారిపై నిలవడంతో చుట్టుపక్కల చిరువ్యాపారులు నగర పాలక సంస్థ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తమైన శానిటేషన్ అధికారులు ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, శానిటరీ సూపర్‌వైజర్ పసునూరి భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నూరి శ్యాంరాజ్ సిబ్బంది పెట్రోల్ బంకు వద్దకు చేరుకుని ప్రధాన డ్రైనేజీ పైప్‌లైన్‌లో ఏదైనా సమస్య ఉందా అని తనిఖీ చేయించారు. జైలుప్రాంతంలో నిర్మిస్తున్న సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో నిల్వ ఉన్న నీటిని వదిలి వేయడంతో ఈసమస్య ఉత్పన్నమైనట్టు శానిటేషన్ అధికారులు గుర్తించారు. వెంటనే అక్కడి ఇంజనీర్లను కలిసినా ప్రయోజనం లేకపోవడంతో శానిటేషన్‌సిబ్బంది వెనక్కివెళ్లిపోయారు.

డ్రెయిన్‌ల నిర్మాణం తర్వాత రోడ్లు వేయాలి

» గ్రేటర్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

» భవన నిర్మాణ అనుమతుల కోసం పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : డ్రెయిన్‌ల నిర్మాణం తర్వాత రోడ్లు వేయాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ కోరారు. గురువారం హనుమకొండ 53వ డివిజన్ సమ్మయ్యనగర్, సరస్వతి నగర్‌లలో కమిషనర్ సైట్ ఇన్‌స్పెక్షన్ చేసి ఆయా ప్రాంతాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులపై అక్కడి ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమర్థవంతంగా పనులు నిర్వర్తించేందుకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. వివిధ పనుల కోసం ప్రపోజల్స్ వచ్చినప్పుడు గూగుల్ మ్యాప్ ద్వారా ముందస్తుగా ఒక స్పష్టత ఏర్పర్చుకోవాలన్నారు. డ్రైన్లు, నీటి సరఫరాకు సంబంధించిన పనులు పూర్తి చేసిన తర్వాతనే రోడ్డు నిర్మాణాలు జరపాలన్నారు.

భవన నిర్మాణ అనుమతుల కోసం పరిశీలన

శంభునిపేట, రెడ్డిపురం, గోపాలపురం, చింతగట్టు బ్రిడ్జి ప్రాంతాల్లో అక్కడి ప్రజలు భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడానికి కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొలత ద్వారా శాస్త్రీయంగా పర్యవేక్షించారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తివ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడేకర్, ఏసీపీలు రజిత, ఇర్షాద్, ఈఈ రవికుమార్, డీఈ రాజ్‌కుమార్, ఏఈ హరికుమార్ పాల్గొన్నారు.

జవాన్లదే పారిశుధ్య సిబ్బంది పర్యవేక్షణ

పారిశుధ్య సిబ్బంది పర్యవేక్షణ అక్కడ పనిచేసే జవాన్‌లదేనని, రోడ్లపైన ఎక్కడ చెత్త కనిపించినా తీవ్ర పరిణామాలు ఉంటాయని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ హెచ్చరించారు. గురువారం గ్రేటర్ వరంగల్ 4, 5, 6 డివిజన్‌లలోని టైలర్‌స్ట్రీట్, రెడ్డిపురం, కుమార్‌పల్లి మార్కెట్, పెగడపెల్లి డబ్బాల ప్రాంతంలో కమిషనర్‌తోపాటు శానిటేషన్ అధికారులు పర్యటించారు. ఆయాప్రాంతాల్లో నెలకొన్న శానిటేషన్ సమస్యలపై అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమర్థవంతగా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. డివిజన్‌లలో పనిచేసే సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఏయే ప్రాంతాల్లో ఎవరు పని చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఏయే ప్రాంతాల్లో ఏయే జవాన్లు పని చేస్తున్నారు? జవాన్‌లకు సిబ్బందికి సమన్వయం ఉందా?లేదా?అని అక్కడ పనిచేసే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛఆటోలు, ట్రాక్టర్లు రోజుకు ఎన్ని ట్రిప్పులు కొడుతున్నారో శానిటేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో జవాన్లు సిబ్బందిపై తప్పుడు సమాచారం ఇస్తే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. స్వచ్ఛఆటోల డ్రైవర్లు ప్రతీ రోజు 100 శాతం ఇండ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించాలని ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్ లేకుండా ఎవరైనా వ్యాపారాలు నిర్వహిస్తే తప్పకుండా ఫీజు వసూలు చేయాలని, లేదంటే ఆ ఫీజు జవాన్‌లే చెల్లించాల్సి ఉంటుందని జవాన్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్, ఏఈ హరికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోలెపాక అనిల్‌కుమార్, ఎస్.ప్రకాశ్ పాల్గొన్నారు.



గోపాలపురంలో భవన నిర్మాణ అనుమతులను పరిశీలిస్తున్న కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

బీఆర్ఎస్ హయాంలో కేంద్రం నిధులు వెనక్కి

• మీడియా సమావేశంలో కాంగ్రెస్ కార్పొరేటర్ల వెల్లడి

హనుమకొండ చౌరస్తా, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరాభివృద్ధి కోసం స్మార్ట్ సిటీ పథకం ద్వారా కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తే వాటిని సద్వినియోగం చేయకుండా కాలయాపన చేసిన అసమర్థులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు అని జీడబ్ల్యూఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. గురువారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, సయ్యద్ విజయశ్రీ రజాలీతో కలిసి మాట్లాడారు. 10ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో చేయలేని నగర అభివృద్ధిని 18నెలల కాలంలోనే కాంగ్రెస్ పార్టీ, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేశారన్నారు. వరంగల్ నగర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన స్మార్ట్‌సిటీ నిధులు బీఆర్ఎస్ ప్రభుత్వం వినియోగించకపోవడంతో వెనక్కి వెళ్లాయని, ఎమ్మెల్యే నాయిని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి ఆనిధులు తీసుకువచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు.. హుందా రాజకీయలను చేయకుండా దిగజారి పోతున్నారని మండిపడ్డారు. ఇటీవల నిర్వహించిన జీడబ్ల్యూఎంసీ కౌన్సిల్ సమావేశంలో నియోజకవర్గ అభివృద్ధిపై పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతున్న సందర్భంలో బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు సమవేశాన్ని బహిష్కరించడం దుర్మార్గమన్నారు. బీఆర్ఎస్ అధికారంలో కొనసాగిన సమయంలో కాంగ్రెస్ కార్పొరేటర్ల డివిజన్ల అభివృద్ధిపై చిన్న చూపు చూశారని, కాంగ్రెస్ పార్టీ పాలనలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్ని పార్టీల కార్పొరేటర్ల డివిజన్ల అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తున్నారన్నారు. భద్రకాళి బండ్ చెరువు అభివృద్ధి ప్రక్రియ ఈ-టెండర్ విధానం బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లకు, నాయకులకు తెలియకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు శ్రీమాన్, మామిండ్ల రాజు, నెక్కొండ కవిత కిషన్, ఏనుగు మానస రాంప్రసాద్, గుంటి రజిత శ్రీనివాస్, 10వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శోభనబోయిన కుమార్‌యాదవ్, నాయకులు భరత్‌కుమార్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ భవన్‌లో మాట్లాడుతున్న ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు

ఘనంగా గురుపూజోత్సవం

హనుమకొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గురుపూర్ణిమ సందర్భంగా శాయంపేట శిశు మందిర్‌లో గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. ఉపాధ్యాయులను విద్యా వికాస ఫౌండేషన్ సన్మానించింది. వారికి క్లాత్ బ్యాగ్‌లను అందచేసింది. ఈ కార్యక్రమాన్ని విద్యావికాస ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెండ్లి ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. పర్యావరణపై ప్రజల్లో అవగాహన కలిగించే ప్రయత్నంలో భాగంగా ఉపేందర్ రెడ్డి క్లాత్ బ్యాగ్‌లను పంపిణీ చేసే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా గురుపూర్ణిమ రోజున ఉపాధ్యాయుల సన్మానం సందర్భంగా కూడా వారికి క్లాత్ బ్యాగ్‌లను అందచేశారు.

• రాంనగర్: పాఠశాలస్థాయిలో విద్యాబుద్ధులునేర్పిన గురువును గురు పౌర్ణమి సందర్భంగా పూర్వవిద్యార్థి అయిన సంద్ర మధు గురువారం శాలువా, పూలదండ వేసి సత్కరించారు. ప్రస్తుతం మర్కజీ పాఠశాలలో పని చేస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి గతంలో ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలలో విధులు నిర్వర్తించాడు.

• హనుమకొండ కల్చరల్: హనుమకొండ టీచర్స్ కాలనీ ఫేస్- 2లోని శ్రీ అభయాంజనేయ ఆలయంలోని కమ్యూనిటీ హాల్‌లో యోగా గురువు పాశం వెంకటయ్యను యోగా క్లబ్ గురువారం ఘనంగా సత్కరించింది. వెంకటయ్యకు 80 ఏళ్లు నిండిన సందర్భంగా ఆయనపై ప్రచురించిన ఆశీతి సంచికను ఆవిష్కరించారు. సభకు గుడిపెల్లి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్యే ఒడితెల సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై అభినందన సంచికను ఆవిష్కరించారు. ప్రవచనకర్త వంగల సోమయాజులు గురుపూర్ణిమ విశిష్టతను తెలియచేశారు. విశిష్ట అతిథులు ఆచార్య శంకరయ్య, ప్రముఖ న్యాయవాది పాముపర్తి సదాశివరావు, యోగా శిక్షకురాలు డాక్టర్ కె.ఇందిర, లింగపల్లి రామచంద్ర, సంచిక సంపాదకులు ఆచార్య నరసింహమూర్తి, ఆర్తి పరాంశకుం ఎస్.రాజేశ్వరశాస్త్రి ప్రసంగించారు.అనంతరం వెంకటయ్యభారతి దంపతులకు యోగా క్లబ్ సభ్యులు సన్మానించారు. కె.పురుషోత్తం వందన సమర్పణ చేశారు.



ఉపాధ్యాయుడు కంది శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న మధు

• హసన్‌పర్తి : భక్తి మార్గమే సత్యమార్గమని రాజరాజేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్ అన్నారు. గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తి పాత మార్కెట్ వీధి శ్రీరాజ రాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో చైర్మన్ కందుకూరి చంద్రమోహన్ ఆధ్వర్యంలో అర్చకులు సుమనాచార్యులు గురు పూర్ణిమ ఉత్సావాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు మొలుగూరి విజయ్, కృష్ణమూర్తి, రమేష్, రజనికుమార్, సక్కుబాయి, జయలక్ష్మీ, శాంతమ్మ, వెంకటేశ్వర్లు, విజయ, వసంత, స్వర్ణలత, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



ఆశీతి సంచికను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఒడితెల సతీష్‌కుమార్, తదితరులు

నవసమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

కేయూ క్యాంపస్ : యువత నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కేయూ సోషియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం.స్వర్ణలత అన్నారు. గురువారం కేయూ క్యాంపస్‌లోని సోషియాలజీ, సోషల్‌వర్క్స్ విభాగంలో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదన్నారు. ఉపాధ్యాయులు గౌరవాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. లక్ష్య సాధనలో ముందుండాలని చెప్పారు. సోషియాలజీ, సోషల్ వర్క్స్ విభాగం అధ్యాపకులను విద్యార్థులు, స్కాలర్లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వాసు, సాహితీ, సుభాష్, రజిత, ప్రసన్న, యాస్మిన్, స్కాలర్లు దుగ్గెల తిరుపతి, రాజారాం, కందికొండ తిరుపతి, ఈ. రాజు, శ్రీదేవి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



సోషియాలజీ విభాగంలో గురుపౌర్ణమి వేడుకలు..

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...

దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !

పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.

సంప్రదించగలరు : హన్మకొండ

Hanamkonda ACO - 9985410935,
Hasanparthy SR - 9059882000,
Hanamkonda - 9704361601
Parkal SR- 7396327489,
Kazipet SR - 8519926489 ACM - 9985411664

మూఢం ఎందుకు వస్తుంది?

హిందువులు ఏ పనులు ప్రారంభించినా ముహూర్తాలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. సాధారణంగా ముహూర్తాలు గ్రహాల బలం మీద ఆధార పడి ఉంటాయి. ముఖ్యంగా శుభకార్యాలను తలపెట్టాలన్నా... గురు, శుక్ర గ్రహాల బలాల ఆధారంగా పండితులు ముహూర్తాలు నిర్ణయిస్తారు. ఈ రెండు గ్రహాలు తమ భ్రమణంలో బలహీనంగా మారినప్పుడు బలమైన ముహూర్తాలు ఉండవు. శుభకార్యాలు నిర్వహించడానికి బలమైన ముహూర్తాలు లేని రోజులను 'మూఢం' (మౌఢ్యమి) అంటారు. మరికాస్త వివరంగా చెప్పాలంటే... నవగ్రహాలలో అత్యంత శక్తిమంతమైన, స్వయం ప్రకాశకత్వం కలిగిన గ్రహం సూర్యుడు. అందుకే సూర్యగ్రహాన్ని గ్రహాలన్నిటికీ రాజు అంటారు. సూర్యుడికి అత్యంత సమీపంలోకి ఏ గ్రహమైనా వస్తే... ఆ గ్రహం తన శక్తిని కోల్పోతుంది. గ్రహాల భ్రమణంలో గురుగ్రహం సూర్యునికి దగ్గరకు వస్తే 'గురు మూఢం' అని, శుక్ర గ్రహం దగ్గరికి వస్తే 'శుక్ర మూఢం' అని వ్యవహరిస్తారు. ఈ సమయంలో గురు, శుక్ర గ్రహాలు తమ బలాన్ని కోల్పోతాయి. ఈ ఏడాది జూన్ 10 నుంచి జూలై ఎనిమిది వరకూ సూర్యుడికి దగ్గరగా గురు గ్రహం ఉండడంతో ఆ కాలాన్ని 'గురుమూఢం'గా పరిగణించడం జరిగింది. ఈ ఏడాది నవంబర్ 30 నుంచి వచ్చేఏడాది ఫిబ్రవరి 13వ తేదీ వరకు సూర్యుడికి శుక్రుడు దగ్గరగా ఉంటాడు. ఆ కాలాన్ని 'శుక్రమూఢం' అంటారు.

> గ్రహాల భ్రమణంలో గురు గ్రహం సూర్యునికి దగ్గరకు వస్తే 'గురు మూఢం' అని, శుక్ర గ్రహం దగ్గరికి వస్తే 'శుక్ర మూఢం' అని వ్యవహరిస్తారు. ఈ సమయంలో గురు, శుక్ర గ్రహాలు తమ బలాన్ని కోల్పోతాయి.

చేయకూడనివి, చేయదగ్గవి...


ఈ రెండు సమయాల్లో వివాహాది శుభ కార్యాలు, వాటికి సంబంధించిన కార్యక్రమాలు చేపట్టడం, పిల్లలకు పుట్టువెంట్రుకలు తీయించడం, చెవులు కుట్టించడం, కొత్త వ్యాపారాలు ప్రారంభించడం, కొత్త వాహనాల కొనుగోలు, శంకుస్థాపనలు, వ్రతాలు, విగ్రహ ప్రతిష్ఠలు, చెరువులు తవ్వడం లాంటి పనులు చేయకూడదని, దానివల్ల దుష్ఫలితాలు ఎదురవుతాయని పూర్వులు చెప్పారు. కాగా చిన్న పిల్లలకు అన్నప్రాశన, దూరప్రయాణాలు, ఇళ్ళకు చిన్న మరమ్మతులు, భూముల క్రయవిక్రయాలు, అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్లు, విదేశీ యానాలు, కొత్త ఉద్యోగాల్లో చేరడం, నూతన వస్త్రాల కొనుగోలు, పుణ్యక్షేత్ర సందర్శన, దేవాలయాల్లో అన్నదానాలు, గృహాల్లో సీమంతాలు, ఇతర దైవ, పితృకార్యాలు, నవగ్రహ శాంతులు, హోమాలు తదితరాలు చేయవచ్చునని సూచించారు.

తెలుసుకుందాం



• సి.ఎన్.మూర్తి,
8328143489

విశేషం



అందుబాటులో రాజ్యాధికారం, చతురంగబలాలు అపారమైన సంపద, గుణ రూపలావణ్యవతులైన భార్యలు, ఎంతో ప్రేమగా చూసుకొనే తల్లిదండ్రులు... వీటన్నిటినీ విడిచిపెట్టి, యవ్వనంలోనే సన్న్యాస దీక్ష తీసుకొని, అపూర్వమైన గ్రంథ నిధిని మధ్వ సిద్ధాంత వాఙ్మయానికి అందించిన వారు శ్రీజయతీర్థులు. 'మధ్వాఖ్యరాజు'గా ప్రసిద్ధి పొందిన ఆయన మధ్వ సంప్రదాయంలో ఎందరో మహనీయులకు మార్గదర్శిగా నిలిచారు.

జ్ఞానసేతువు

సాధినాడు సంస్థానానికి చెందిన యువరాజు సాధి దొండు రఘునాథరాయలు. ఒకసారి అతను వేటకు వెళ్ళాడు. తిరిగి తిరిగి అలసిపోయిన అతను భరించలేని దాహార్తితో... భీమా నదిని చేరుకున్నాడు. కిందికి దిగకుండా... గుర్రం మీద నుంచి వంగి, నదిలోని నీటిని నేరుగా నోటితో తాగుతున్నాడు. మధ్వాచార్యుల శిష్యులైన అక్షోభతీర్థులు నదికి అవతలివైపు నుంచి దీన్ని గమనించారు. "కిం పశుః పూర్వ దేహే?" (నువ్వు గత జన్మలో పశువువా?) అని ప్రశ్నించారు. ఆ నాలుగు పదాల ప్రశ్నతో... తను గత జన్మలో ఒక ఎద్దుగా జన్మించి, శ్రీమధ్వాచార్యుల గ్రంథాలను మోసి, ఆయన తన శిష్యులకు శాస్త్రజ్ఞానం బోధిస్తూ ఉండగా విన్న అనుభవాలు రఘునాథరాయలుకు తక్షణమే జ్ఞాపకం వచ్చాయి. అక్షోభతీర్థుల వద్దకు పరుగుపరుగున వచ్చాడు. తన తలను ఆయన పాదాలకు భక్తితో తాకించి "నన్ను తమరి శిష్యులుగా స్వీకరించాలని, శ్రీమధ్వశాస్త్రాన్ని ఉపదేశించి నన్ను పునీతుణ్ణి చేయాలని ప్రార్థిస్తున్నాను" అని ఆర్తితో వేడుకున్నాడు. అక్షోభతీర్థులు అతణ్ణి సంతోషంగా పైకి లేపి "నీకు శ్రీమధ్వశాస్త్రాన్ని బోధించడం కాదు... నిన్ను శ్రీమధ్వాచార్యుల వేదాంత సామ్రాజ్యానికి అధిపతిగా పట్టాభిషిక్తుణ్ణి చేస్తాను. సన్న్యాసి కావడానికి సిద్ధపడు" అని చెప్పారు.

అప్పుడు రఘునాథరాయలు "నాకు శాస్త్రజ్ఞానం ఉంటే చాలు. అంతటి ఉన్నత స్థానానికి అర్హుణ్ణి కాదు" అన్నాడు. "ఇది దైవసంకల్పం. దీన్ని నీవు స్వీకరించాలి" అన్నారు అక్షోభతీర్థులు.

గురు ఆదేశంలో గ్రంథ రచన

ఆ రాత్రి రఘునాథరాయలు కలలో శ్రీవాయుదేవులు కనిపించి "నీవు సన్న్యాసం స్వీకరించు. శ్రీరాముణ్ణి పూజించు. విద్వదగ్రగణ్యుడివి అవుతావు, సర్వజ్ఞానులకు ఆశ్రయం అవుతావు" అని ఆశీర్వదించారు. ఆ మరుసటిరోజే రఘునాథరాయలు సన్న్యాసదీక్ష స్వీకరించి, 'జయతీర్థులు'గా వినుతికెక్కారు. "భాష్యం లేనిదే సూత్రాలు అర్థం కావు. టీకా లేనిదే భాష్యార్థం తెలుసుకోలేరు. అటువంటి టీకాలను రచించే బాధ్యత భగవంతుడు నీపైన ఉంచాడు" అంటూ తన శిష్యుణ్ణి గ్రంథరచన చేయాల్సిందిగా అక్షోభతీర్థులు ఆదేశించారు. ఆ మాటలు వినగానే "నా భాష్యాలకు వ్యాఖ్యానం రాసేది ఈ ఎద్దే" అని శ్రీమధ్వాచార్యులు (జయతీర్థుల పూర్వజన్మలో) అన్న మాటలు శ్రీజయతీర్థుల చెవిలో మారుమోగాయి. జీవితంలో... మొదటి ఇరవై ఏళ్ళపాటు వ్యాకరణ శబ్దాల జోలికే పోని వ్యక్తి... సన్న్యాసదీక్ష తీసుకున్న తరువాత ఇరవై ఏళ్ళలోనే మధ్వ సిద్ధాంతానికి టీకా, వ్యాఖ్యానాలు రాసి... విద్వాంసులందరినీ మెప్పించడం అనేది ఊహాతీతం. 'న్యాయసుధ' (శ్రీమధ్వాచార్యుల అణువ్యాఖ్యానానికి టీకా), 'తత్త్వప్రకాశిక' (సూత్రభాష్యానికి టీకా), 'న్యాయవివరణ' టీకా, 'సంబంధ దీపిక' ('ఋగ్భాష్యా'నికి టీకా), 'ప్రమేయ దీపిక' (గీతాభాష్యానికి టీకా)... ఇలా అనేక అసాధారణమైన గ్రంథాలను ఆయన రచించారు. వేద, ఉపనిషత్, పురాణ వాక్యాలు ఎన్నిటినో తన రచనలలో ఆయన అడుగడుగునా పొందుపరిచారు. తనపై ఉన్నది మహత్తరమైన బాధ్యత అనీ, దాన్ని తన బుద్ధిద్వారానో, పాండిత్య ప్రతిభతోనో నిర్వర్తించలేనని, భగవంతుడు, వేదవ్యాసుడు, శ్రీవాయుదేవుడు, సరస్వతీదేవి, దుర్గాదేవిల అనుగ్రహం వల్లనే అది సాధ్యమని శ్రీజయతీర్థులకు తెలుసు. అందుకే దుర్గా బెట్ట అనే ప్రదేశాన్ని తన తపోభూమిగా ఎంచుకున్నారు. కొన్నాళ్ళు పచ్చగడ్డి, ఆకులు, ఆ తరువాత ఎండుగడ్డి, రాలిన ఆకులను మితంగా స్వీకరిస్తూ తపస్సు చేశారు. ఆయన తపస్సు ఫలించి సరస్వతీదేవి, దుర్గాదేవి ప్రత్యక్షమయ్యారు. గ్రంథ రచనకు కావాల్సిన జ్ఞానాన్ని, సాధన సంపత్తిని అనుగ్రహించారు. ఆయన తపోనిరతులై ఉన్నప్పుడు ఆదిశేషుడు వచ్చి... తన పడగను ఆయన నాలుకపై ఆడించాడు. ఇది కూడా ఆయన విశేష జ్ఞానసిద్ధికి కారణమయింది.

టీకారాయలు

వైష్ణవ వేదాంత సంప్రదాయంలో శ్రీమధ్వాచార్యుల తరువాత... తన అసాధారణ వాఙ్మయ తపస్సుతో మాన్యుడైన శ్రీజయతీర్థులదే అగ్రస్థానం. 'టీకారాయలు'గా ఆయన ప్రసిద్ధి చెందారు. "వ్యాససూత్రాలు అనే మందర పర్వతాన్ని... శ్రీమధ్వుల భాష్యాలనే తాడుతో చుట్టి... ఆ వేదరాశిని చిలకడం ద్వారా ఉద్భవించినదే శ్రీజయతీర్థుల న్యాయసుధ" అని శ్రీవ్యాసరాయలు ప్రశంసించారు. శ్రీవ్యాసరాయలు, శ్రీవాదిరాజులు, శ్రీరఘోత్తములు, శ్రీరాఘవేంద్రస్వామి... ఇలా అనేకమంది మహనీయులు ఆయన గ్రంథాల్లోని ఆశయాలను వ్యక్తీకరించడమే తమ జీవన సిద్ధిగా భావించి రచనలు చేశారు. ఒక విధంగా చెప్పాలంటే భాష్యకారుల సంప్రదాయానికి ఆయన జ్ఞానసేతువు అయ్యారు. తత్త్వజ్ఞాన దుందుభిని మోగించి... 'మధ్వాఖ్యరాజు'అని కీర్తి పొందారు. మలఖేడ్ రాజ్యం ఇప్పుడు లేదు. కానీ ఆ ప్రదేశం ఇప్పుడు పుణ్యక్షేత్రం అయింది. శ్రీజయతీర్థులు స్థిరపరచిన మధ్వ సిద్ధాంతం అక్కడ శోభాయమానంగా వెలుగొందుతోంది.

(ఈనెల 14 నుంచి 16 వరకు శ్రీజయతీర్థుల ఆరాధన మహోత్సవాలు)

• శ్రీమధ్వ ప్రచార పరిషత్

సద్బోధ

మాటలులేని ప్రశ్న

టిబెట్‌కు చెందిన బౌద్ధ గురువుల్లో ప్రసిద్ధి చెందినవాడు మార్పా. ఒకసారి ఒక వ్యక్తి అతని దగ్గరకు వచ్చి... "మీరు చాలా గొప్ప జ్ఞాని అని విన్నాను. మీరు జ్ఞాని అనే విషయాన్ని మాటలు ఉపయోగించకుండా నాకు తెలియజేస్తే సంతోషిస్తాను" అన్నాడు. అప్పుడు మార్పా నవ్వి "సరే! ముందు మాటలు ఉపయోగించకుండా మీరు ప్రశ్నించండి. తరువాత మాటలు వాడకుండా మీరు కోరినదాన్ని తెలియజేస్తాను" అన్నాడు. "అదెలా సాధ్యం?" అని అడిగాడు ఆ వ్యక్తి. "అది నా సమస్య కాదు, మీ సమస్య. మీరే బాగా ఆలోచించి, దానికి పరిష్కారాన్ని కనుక్కొని రండి" అన్నాడు మార్పా.

'మాటలు ఉపయోగించకుండా ప్రశ్నించడం ఎలా?' అని ఆ వ్యక్తి తీవ్రంగా ఆలోచిస్తూ ఇంటికి బయలుదేరాడు. ఏళ్ళ తరబడి అలా ఆలోచిస్తూనే ఉన్నాడు. అలా ఆలోచించి, ఆలోచించి చివరకు అదే అతని మనస్సులో నిలిచిపోయింది. ఒక రోజు తెలియని ఆనందమేదో అతని హృదయంలో పెల్లుబికింది. తను మార్పాను ప్రశ్నించినట్టు, తనకు సమాధానం లభించినట్టు అనిపించింది. సరిగ్గా అదే సమయంలో మార్పా వచ్చి ఆ ఇంటి తలుపు తట్టాడు. ఆ వ్యక్తి తలుపు తీశాడు.

> సద్గురువులు, జ్ఞానులు, అవతార పురుషులు... భాషాతీతమైన, భావాతీతమైన శక్తిని (శక్తిపాతం ద్వారా) ప్రసరింపజేసి, ఎదుటివారిలో జ్ఞానాన్ని ప్రజ్వలింపజేస్తారు. వారిని దివ్యమూర్తులుగా తీర్చిదిద్దుతారు. కళాశాల విద్యార్థి అయిన నరేంద్రుణ్ణి కేవలం ఒక స్పర్శతో.... ప్రపంచ ప్రఖ్యాతుడైన వివేకానందస్వామిగా శ్రీరామకృష్ణ పరమహంస ప్రకాశింపజేశారు.



అతని ఎదురుగా నవ్వుతూ నిలబడిన మార్పా... "మాటలు వాడకుండా మీరు ప్రశ్నించారు. నేనూ మీకు అదే విధంగా బదులు ఇచ్చాను" అన్నాడు.

ఇద్దరూ నవ్వుకుంటూ బయటకు నడిచారు. ఆ రోజు నుంచి ఆ వ్యక్తి ఏదీ మాట్లాడకుండా... కేవలం నవ్వుతూ మార్పా వెంట అతని నీడలా ఊరూరా తిరిగేవాడు. అతణ్ణి చూసినవారు మార్పాతో "గురువుగారూ! అతను మాట్లాడకుండా ఎప్పుడూ నవ్వుతూ ఎందుకు ఉంటాడు? మీరు అతణ్ణి ఏం చేశారు?" అని అడిగాడు. "అతను ఒక విషయం గురించి ఏమీ మాట్లాడకుండా ప్రశ్నించాడు. నేనూ ఏమీ మాట్లాడకుండానే అతనికి సమాధానం ఇచ్చాను. అంతే!" అన్నాడు మార్పా. జ్ఞానం పొందడానికి మాటలు అక్కరలేదు. మౌనమే జ్ఞానం.

పండితులు తమ పాండిత్యాన్ని ప్రదర్శించి ప్రజల నుంచి సన్మానాలను, ప్రశంసలను పొందుతారు. సద్గురువులు, జ్ఞానులు, అవతార పురుషులు... భాషాతీతమైన, భావాతీతమైన శక్తిని (శక్తిపాతం ద్వారా) ప్రసరింపజేసి, ఎదుటివారిలో జ్ఞానాన్ని ప్రజ్వలింపజేస్తారు. వారిని దివ్యమూర్తులుగా తీర్చిదిద్దుతారు. కళాశాల విద్యార్థి అయిన నరేంద్రుణ్ణి కేవలం ఒక స్పర్శతో.... ప్రపంచ ప్రఖ్యాతుడైన వివేకానందస్వామిగా శ్రీరామకృష్ణ పరమహంస ప్రకాశింపజేశారు. బడికి వెళ్ళే ఒక బాలుణ్ణి... ఒక ముద్దుతో మెహర్‌బాబాగా, లక్షలాదిమందికి ఆరాధ్యదైవంగా బాబాజాన్ నిలబెట్టింది. మార్పా చేసింది కూడా అలాంటిదే. అందుకే ఆ వ్యక్తిలో నిరంతరం ఆనందం తొణికిసలాడింది. ఆ ఆనందంతో అతని జీవితం నిండిపోయింది.

• రాచమడుగు శ్రీనివాసులు


ప్రభువు పాదాలపై శతాధిపతి

ఏసు ప్రభువు ఒక ఊరిలో ప్రజలకు బోధ చేస్తున్నాడు. ఆయనను కనులారా చూసేందుకు జన సందోహం ఆ ప్రదేశానికి పెద్ద సంఖ్యలో చేరుకుంది. ఆయన చెబుతున్న మాటలను అందరూ ఆసక్తిగా వింటున్నారు. కాసేపటికి ఒక శతాధిపతి అక్కడికి వచ్చాడు. రోమన్ సామ్రాజ్యంలో సైనికాధికారులకు అపరిమితమైన అధికారాలు ఉండేవి. ఆ సామ్రాజ్యానికి, దాని అధినేతకు రక్షణ అందించే బాధ్యతలను ఆ శతాధిపతి నిర్వహిస్తున్నాడు. 'ఇతను ఇక్కడికెందుకు వచ్చాడు?' అని జనం గుసగుసలాడుకుంటున్నారు, భయపడుతున్నారు కూడా. కానీ ఆ శతాధిపతి నేరుగా ఏసు క్రీస్తు కాళ్ళముందు శిరసు వంచి మోకరిల్లడంతో వారు విస్మయం చెందారు. 'ఇతను అహాన్ని విడిచి ఇలా చేస్తున్నాడంటే... ఈ వినయ విధేయతల వెనుక ఏదో కారణం ఉండే ఉంటుంది. క్రీస్తుతో ఏ పని ఉండి వచ్చాడో?' అనుకున్నారు.

ఇంతలో ఆ శతాధిపతి "ప్రభూ! నా కుమారుడు చావు బతుకుల్లో ఉన్నాడు. అతణ్ణి బతికించు. నీ దర్శన భాగ్యానికి నా ఇల్లు నోచుకోలేదేమో. నీవు అక్కడికి రానక్కరలేదు. ఒక మాట పలికితే చాలు... నా కుమారుడు స్వస్థత పొందుతాడు" అని వేడుకున్నాడు.

అప్పుడు ఏసు "నీ విశ్వాసమే నిన్ను కాపాడుగాక. నీ కుమారుడు బతికే ఉన్నాడు, వెళ్ళు" అన్నాడు.

దైవమార్గం



> శతాధిపతి అన్న ఆ మాట చిన్నది కాదు. చాలా ముఖ్యమైన మాట. విశ్వాసానికి పరాకాష్ట అయిన మాట. అందుకే రోమన్ క్యాథలిక్‌లు తమ దైనందిన ఆరాధనలో ఈ వాక్యాన్ని కూడా పఠిస్తారు.

ఆ రోమన్ సైన్య శతాధిపతి కళ్ళు చెమర్చాయి. అంతకుపూర్వమే క్రీస్తు చేస్తున్న అద్భుతాలను అతను విన్నాడు. ఆయన కృపతో తన కుమారుడికి నయం కాగలదనే నమ్మకంతో క్రీస్తు దగ్గరకు వచ్చాడు. క్రీస్తు మాటలు వినగానే... ప్రభువు తనను అనుగ్రహించాడని, ఆయన వాక్కు వ్యర్థం కాదని నమ్మి, వెనుతిరిగాడు.

అతను ఊహించినదే జరిగింది. ప్రభువు వాక్కు ఫలించింది. అతని ఇంటి నుంచి బయలుదేరిన సైనికులు మార్గమధ్యంలోనే అతణ్ణి కలిశారు. "మీ అబ్బాయి స్వస్థత పొందాడు. లేచి కూర్చున్నాడు" అంటూ శుభవార్త అందించారు. కోరుకున్న ఫలితం దక్కడంతో అతను సంతృప్తిగా వెనుతిరిగాడు.

విశ్వాసంతో ప్రార్థిస్తే దైవానుగ్రహం తప్పక లభిస్తుందనీ, దానికి తరతమ భేదాలు ఉండవనీ స్పష్టం చేసే ఉదాహరణగా ఈ కథను పేర్కొంటారు. 'నీవు పలికితే చాలు, నా కుమారుడు బతికిపోతాడు' అనే మాట చిన్నది కాదు. చాలా ముఖ్యమైన మాట. విశ్వాసానికి పరాకాష్ఠ అయిన మాట. అందుకే రోమన్ క్యాథలిక్‌లు తమ దైనందిన ఆరాధనలో ఈ వాక్యాన్ని కూడా పఠిస్తారు.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

రాజుకన్నా గొప్పవారు

"ధార్మిక విశ్వాసం కలిగిన విద్వాంసులను అనుసరించండి. ఎందుకంటే వారు ఇహ-పరలోకాలకు కాంతి లాంటివారు. భూమిపైన, సముద్రాల్లో పయనిస్తున్న వ్యక్తులు నక్షత్రాల ద్వారా మార్గాన్ని తెలుసుకుంటారు. ఒకవేళ నక్షత్రాలు మాయమైపోతే... వాటిని అనుసరించేవారు మార్గం తెలియక తప్పిపోతారు. ఆకాశంలో ఉన్న ఆ నక్షత్రాల్లాంటివారే భూమిపై ఉన్న విద్వాంసులు, పండితులు" అని అంతిమ దైవప్రవక్త మహమ్మద్ చెప్పారు.


జ్ఞానులకు, పండితులకు పూర్వం ప్రజల్లో ఎంత విలువ ఉండేదో వివరించే ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. ఖలీఫా అయిన హారూన్ రషీద్ తన సైన్యంతో వచ్చి ఒక నగరంలో బస చేశాడు. అదే సమయంలో విద్వాంసుడైన హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ముబారక్ అక్కడకు వస్తున్నారనే వార్త నగరమంతా వ్యాపించింది. ప్రజలు సంతోషించారు. నగర శివార్లలోనే బిన్ ముబారక్‌కు సాదరంగా స్వాగతం పలకడానికి తండోపతండాలుగా బయలుదేరారు. ఆయనను ప్రత్యక్షంగా చూడాలనే కోరిక వారిని అక్కడకు చేర్చింది. ఖలీఫాకు బానిసగా ఉన్న ఒక మహిళ దీన్ని గమనించింది. "ఏం జరుగుతోంది?" అని ఇక్కడ ఉన్నవారిని అడిగింది. "బిన్ ముబారక్‌గారు వస్తున్నారు. ఆయనను స్వాగతించడానికి జనం పోటీ పడుతున్నారు" అని వారు చెప్పారు. అప్పుడు ఆ బానిస స్త్రీ "ఖలీఫా హారూన్ రషీద్ కోసమైతే ప్రజలను బలవంతంగా రప్పించవలసి వచ్చేది. ఇక్కడ ఎలాంటి బలవంతమూ లేదు. కేవలం చిన్న వార్తతోనే నగరమంతా బిన్ ముబారక్ కోసం కదిలి వచ్చింది. దైవసాక్షిగా... అసలైన రాజు అంటే ఆయనే" అంది.

ఇలాంటి మరో సంఘటన... ఖాజా హసన్ బస్రీ గొప్ప జ్ఞానిగా ప్రాచుర్యం పొందాడు. ఆయన అంటే ప్రజలు ఎంతో ప్రేమాభిమానాలు చూపించేవారు. ఆ రోజుల్లో బస్రాకు గవర్నర్‌గా క్రూరుడు, కఠినాత్ముడు అయిన హజ్జాజ్ బిన్ యూసఫ్ ఉండేవాడు. పుర ప్రముఖుడు, పండితుడు అయిన ఖాలిద్ బిన్ సఫ్వాన్‌తో ఒక రోజు యూసఫ్ మాట్లాడుతూ "బస్రా నగరానికి సర్దార్ ఎవరు?" అని అడిగాడు. తన పేరును ఖాలిద్ చెబుతాడని అతను ఆశించాడు. కానీ దానికి భిన్నంగా "హసన్ బస్రీ" అని ఖాలిద్ సమాధానం ఇచ్చాడు. యూసఫ్ ఆశ్చర్యపోతూ "అదెలా సాధ్యం? హసన్ బానిస వంశానికి చెందినవాడు కదా?" అన్నాడు.

"హసన్ ప్రజల నాయకుడు. ధర్మం విషయంలో ప్రజలకు ఆయన అవసరం ఉంది కానీ... ప్రాపంచిక విషయాల్లో ఆయనకు ఎవరి అవసరమూ లేదు. సామాన్యులు కావచ్చు, ధనవంతులు కావచ్చు... హసన్ ప్రసంగాలు వినడానికి, తద్వారా జ్ఞానం పొందడానికి అందరూ తహతహలాడుతారు. ఆయనతో సన్నిహితంగా ఉండాలనుకుంటారు" అని చెప్పాడు ఖాలిద్. అసలైన నాయకుడంటే ఎవరో, ప్రజలు ఎటువంటివారిని గౌరవిస్తారో బిన్ యూసఫ్‌కు అర్థమయింది. అందుకే 'విద్వాన్ సర్వత్ర పూజ్యతే' అన్నారు పెద్దలు.

• మహమ్మద్ వహీదుద్దీన్

సందేశం



గీతాసారం


ధ్యానం... పరమానందం కోసం

మన మెదడులోని కేంద్ర స్థానంలో... సరిగ్గా రెండు కనుబొమల మధ్య పీనియల్ గ్రంథి ఉంటుంది. శంకువు ఆకారంలో, బఠానీ గింజ పరిమాణంలో ఉండే ఈ గ్రంథి... మన శరీరంలో మెలటోనిన్, సెరటోనిన్ అనే నాడీ ప్రసారకాలను (న్యూరోట్రాన్స్మిటర్స్) ఉత్పత్తి చేసి.. మన నిద్రకు, భావోద్వేగాలకు కారణం అవుతుంది. దీనిలో మామూలు కంటిలో ఉన్నట్టే కాంతి గ్రాహకాలు (ఫొటో రిసెప్టర్స్) ఉంటాయి కనుక దీన్ని 'మూడో కన్ను' అని కూడా అంటారు. ఆత్మకు పీఠంగా, ఆధ్యాత్మిక సాక్షాత్కార కారకంగా, పంచేంద్రియాలకు అందని భావనను అందుకోగలిగే ఆరో ఇంద్రియంగా, ఆధ్యాత్మిక సంకేతంగా, భౌతిక-ఆధ్యాత్మిక జగతి మధ్య సంధానంగా... ఇలా అనేక విధాలుగా వివిధ సంస్కృతులు దీన్ని వర్ణించాయి. భారతీయ యోగ పరిభాషలో కనుబొమల మధ్య ఉండే ప్రదేశాన్ని 'ఆజ్ఞాచక్రం' అంటారు. ఇది పీనియల్ గ్రంథి ఉండే స్థానాన్ని సూచిస్తుంది.

ఇంద్రియాలను, మనస్సును అదుపులో పెట్టుకోవడానికి శ్రీకృష్ణుడు సూచించిన విధానాన్ని అర్థం చేసుకోవడానికి పై వివరణ మనకు ఉపకరిస్తుంది. "బాహ్య విషయ భోగాల గురించిన ఆలోచనలను పారద్రోలాలి. దృష్టిని భ్రూమధ్యమునందు (కనుబొమల మధ్యభాగంలో) స్థిరంగా ఉంచాలి. మనలో ప్రసరిస్తున్న ప్రాణాపాన వాయువులను సమస్థితిలో నడిపించాలి. ఈ ప్రక్రియల ప్రభావం వల్ల మనసు, బుద్ధి, ఇంద్రియాలు సాధకుడి వశంలోకి వస్తాయి. మోక్షపరాయణుడైన ముని ఇటువంటి సాధన ద్వారా ఇచ్ఛా భయ క్రోధరహితుడై సదా ముక్తుడవుతాడు" అని శ్రీకృష్ణుడు ఒక ధ్యాన మార్గాన్ని సూచించాడు. తద్వారా అర్జునుడు తన ఇంద్రియాలను, మనస్సును, బుద్ధిని నియంత్రించుకోవడానికి సాయపడే ఒక పద్ధతిని శ్రీకృష్ణ భగవానుడు అందించాడు.



'విజ్ఞాన భైరవ తంత్రం'లో పరమశివుడు చెప్పిన 112 ధ్యాన సూత్రాలు ఉన్నాయి. "ఎటువంటి ఆలోచనలు లేకుండా మీ కనుబొమల మధ్య ఉన్న బిందువుపై దృష్టి కేంద్రీకరించండి. దివ్యమైన శక్తి ప్రజ్వలితమై... మీ తలలోని అగ్రభాగం వరకూ వ్యాపిస్తుంది. అది తక్షణమే మిమ్మల్ని పరమానందంలో ముంచెత్తుతుంది" అని వాటిలోని ఒక సూత్రం చెబుతుంది. దీని ప్రకారం... ఏకాగ్రమైన దృష్టిని కనుబొమల మధ్య ప్రాంతానికి తీసుకువచ్చి... పీనియల్ గ్రంథిని సక్రియం చేయడం సాధన చేయాలి. అప్పుడు క్రియాశీలమైన ఆ గ్రంథి ఎటువంటి ఇంద్రియాల సహాయం లేకుండానే మనలో అంతర్గత పారవశ్యాన్ని నింపుతుంది.



కె.శివప్రసాద్









బాహుబలి మళ్లీ వస్తున్నాడు



భారతీయ సినీ చరిత్రలో 'బాహుబలి'కి ఎంతటి ప్రత్యేక స్థానం ఉందో చెప్పక్కర్లేదు. టాలీవుడ్ స్థాయిని ప్రపంచానికి చాటి చెప్పిన ఈ సినిమా మొదటి భాగం విడుదలై 10 ఏళ్లు అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి అభిమానులకు తీపికబురందించాడు. 'బాహుబలి: ద బిగినింగ్', 'బాహుబలి: ద కన్‌క్లూజన్'.. రెండు భాగాలను కలిపి 'బాహుబలి: ద ఎపిక్'గా అక్టోబర్ 31న రీ రిలీజ్ చేయనున్నట్లు ఎక్స్ వేదికగా ప్రకటించారు. "బాహుబలి.. ఎన్నో అద్భుతమైన ప్రయాణాలకు ఆరంభం. లెక్కలేనన్ని జ్ఞాపకాలను ఇచ్చింది. ఎంతోమందికి స్ఫూర్తిని పంచింది. ఈ సినిమా రెండు భాగాలను కలిపి 'బాహుబలి ద ఎపిక్' పేరిట మరోసారి మీ ముందుకు తీసుకువస్తున్నాం" అని పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న సినీ ప్రియుల ఆనందం రెట్టింపైంది. చిత్రం విడుదలై పదేళ్లు అయిన సందర్భంగా బుధవారం రాత్రి 'బాహుబలి' టీమ్ రీ యూనియన్ మీట్ హైదరాబాద్‌లో జరిగింది. ఇందులో రాజమౌళి, ప్రభాస్, రానా, రమ్యకృష్ణతో సహా టోటల్ టీమ్ పాల్గొన్నారు. రమ్యకృష్ణ సినిమాలోని తన డైలాగు 'ఇది నా మాట. నా మాటే శాసనం' అనే ప్లకార్డు పట్టుకుని ఫోజివ్వడం ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. కాగా, 2015లో ఈ సినిమా ప్రచారంలో భాగంగా రాజమౌళి వాడిన 'బాహుబలి వస్తున్నాడు' అనే హ్యాష్ ట్యాగ్ ఇప్పుడు వైరల్ అవుతోంది.

మరో విలక్షణమైన కథాంశంతో..



'కుబేర' విజయాన్ని ఆస్వాదిస్తున్న ధనుష్.. అదే జోష్‌లో తన తదుపరి చిత్రాన్ని అనౌన్స్ చేశారు. ఇది ధనుష్‌కు 54వ చిత్రం. విఘ్నేష్ రాజా దర్శకత్వం వహిస్తున్నారు. వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, థింక్ స్టూడియోస్ సంస్థలు నిర్మిస్తున్నాయి. గురువారం పూజా కార్యక్రమాలతో ఈ సినిమా ప్రారంభమైంది. ఈ సందర్భంగా చిత్రబృందం అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని విడుదల చేసింది. విలక్షణమైన కథాంశంతో ఈ సినిమా తెరకెక్కను న్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ చిత్రంలో ధనుష్ సరసన కథానాయికగా మమిత బైజు నటిస్తున్నారు. జి.వి.ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

కార్తీ 'మార్షల్'



తమిళ హీరో కార్తీ, కల్యాణి ప్రియదర్శన్ జంటగా కొత్త చిత్రం ప్రారంభమైంది. ఈ చిత్రానికి తమిళ దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్ఆర్ ప్రకాశ్ బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్నారు. 'మార్షల్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. గురువారం పూజా కార్యక్రమాలతో పాటు రెగ్యులర్ షూటింగ్‌ని చిత్రబృందం ప్రారంభించింది. సత్యన్ సూర్యన్ కెమెరామెన్‌గా వ్యవహరిస్తున్నారు. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. సత్యరాజ్, ప్రభు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

రూమర్స్‌కు ఫొటోతో సమాధానం



హీరోయిన్ నయనతార, దర్శకుడు విఘ్నేష్ శివన్ దంపతులు విడిపోతున్నారంటూ వస్తున్న వదంతులను ఆ జంట కొట్టిపారేసింది. దీనిపై నయనతార గురువారం ఎక్స్ వేదికగా స్పందించారు. భర్తతో కలసి ఉన్న ఫొటోను షేర్ చేసిన నయనతార... 'మాపై వచ్చే సిల్లీ న్యూస్‌కు మా రియాక్షన్ ఇదే' అంటూ సోషల్ మీడియాలో సాగుతున్న ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టారు. కాగా, కొన్ని రోజుల క్రితం నయనతార పెట్టిన పోస్టే వారి విడాకులపై ప్రచారం సాగడానికి ప్రధాన కారణంగా నిలిచింది. 'తెలివి తక్కువ వ్యక్తిని పెళ్లి చేసుకోవడం పొరపాటు. నీ భర్త తప్పులకు నువ్వు బాధ్యత వహించాల్సిన అవసరం లేదు' అంటూ నయనతార పెట్టిన పోస్ట్ వైరల్ అయింది. దీంతో ఆమె కొన్ని గంటల్లోనే డిలీట్ చేసింది. అయితే, ఆ పోస్ట్ స్క్రీన్‌షాట్లు మాత్రం సోషల్ మీడియాలో వైరల్ అవడంతో ఆమె స్పందించారు.

-చెన్నై(ఆంధ్రజ్యోతి)

భక్తిభావన ఉప్పొంగేలా



పురాణాల్లోని దశావతారాల స్ఫూర్తితో హోంబలే ఫిల్మ్స్ సంస్థ పది త్రీడీ యానిమేషన్ చిత్రాలను నిర్మిస్తున్నట్లు ప్రకటించింది. ఈ వరుసలో వస్తున్న తొలి చిత్రం 'మహావతార్ నరసింహ'. అశ్విన్ కుమార్ దర్శకత్వంలో శిల్పా ధావన్ నిర్మిస్తున్నారు. ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. హిరణ్యకశిప, ప్రహ్లాద, నరసింహ స్వామి పాత్రలను పరిచయం చేస్తూ ట్రైలర్ సాగింది. ఈ సందర్భంగా శిల్పా ధావన్ మాట్లాడుతూ 'నరసింహ స్వామి గర్జన ప్రతి హృదయంలో భక్తి భావన ఉప్పొంగేలా చేస్తుంది' అని అన్నారు. అశ్విన్ కుమార్ మాట్లాడుతూ 'ఈ చిత్రం దృశ్యకావ్యంలా ఉంటుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది' అని చెప్పారు.

కొత్తపల్లిలో వినోదం

గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న హాస్య చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి ప్రవీణ పరుచూరి దర్శకత్వం వహిస్తూ, గోపాలకృష్ణ పరుచూరితో కలసి నిర్మిస్తున్నారు. రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. మనోజ్ చంద్ర, మౌనిక టి, బెనర్జీ ప్రధాన తారాగణం. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్రబృందం గురువారం ట్రైలర్‌ను విడుదల చేసింది. స్నేహం, వినోదం ప్రధానాంశాలుగా కుటుంబ నేపథ్యంలో రూపుదిద్దుకున్న చిత్రమిదని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. పల్లెటూరి నేపథ్యంలో వస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రమిదని మేకర్స్ తెలిపారు.



చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ఈ చదువులకేమైంది?

-ఆర్. నారాయణమూర్తి



సమకాలీన సామాజక సమస్యలను ఇతివృత్తాలుగా తీసుకుని ఆలోచింపజేసే చిత్రాలను తీసే నటుడు, నిర్మాత, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి. ఆయన తాజా చిత్రం 'యూనివర్సిటీ'. 'పేపర్ లీక్' అనేది ట్యాగ్‌లైన్. స్నేహచిత్ర పతాకంపై స్వీయ దర్శకత్వంలో నారాయణమూర్తి నటించి, నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ 'కొన్నాళ్లుగా మన విద్యారంగంలో జరుగుతున్న పేపర్ లీకులు, గ్రూప్ - 1, 2 పరీక్షల ప్రశ్నాపత్రాల లీకులు చూస్తుంటే ఈ చదువులకేమైంది అనిపిస్తోంది. ఇలా జరుగుతుంటే విద్యార్థుల భవిష్యత్ ఏం కావాలి? నిరుద్యోగుల జీవితాలు ఏమైపోవాలి? లంచకోణాలు నేర్పిన వాళ్లే ఇలా కుంభకోణాలు చేస్తూ ఉంటే రెక్కలు తెగిన జ్ఞాన పావురాలు విలవిలా కొట్టుకుని నేలకు రాలుతున్నాయి. అందుకే విద్యను ప్రైవేట్ మాఫియా కంబంధ హస్తాల నుంచి విముక్తి చేయాలి. విద్యను జాతీయం చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి.. ఈ అంశాలనే మా సినిమాలో బలంగా చెప్పాం' అన్నారు. 'యూనివర్సిటీ' చిత్రంలో వై.ఎస్. కృష్ణేశ్వర రావు, తిరుపతి నాయుడు, విజయకుమార్ సహా నూతన తారాగణం నటించారు.

నిర్మాతగా కిరణ్ అబ్బవరం



సుమైరా స్టూడియోస్‌తో కలసి హీరో కిరణ్ అబ్బవరం తన కేఏ ప్రొడక్షన్స్‌పై నిర్మిస్తున్న చిత్రం 'తిమ్మరాజుపల్లి టీవీ'. తేజేశ్వర్‌రెడ్డి వేల్పుచర్ల సహనిర్మాత. సాయితేజ్, వేదశ్రీ జంటగా నటిస్తున్నారు. వి. మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. చిత్రబృందం గురువారం టైటిల్‌ను ప్రకటించి, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. గ్రామీణ నేపథ్యంలో సాగే పీరియాడిక్ డ్రామాగా ఈ సినిమా రూపొందుతోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందని యూనిట్ తెలిపింది.

నాని సినిమాలో 'కిల్' విలన్




నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'ది ప్యారడైజ్' చిత్రంలో రాఘవ్ జుయల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. 'కిల్', 'గ్యారా గ్యారా' చిత్రాల్లో అద్భుతమైన నటనను ప్రదర్శించిన రాఘవ తెలుగులో నానితో కలసి స్క్రీన్‌ను షేర్ చేసుకుంటున్నారు. గురువారం రాఘవ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఓ క్రేజీ వీడియోతో ఈ విషయాన్ని అనౌన్స్ చేసింది. రాఘవను ఓ కొత్త లుక్‌లో, కొత్త పాత్రలో పరిచయం చేస్తూ ప్యారడైజ్ ప్రపంచంలోకి ఆహ్వానించింది. ఈ సినిమాను ఎస్ఎల్‌వీ సినిమాస్ బేనర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది భాషల్లో విడుదల కానుంది.

గ్రామీణ ప్రేమకథ



యదార్థ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకున్న వైవిధ్య గ్రామీణ ప్రేమకథా చిత్రం 'ఉసురే'. నవీన్ డి. గోపాల్ దర్శకత్వంలో మౌళి ఎం. రాధాకృష్ణ నిర్మించారు. టీజయ్ అరుణాచలం, జననీ కునశీలన్ జంటగా నటించారు. నటి రాశీ కీలకపాత్ర పోషించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఆగస్టు 1న 'ఉసురే' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'ఇదొక వైవిధ్యమైన ప్రేమకథ' అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'నిజ జీవిత సంఘటనల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం' అని చెప్పారు.



పగలు డైట్ ఫుడ్.. రాత్రిళ్లు డ్రగ్స్

● యాక్టర్ల తీరును తప్పుబట్టిన పహ్లాజ్ నిహలానీ

బాలీవుడ్ నిర్మాత, సెన్సార్ బోర్డ్ మాజీ ఛైర్మన్ పహ్లాజ్ నిహలానీ ఇండస్ట్రీలోని పరిస్థితులపై, యాక్టర్ల జీవనశైలిపై సంచలన కామెంట్స్ చేశారు. ఇటీవలె ఓ పాడ్‌కాస్ట్‌లో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. "ఒకప్పుడు యాక్టర్లు కాస్టింగ్ విషయంలో తలదూర్చేవారు కారు. అది దర్శక నిర్మాతల చేతుల్లోనే ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. నటులే డైరెక్టర్లను ఎంపిక చేసుకోవడంతో పాటు కాస్టింగ్‌ను నిర్ణయిస్తున్నారు. దీంతో నిర్మాతల పరిస్థితి కొరియర్ సర్వీస్‌లా మారింది. నేను 2003లో 'తలాష్: ద హంట్ బిగిన్స్' సినిమా నిర్మించేటప్పుడు అక్షయ్‌కుమార్ 'సినిమాను రేపే ప్రారంభించొచ్చు. నాకు పారితోషికంగా మీకు నచ్చినంత ఇవ్వండి. కానీ నాదొక్కటే షరతు. ఈ సినిమాలో హీరోయిన్‌గా కరీనా కపూర్ ఉండాలి' అని చెప్పారు. నా కెరీర్‌లో ఒక నటుడు నాతో అలా ప్రవర్తించడం అదే తొలిసారి. వయసు పెరిగిన స్టార్ హీరోలు కొత్త హీరోయిన్లతో నటించాలనే ఆసక్తి చూపించడానికి కారణం. వారి వయస్సు తక్కువగా కనిపించాలనే. సినిమా నిర్మాణంలో కూడా ఇప్పుడు అనవసర ఖర్చులు ఎక్కువయ్యాయి. ఒకప్పుడు హీరో, హీరోయిన్లలతో పాటు పర్సనల్ మేకప్ మ్యాన్ మాత్రమే ఉండేవాడు. ఇప్పుడేమో అదనంగా హెయిర్ డ్రెస్సర్, అద్దం పట్టుకోవడానికి వ్యక్తులు ఉంటున్నారు. అప్పట్లో తారలు ఇంటినుంచి ఆహారం తెచ్చుకునేవారు. ఇప్పటి వారికి పగలేమో ప్రత్యేక డైట్ ఫుడ్ కావాలి. రాత్రయితే డ్రగ్స్ కావాలి" అని అన్నారు.


శ్రీచరణి (2/30)

'బాగుంది రా మామా..'

లార్డ్స్‌లో నితీశ్ ప్రతిభకు గిల్ ఫిదా
తెలుగులో అభినందన

లార్డ్స్ టెస్టులో తెలుగు పదాలు వీనులవిందు చేశాయి. 'బాగుంది రా మామా.. 'అన్న మాటలు ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో తెలుగు ఆల్‌రౌండర్ నితీశ్‌కుమార్ రెడ్డి అద్భుత బౌలింగ్‌కు ఫిదా అయిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అతడిని తెలుగులో ప్రశంసించడం అందరినీ ఆకట్టుకుంది. తొలి సెషన్‌లోనే ప్రధాన పేసర్లను సమర్థంగా ఎదుర్కొంటూ క్రీజులో పాతుకుపోయిన ఓపెనర్లు బెన్ డకెట్, జాక్ క్రాలేలను నితీశ్ ఒకే ఓవర్‌లో అవుట్ చేసి ఇంగ్లండ్‌కు షాకిచ్చాడు. దీంతో నితీశ్ బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు ఇంగ్లండ్ బ్యాటర్లు ఇబ్బందిపడ్డారు. ఈ క్రమంలో నితీశ్ వేసిన బంతి అద్భుతంగా స్వింగ్ అయినప్పుడు స్లిప్స్‌లో ఉన్న సారథి గిల్.. 'వాట్ రా రెడ్డి.. బాగుంది రా మామా' అని తెలుగులో పొగడడం స్టంప్ మైక్‌లో రికార్డయింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. అయితే అది గిల్ గొంతు కాదని, బహుశా కరుణ్ నాయర్‌ది అయివుండవచ్చునని అంటున్నారు. నాయర్ తెలుగు బాగా మాట్లాడుతాడని కొందరు చెబుతున్నారు.


నితీశ్ (2/46)

బజ్‌బాల్‌ను పక్కనబెట్టి..


99 రన్స్‌తో నిలిచిన జో రూట్

ఆచితూచి ఆడిన ఇంగ్లండ్
తొలి ఇన్నింగ్స్ 251/4

- రాణించిన పోప్, స్టోక్స్
- నితీశ్‌కు రెండు వికెట్లు
- భారత్‌తో మూడో టెస్టు

లండన్: బజ్‌బాల్ గేమ్‌తో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడే ఇంగ్లండ్ లార్డ్స్ టెస్టులో మాత్రం నెమ్మదించింది. అటు భారత బౌలర్లు విశేషంగా రాణించినప్పటికీ.. నాలుగు వికెట్లతోనే సరిపెట్టుకున్నారు. ఫలితంగా మూడో టెస్టు తొలి రోజు ఆటలో ఇంగ్లండ్‌దే ఒకింత పైచేయి అయింది. బ్యాటింగ్‌కు కష్టంగా మారిన పిచ్‌పై జో రూట్ (99 బ్యాటింగ్) పట్టుదలగా ఆడాడు. అతడి సెంచరీకి ఒక్క పరుగు దూరంలో ఆట ముగియగా, పోప్ (44), కెప్టెన్ స్టోక్స్ (39 బ్యాటింగ్) సహకరించారు. దీంతో గురువారం ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో 251/4 స్కోరుతో నిలిచింది. నితీశ్‌కు రెండు.. బుమ్రా, జడేజాలకు ఒక్కో వికెట్ దక్కింది.

నితీశ్ 'డబుల్': టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌ను నిలడగా ఆరంభించింది. కొత్త బంతితో భారత పేసర్లు స్వింగ్‌తో పాటు ఎక్స్‌ట్రా బౌన్స్‌తో ఇబ్బందిపెట్టినప్పటికీ ఓపెనర్లు డకెట్ (23), క్రాలే (18) ఓపిగ్గా ఆడారు. దీంతో తొలి గంటలో వీరు 13 ఓవర్లలో 39 పరుగులు జత చేశారు. అయితే డ్రింక్స్ విరామం తర్వాత కెప్టెన్ గిల్ బంతిని నితీశ్‌కు ఇవ్వడం ఫలితాన్నిచ్చింది. తన తొలి ఓవర్‌లోనే డకెట్‌ను అవుట్ చేశాడు. పుల్ షాట్ ఆడే ప్రయత్నంలో కీపర్ పంత్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో తొలి వికెట్‌కు 43 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత బంతికే పోప్ కూడా డకౌట్ అయ్యేవాడే కానీ.. గల్లీలో క్లిష్టమైన క్యాచ్‌ను గిల్ వదిలేశాడు. అయితే అదే ఓవర్ ఆఖరి బంతికి క్రాలే సైతం పంత్‌కు క్యాచ్ ఇవ్వడంతో నాలుగు బంతుల వ్యవధిలోనే రెండు వికెట్లు తీసిన నితీశ్ భారత్‌కు ఊరటనిచ్చాడు. కానీ 44/2 స్కోరుతో ఇబ్బందిపడిన జట్టును రూట్-పోప్ జోడీ ఆదుకుంది. బౌలర్లకు ఎలాంటి చాన్స్ ఇవ్వకుండా వీరు లంచ్ బ్రేక్‌కు వెళ్లారు. ఈ సెషన్‌లో ఇంగ్లండ్ 83 పరుగులు సాధించింది.

శతక భాగస్వామ్యం: రెండో సెషన్‌లో భారత బౌలర్లు ఎంతగా ప్రయత్నించినా వికెట్ సాధించలేకపోయారు. బజ్‌బాల్ గేమ్‌ను పక్కనబెట్టి రూట్-పోప్ జోడీ అసలు సిసలు టెస్టు ఆటను ప్రదర్శించింది. చక్కటి లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులు వేసిన పేసర్ల ధాటికి ఓ దశలో 28 బంతులపాటు ఇంగ్లండ్ ఒక్క పరుగు కూడా సాధించలేదు. అవుట్‌సైడ్‌కు ఆవల వేసే బంతులను తెలివిగా వదిలేస్తూ ఆడారు. అటు నితీశ్ ఓవర్‌లో ఫోర్‌తో రూట్ అర్ధసెంచరీని సైతం పూర్తి చేశాడు. ఓవరాల్‌గా ఈ సెషన్‌లో ఇంగ్లండ్ 24 ఓవర్లలో 70 పరుగులు రాబట్టింది. అయితే భారత బౌలర్లను విసిగిస్తున్న ఇంగ్లండ్ జోడీకి స్పిన్నర్ జడేజా చెక్ పెట్టాడు. ఆఖరి సెషన్ ఆరంభమైన తొలి బంతికే సబ్‌స్టిట్యూట్ కీపర్ జురెల్‌కు పోప్ క్యాచ్ ఇచ్చాడు. దీంతో మూడో వికెట్‌కు 109 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత బ్రూక్ (11)ను బుమ్రా బౌల్డ్ చేసినా.. స్టోక్స్‌తో కలిసి రూట్ జట్టును ఆదుకున్నాడు. ఐదో వికెట్‌కు అజేయంగా 79 పరుగులు జోడించాక ఈ జోడీ తొలి రోజును ముగించింది.

1
భారత్‌పై టెస్టుల్లో 3 వేల పరుగులు సాధించిన ఏకైక బ్యాటర్‌గా జో రూట్.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) పంత్ (బి) నితీశ్ 18; డకెట్ (సి) పంత్ (బి) నితీశ్ 23; పోప్ (సి సబ్) జురెల్ (బి) జడేజా 44; రూట్ (బ్యాటింగ్) 99; బ్రూక్ (బి) బుమ్రా 11; స్టోక్స్ (బ్యాటింగ్) 39; **ఎక్స్‌ట్రాలు: 17; మొత్తం: 83 ఓవర్లలో 251/4. వికెట్ల పతనం:** 1-43, 2-44, 3-153, 4-172. **బౌలింగ్:** బుమ్రా 18-3-35-1; ఆకాశ్ 17-2-75-0; సిరాజ్ 14-5-33-0; నితీశ్ 14-0-46-2; జడేజా 10-1-26-1; సుందర్ 10-1-21-0.



పంత్‌కు గాయం

రెండో సెషన్‌లో వికెట్ కీపర్ రిషభ్ పంత్ చేతి వేలికి గాయమైంది. 34వ ఓవర్‌లో బుమ్రా వేసిన బంతిని అతడు ఎడమ వైపునకు డైవ్ చేస్తూ ఆపేందుకు ప్రయత్నించాడు. అయితే ఈ క్రమంలో పంత్ ఎడమ చేతి చూపుడు వేలికి బంతి బలంగా తాకింది. నొప్పితో విలవిల్లాడిన అతనికి ఫిజియో వచ్చి చికిత్స చేశాడు. అయినా పంత్‌కు నొప్పి తగ్గకపోవడంతో ఆ ఓవర్ ముగిశాక మైదానం వీడగా.. జురెల్ కీపింగ్ చేశాడు. ప్రస్తుతం పంత్ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నట్టు బీసీసీఐ తెలిపింది.



ఎంసీసీ మ్యూజియంలో సచిన్ చిత్రపటం

సచిన్ టెండూల్కర్‌కు అరుదైన గౌరవం దక్కింది. లార్డ్స్ మైదానంలోని మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) మ్యూజియంలో గురువారం అతడి చిత్రపటాన్ని ఆవిష్కరించారు. సచిన్ 18 ఏళ్ల క్రితం నాటి ఫొటోగ్రాఫ్‌ను స్టువర్ట్ పియర్సన్ అనే చిత్రకారుడు చిత్రించాడు. ఈ చిత్రాన్ని ఏడాది చివరి వరకు ఎంసీసీ మ్యూజియంలోనే ఉంచి, ఆ తర్వాత లార్డ్స్ పెవిలియన్‌కు మార్చనున్నారు. భారత్ నుంచి మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ, కపిల్ దేవ్, బిషన్ సింగ్, వెంగ్‌సర్కార్ చిత్రాలు కూడా ఎంసీసీ మ్యూజియంలో ఉన్నాయి. మరోవైపు లార్డ్స్‌లో జరుగుతున్న తాజా టెస్టును సచిన్ గంట మోగించి ఆరంభించాడు.

చరిత్ర సృష్టించిన భారత్

- నాలుగో టీ20లో హర్మన్ సేన గెలుపు
- ఇంగ్లండ్‌పై తొలి టీ20 సిరీస్ విజయం

మాంచెస్టర్: భారత మహిళల జట్టు చరిత్ర సృష్టించింది. తొలిసారి ఇంగ్లండ్‌పై టీ20 సిరీస్ విజయాన్ని నమోదు చేసింది. బుధవారం రాత్రి జరిగిన నాలుగో మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. ఐదు టీ20ల సిరీస్‌ను 3-1తో మరో మ్యాచ్ మిగిలుండగానే సొంతం చేసుకొంది. స్పిన్నర్లు రాధా యాదవ్ (2/15), తెలుగమ్మాయి శ్రీచరణి (2/30), దీప్తి శర్మ (1/29) తిప్పేయడంతో.. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 126/7 స్కోరుకే పరిమితమైంది. భారత ఫీల్డింగ్ కూడా మెరుగ్గా ఉండడంతో ఇంగ్లండ్ పరుగుల కోసం తీవ్రంగా శ్రమించింది. డంక్లే (22), బ్యూమాంట్ (20) టాప్ స్కోరర్లు. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని భారత్ 17 ఓవర్లలో 4 వికెట్లకు 127 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (32), స్మృతి మంధాన (31) తొలి వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యంతో అదిరే ఆరంభాన్నిచ్చారు. ఆ తర్వాత జెమీమా (24 నాటౌట్), హర్మన్‌ప్రీత్ (26) ఆచితూచి ఆడుతూ జట్టును గెలుపు తీరాలకు చేర్చారు.

భారత్ 'ఎ' జట్టులో తెలుగమ్మాయి షబ్నం షకీల్



ఆసీస్ 'ఎ'తో పరిమిత ఓవర్ల సిరీస్

న్యూఢిల్లీ: ఆంధ్ర యువ క్రికెటర్ షబ్నం షకీల్ భారత్ 'ఎ' జట్టుకు ఎంపికైంది. వచ్చే నెల 7 నుంచి 24 వరకు ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో మూడు టీ20, మూడు వన్డేల సిరీస్‌లతో పాటు భారత్ నాలుగు రోజుల మ్యాచ్ ఆడనుంది. దీని కోసం సెలెక్టర్లు రెండు జట్లను ప్రకటించారు. ఇందులో 18 ఏళ్ల వైజాగ్ పేసర్ షబ్నంకు టీ20, వన్డే జట్లలో చోటు దక్కడం విశేషం. రెండేళ్ల క్రితం అండర్-19 టీ20 వరల్డ్‌కప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టులో షబ్నం సభ్యురాలు. ఇక భారత్ 'ఎ' జట్లకు స్పిన్నర్ రాధా యాదవ్ నేతృత్వం వహిస్తుండగా, స్పిన్నర్లు శ్రేయాంక, ప్రియా మిశ్రా, షఫాలీ, టిటాస్ సాధు తదితరులు చోటు దక్కించుకున్నారు.

తొమ్మిదేళ్లలో తొలిసారి అత్యల్పంగా..

ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత్ @ 133

న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాల్ పురుషుల జట్టు తాజా ఫిఫా ర్యాంకింగ్స్‌లో ఆరు స్థానాలు కోల్పోయి 133వ ర్యాంక్‌లో నిలిచింది. భారత్ ఇంత అత్యల్ప ర్యాంక్‌కు చేరడం గత తొమ్మిదేళ్లలో ఇదే మొదటిసారి. భారత జట్టు కెరీర్‌లో అత్యుత్తమంగా 1996 ఫిబ్రవరిలో 94వ ర్యాంక్‌ను అందుకుంది. ప్రపంచ చాంపియన్ అర్జెంటీనా నెంబర్‌వన్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా.. స్పెయిన్, ఫ్రాన్స్, ఇంగ్లండ్, బ్రెజిల్ వరుసగా 2, 3, 4, 5 ర్యాంక్‌ల్లో ఉన్నాయి.

అబ్బురపర్చిన నిర్వి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఎనిమిదేళ్ల నిర్వి ప్రద్యుమ్న అత్యంత పిన్న వయసులో రెండు ప్రపంచ రికార్డులు నెలకొల్పింది. గురువారం కూకట్‌పల్లిలో నిర్వి ఈ రెండు ప్రపంచ రికార్డులకు యత్నించింది. 50కి పైగా చెస్ ఓపెనింగ్ ట్రాప్స్‌ను 50కి పైగా బోర్డులపై కేవలం 30 నిమిషాల్లోనే పూర్తి చేసి అతి తక్కువ సమయంలో పిన్న వయస్సులో ఈ ఘనత సాధించిన క్రీడాకారిణిగా నిలిచింది. తదనంతరం 195 దేశాల అధికారిక కరెన్సీను కేవలం 4 నిమిషాల 26 సెకన్లలో గుర్తించి, పేర్లు చెప్పింది. ఈ రెండు రికార్డులను లండన్‌లోని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సుకు పోటీల నిర్వాహకులు పంపించారు. మూడ్రోజుల్లో ఈ రికార్డులను అధికారికంగా వెల్లడించనున్నారు.

అమండా సంచలనం


స్వియటెక్


వింబుల్డన్
అమండా


సబలెంక

- తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ బెర్త్
- సెమీస్‌లో టాప్ సీడ్ సబలెంకకు షాక్
- తుదిపోరులో స్వియటెక్‌తో ఢీ

లండన్: వింబుల్డన్‌లో అమెరికా భామ అమండా అనిసిమోవా పెను సంచలనం సృష్టించింది. ఏకంగా టాప్ సీడ్ అర్యానా సబలెంకను ఓడించి.. కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. మరోవైపు 8వ సీడ్ ఇగా స్వియటెక్ మొదటిసారి వింబుల్డన్ తుది పోరుకు చేరుకొంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీస్‌లో 13వ సీడ్ అమండా 6-4, 4-6, 6-4తో సబలెంకకు షాకిచ్చింది. 2 గంటల 36 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో సబలెంక 6 ఏస్‌లు కొడితే.. అనిసిమోవా 2 మాత్రమే సంధించింది. అమండా 13 విన్నర్లతో సబలెంకపై ఆధిపత్యం ప్రదర్శించింది. గ్రాస్ కోర్ట్ సెమీస్‌లో ఓడడం సబలెంకకు ఇది మూడోసారి.

స్వియటెక్ జోరు: ఏకపక్షంగా సాగిన మరో సెమీస్ మ్యాచ్‌లో పోలెండ్ స్టార్ స్వియటెక్ సునాయాసంగా నెగ్గింది. స్వియటెక్ 6-2, 6-0తో బెలిండా బెన్సిక్ (స్విట్జర్లాండ్)ను వరుస సెట్లలో ఓడించింది. శనివారం జరిగే టైటిల్ ఫైట్‌లో అమండాతో అమీతుమీ తేల్చుకోనుంది. వీరిద్దరూ తొలిసారి ఫైనల్ చేరడంతో.. ఈసారి వింబుల్డన్‌కు కొత్త చాంపియన్ రావడం ఖాయమైంది.

హద్దుమీరిన ఆటగాళ్లకు ఫైన్: క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా రాకెట్లను విసిరికొట్టడం, సిబ్బందిని దూషించడం, క్రీడా పరికరాలపై అసహనాన్ని ప్రదర్శిస్తూ క్రమశిక్షణను ఉల్లంఘిస్తున్న ఆటగాళ్లపై వింబుల్డన్ నిర్వాహకులు భారీగా జరిమానాలు విధిస్తున్నారు. మొత్తంగా ఏడుగురు పురుషులు, ఎనిమిది మంది మహిళలకు కలిపి సుమారు రూ. 60 లక్షల జరిమానా విధించారు.

టీసీఎస్ లాభం రూ.12,760 కోట్లు

జూన్ త్రైమాసిక లాభంలో 6% వృద్ధి.. ఒక్కో షేరుకు రూ.11 మధ్యంతర డివిడెండ్



ఈ ఏడాది రెండంకెల ఆదాయ వృద్ధి అసాధ్యం

న్యూఢిల్లీ/ముంబై: ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) గురువారం ప్రకటించిన తొలి త్రైమాసిక (ఏప్రిల్-జూన్) ఫలితాలు మార్కెట్ అంచనాలను అందుకోలేక పోయింది. ప్రధాన మార్కెట్లలో ఎదురీతతో పాటు గత కొన్ని త్రైమాసికాలుగా అండగా ఉన్న బీఎస్ఎన్ఎల్ డీల్‌ను రద్దు చేసుకున్న ప్రభావం ఫలితాలపై స్పష్టంగా కనిపించింది. నాన్ కోర్ ఆదాయాల వృద్ధి కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి కంపెనీ రూ.12,760 కోట్ల లాభం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే లాభం 6% వృద్ధి చెందింది. మరోవైపు ఈ కాలంలో కంపెనీ ఆదాయం రూపాయి మారకంలో 1.3% వృద్ధి చెంది రూ.63,437 కోట్లుగా నమోదైనప్పటికీ స్థిర కరెన్సీ ఆదాయం మాత్రం 3% క్షీణించింది.

ఇతరత్రా ఆదాయం గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే రూ.962 కోట్ల నుంచి రూ.1,660 కోట్లకు పెరిగింది. గతంలో చెల్లించిన ఆదాయపు పన్ను ఏకమొత్తంలో వాపసు రావడం కంపెనీ లాభాలకు దోహదపడింది. నిర్వహణాపరమైన లాభాల మార్జిన్ సైతం వార్షిక ప్రాతిపదికన 24.7% నుంచి 24.5 శాతానికి తగ్గింది. అమెరికాలో ఆదాయం 2.7% తగ్గడమే ఇందుకు కారణం. రూ.15,000 కోట్ల విలువ గల బీఎస్ఎన్ఎల్ రద్దు ప్రభావం వల్ల భారత్ నుంచి సమకూరే ఆదాయాలు కూడా 21.7% తగ్గినట్టు ప్రకటించింది. అయితే బీఎస్ఎన్ఎల్ నుంచి రూ.2,900 కోట్ల యాడ్ ఆన్ వర్క్ వచ్చిందని, ఆ పని ఇంకా ప్రారంభించాల్సి ఉందని పేర్కొంది.

ప్రపంచవ్యాప్తంగా స్థూల ఆర్థిక, భౌగోళిక, రాజకీయ విభాగాల్లో కొనసాగుతున్న అస్థిరతల కారణంగా ఐటీ సర్వీసులకు డిమాండ్ క్షీణించిందని, ఈ కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయాల్లో రెండంకెల వృద్ధి ఉంటుందని తాను భావించడంలేదని టీసీఎస్ ఎండీ, సీఈఓ కే కృతివాసన్ అన్నారు. ముందు త్రైమాసికంలో విధాన నిర్ణయాల్లో చోటు చేసుకున్న జాప్యం సైతం ఇప్పుడు మరింత తీవ్రమైందని ఆయన చెప్పారు. అయితే గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది అంతర్జాతీయ మార్కెట్ల ఆదాయాలు కొంత మెరుగ్గా ఉండవచ్చని తెలిపారు.

ఒకసారి అస్థిరతలన్నీ తొలగిపోతే ఐటీ కంపెనీల ఆదాయాల వృద్ధికి ప్రధాన చోదకమైన విచక్షణాత్మక వ్యయాలు సాధారణ స్థాయికి వస్తాయన్నారు. ఆగస్టు చివరి నాటికి తమకు ప్రధాన మార్కెట్ అయిన అమెరికాతో వాణిజ్య ఒప్పందం తుదిరూపు దిద్దుకోవడం, క్లయింట్లు వ్యయ నియంత్రణ పాటిస్తున్న కొన్ని అంశాలపై స్పష్టత రావడం వంటి పరిణామాలు చోటు చేసుకోవచ్చని కృతివాసన్ తెలిపారు. కాగా ఏఐ సేవలపై క్లయింట్లకు మరింత ఆసక్తి కనిపిస్తోందన్నారు. ఈ త్రైమాసికంలో కంపెనీ 940 కోట్ల డాలర్ల విలువ గల కొత్త డీల్స్ కుదుర్చుకుంది.

డివిడెండ్ రికార్డు తేదీ ఈ నెల 16

వాటాదారులకు రూపాయి ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.11 మధ్యంతర డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు నిర్ణయించింది. డివిడెండ్‌కు అర్హత పొందేందుకు రికార్డు తేదీని జూలై 16గా నిర్ణయించారు. అంటే ఆ రోజుకి నమోదైన వాటాదారులందరికీ ఈ డివిడెండ్ లభిస్తుంది. డివిడెండ్‌ను ఆగస్టు 4వ తేదీ వాటాదారులకు చెల్లిస్తారు.

వేతనాల పెంపుపై నిర్ణయం తీసుకోలేదు

ఈ ఏడాది వేతనాల పెంపుపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, ప్రధాన మానవ వనరుల అధికారి మిలింద్ లక్కడ్ తెలిపారు. స్థూల ఆర్థిక వాతావరణం మెరుగుపడి వ్యాపారం సైతం వృద్ధి చెందితే తాము తప్పనిసరిగా వేతనాల్లో మంచి వృద్ధినే ఇస్తామని ఆయన స్పష్టం చేశారు.

6,000 నియామకాలు

ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 6,000 మంది ఉద్యోగులను నియమించినట్టు టీసీఎస్ వెల్లడించింది. జూన్ ముగిసే నాటికి మొత్తం ఉద్యోగుల సంఖ్య 6,13,069గా ఉంది. కాగా జూన్ త్రైమాసికంలో ఉద్యోగుల వలసల రేటు 13.8 శాతంగా ఉంది.

అమెరికాలో భారతీయుల సత్తా

- వలస బిలియనీర్ల జాబితాలో 12 మంది
- అగ్రస్థానంలో జై చౌదురి
- సత్య నాదెళ్ల, సుందర్ పిచాయ్‌కు చోటు
- ఫోర్బ్స్ పత్రిక వెల్లడి

న్యూఢిల్లీ: దేశం కాని దేశం. అయినా సరే 'ఆస్తుల సంపాదనలో తగ్గేదేలే' అంటున్నారు అమెరికాలోని భారతీయులు. విద్య లేదా ఉపాధి కోసం అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడిన భారతీయుల్లో కొందరు రెండు చేతులా సంపాదిస్తున్నారు. ఈ సంపాదనలో వీరు స్థానిక అమెరికన్లనూ మించిపోతున్నారు. అమెరికాలో 100 కోట్ల డాలర్ల కంటే ఎక్కువ సంపద ఉన్న వలసదారుల జాబితాలో ఈ సంవత్సరం అత్యధికంగా భారత్‌కు చెందిన 12 మందికి చోటు దక్కింది. గతంలో ఎన్నడూ ఇంతమంది భారత వలసదారులు బిలియనీర్ల జాబితాలో చేరలేదని '2025 అమెరికా రిచెస్ట్ ఇమ్మిగ్రెంట్స్ లిస్ట్' పేరుతో ఫోర్బ్స్ మ్యాగజైన్ రూపొందించిన నివేదిక వెల్లడించింది. భారత్ తర్వాత ఇజ్రాయెల్, తైవాన్ దేశాలు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. కాగా ఈ సంవత్సరం ఫోర్బ్స్ మ్యాగజైన్ ప్రకటించిన వలస బిలియనీర్ల జాబితాలో గూగుల్ మాతృసంస్థ అల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్, తెలుగు వాడైన మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల కూడా ఉన్నారు. ప్రస్తుతం వీరిద్దరి ఆస్తుల విలువ చెరో 110 కోట్ల డాలర్ల (సుమారు రూ.9,427 కోట్లు) వరకు ఉంటుందని ఫోర్బ్స్ పత్రిక అంచనా. సైబర్ సెక్యూరిటీ సంస్థ జెడ్‌స్కేలర్ వ్యవస్థాపకుడు, సీఈఓ జై చౌదురి ఈ విషయంలో 1,790 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.53 లక్షల కోట్లు) సంపదతో మిగతా భారత బిలియనీర్లు అందరి కంటే ముందున్నారు.

అమెరికాలో టాప్-12 భారత వలస బిలియనీర్లు

పేరు	ఆస్తుల విలువ (కోట్ల డాలర్లలో)
జై చౌదురి	1,790
వినోద్ ఖోస్లా	920
రాకేశ్ గంగ్వాల్	660
రొమేష్ టీ వాద్వానీ	500
రాజీవ్ జైన్	480
కవితార్క్ రామ్ శ్రీరామ్	300
రాజ్ సర్దానా	200
డేవిడ్ పాల్	150
నికేష్ అరోరా	140
సుందర్ పిచాయ్	110
సత్య నాదెళ్ల	110
నీరజా సేథి	100

ఎలాన్ మస్క్‌దే అగ్రస్థానం

అమెరికాకు వలస వచ్చి పెద్ద మొత్తంలో ఆస్తులు కూడబెట్టిన వలసదారుల్లో టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌దే అగ్రస్థానం. ప్రస్తుతం ఆయన ఆస్తుల విలువ 39,300 కోట్ల డాలర్లని (సుమారు రూ.33.68 లక్షల కోట్లు) ఫోర్బ్స్ తెలిపింది. గూగుల్ సహ వ్యవస్థాకుడు సెర్జీ బ్రైన్ (13,970 కోట్ల డాలర్లు), ఎన్‌విడియా సహ వ్యవస్థాపకుడు, సీఈఓ జెన్‌సెన్ హువాంగ్ (13,790 కోట్ల డాలర్లు) డాలర్ల సంపదతో వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు

జీఎంఆర్ లాజిస్టిక్స్ పార్క్‌లో జీహెచ్ఐఏఎల్‌కు 70% వాటా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఈఎస్ఆర్ జీఎంఆర్ లాజిస్టిక్స్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్‌లో (ఈజీఎల్‌పీపీఎల్) 70 శాతం వాటాలు కొనుగోలు చేసినట్టు జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం (జీహెచ్ఐఏఎల్) ప్రకటించింది. ఈ సంస్థలో జీహెచ్ఐఏఎల్ అనుబంధ సంస్థ జీఎంఆర్ హైదరాబాద్ ఏరోట్రోపోలిస్ లిమిటెడ్‌కు (జీహెచ్ఏఎల్) 30% వాటాలున్నాయి. హైదరాబాద్‌లో గిడ్డంగులు, లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటు కోసం 2020 జనవరి 8వ తేదీన జీహెచ్ఏఎల్, ఈఎస్ఆర్ హైదరాబాద్ 1 పీటీఈ లిమిటెడ్ భాగస్వామ్యంలో ఈజీఎల్‌పీపీఎల్ ఏర్పాటైంది.

చైనా మార్కెట్లోకి దక్కన్ రైస్

దక్కన్ బ్రాండ్ పేరుతో బియ్యం ఎగుమతి చేస్తున్న దక్కన్ గ్రెయిన్స్ ఇండియా తాజాగా చైనా మార్కెట్లోకి ప్రవేశించింది. కంపెనీ ఇప్పటికే అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, లండన్, స్వీడన్, జర్మనీ దేశాల్లో 30 రకాల బియ్యాన్ని విక్రయిస్తోంది. అమెరికా మార్కెట్లో బాస్మతియేతర బియ్యం విభాగంలో కంపెనీ ఇప్పటికే అగ్రస్థానంలో ఉందని దక్కన్ గ్రెయిన్స్ డైరెక్టర్ కిరణ్ కుమార్ పోలా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని రైతుల నుంచి బియ్యం కొనుగోలు చేసి ఎగుమతి చేస్తున్నట్టు చెప్పారు. కంపెనీ ప్రస్తుతం హైదరాబాద్ సమీపంలోని సుల్తాన్‌పూర్ వద్ద రైస్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను నిర్వహిస్తోంది.

ఎల్ఐసీలో 1% వాటా విక్రయం!

- ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్
- మార్కెట్ పరిస్థితుల ఆధారంగా అమ్మకం
- రూ.5,850 కోట్ల వరకు సమీకరణ



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బీమా దిగ్గజం భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ) మరోసారి వాటాల విక్రయానికి సిద్ధమవుతోంది. కంపెనీ ఈక్విటీలో 1 శాతం వాటాను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించినట్టు సమాచారం. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఈ ఓఎఫ్ఎస్ ద్వారా రూ.5,850 కోట్ల వరకు సమకూరే అవకాశం ఉందని భావిస్తున్నారు. మార్కెట్ పరిస్థితుల ఆధారంగా ఈ వాటా విక్రయంపై పెట్టుబడుల ఉపసంహరణ మంత్రిత్వ శాఖ దీనిపై నిర్ణయం తీసుకుంటుంది.

ఎందుకంటే ?

ఎల్ఐసీ 2022 మే నెలలో తన ఈక్విటీలో 3.5 శాతం వాటాను ఐపీఓ ద్వారా విక్రయించి రూ.21,000 కోట్లు సమీకరించింది. సెబీ నిబంధనల ప్రకారం కంపెనీ 2027 మే నాటికి తన ఈక్విటీలో కనీసం 10 శాతం అంటే మరో 6.5 శాతం వాటాను ప్రజలకు విక్రయించాలి. అయితే ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా.. మార్కెట్ పరిస్థితులను బట్టి దశల వారీగా విక్రయించాలని ఎల్ఐసీ యోచిస్తోంది. ఆ వ్యూహంలో భాగంగానే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1 శాతం ఈక్విటీ వాటాను త్వరలో ఓఎఫ్ఎస్ ద్వారా విక్రయించాలని భావిస్తున్నట్టు సమాచారం.

ఇన్వెస్టర్లకు నిరాశే

2022 మే నెలలో రూ.21,000 కోట్ల సమీకరణకు ఎల్ఐసీ రూ.902-949 ధరల శ్రేణితో ఐపీఓకు వచ్చింది. ఇన్వెస్టర్లు ఆసక్తి చూపించడంతో ఇష్యూ దాదాపు మూడు రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. అయితే షేర్ల లిస్టింగ్ తొలి రోజే 8 శాతం నష్టంతో మదుపరులను తీవ్రంగా నిరాశ పరిచింది. ఒక్కో షేరును రూ.949 చొప్పున జారీ చేయగా 2023 మే నెలలో ఒకదశలో ఎల్ఐసీ షేరు రూ.567కు పడిపోయింది. గత 52 వారాల్లో ఒక దశలో రూ.1,221.5కి చేరినా మళ్లీ వెంటనే నష్టాల బాట పట్టింది. గురువారం కూడా బీఎస్ఈలో ఎల్ఐసీ షేరు 2.01 శాతం నష్టంతో రూ.926.85 వద్ద ముగిసింది. ఇది ఐపీఓ ధరతో పోల్చితే రూ.22.15 తక్కువ. ఈ నేపథ్యంలో కంపెనీ జారీ చేసే ఓఎఫ్ఎస్‌కు మదుపరులు నుంచి ఎలాంటి ఆదరణ లభిస్తుందన్నది పెద్ద ప్రశ్న.

హెచ్‌యూఎల్ ఎండీ, సీఈఓగా ప్రియా నాయర్

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద ఎఫ్ఎంసీజీ కంపెనీ హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్)లో అధికార మార్పిడి జరగనుంది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి కంపెనీ ఎండీ, సీఈఓగా ప్రియా నాయర్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు కంపెనీ ఎండీ, సీఈఓగా ఉన్న రోహిత్ జావ ఈ నెలాఖరులో పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో ప్రియా నాయర్ బాధ్యతలు చేపడతారని హెచ్‌యూఎల్ ప్రకటించింది. ఒక మహిళను ఎండీ, సీఈఓ పదవిలో నియమించడం హెచ్‌యూఎల్ చరిత్రలో ఇదే మొదటిసారి. ఆమె ఈ పదవిలో ఐదేళ్ల పాటు కొనసాగుతారు.

సెన్సెక్స్ 345 పాయింట్లు డౌన్

ముంబై: కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తమై అమ్మకాలకు పాల్పడడం గురువారం మార్కెట్‌ను కుంగదీసింది. ఐటీ, టెలికాం షేర్లలో తీవ్రమైన అమ్మకాల ఒత్తిడి ప్రభావంతో ఈక్విటీ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 385.40 పాయింట్లు నష్టపోయి 83,190.28 వద్ద ముగియగా నిఫ్టీ 120.85 పాయింట్ల నష్టంతో 25,355.25 వద్ద క్లోజైంది. మార్కెట్ నష్టాల్లో ముగియడం వరుసగా ఇది రెండో రోజు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	540
వరంగల్	512	గోదావరి	515
చిత్తూరు	603	విశాఖపట్నం	540
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	102
వరంగల్	100	గుంటూరు	107
కరీంనగర్	100	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	98
కర్నూలు	100	నెల్లూరు	103
విశాఖపట్నం	86	అనంతపురం	103
గోదావరి	102		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,400 ▲	90,200 ▲	1,20,100 ▲
విజయవాడ	1,00,000 ▲	94,000 ▼	1,11,000 ▲
విశాఖపట్నం	99,920 ▲	90,200 ▲	1,20,000 ▼
రాజమండ్రి	98,400 ▲	90,200 ▲	1,19,200 ▲
ప్రొద్దుటూరు	97,200 ▲	89,420 ▲	1,08,200 ▼
ముంబై	97,046	88,894	1,07,934

బీసీ రిజర్వేషన్లపై క్యాబినెట్ నిర్ణయం.. జాగృతి విజయమే

» జై తెలంగాణ అనని వ్యక్తి.. సీఎం అయ్యారు: ఎమ్మెల్సీ కవిత

» 5గ్రామాలను తెలంగాణకు ఇవ్వాలంటూ ఏపీ సీఎంకు లేఖ

కొత్తగూడెం/హైదరాబాద్, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్‌తో తెలంగాణ జాగృతి చేపట్టిన ఉద్యమాలకు రేవంత్ సర్కార్ దిగొచ్చిందని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదం తెలపడం తెలంగాణ జాగృతి, యూపీఎఫ్, బీసీ సమాజం సాధించిన ఓ ప్రకటనలో వెల్లడించారు. కాగా, తెలంగాణ ఏర్పడిన తర్వాత కనీసం జై తెలంగాణ అనని వ్యక్తి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారని కవిత ధ్వజమెత్తారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ.. కాంగ్రెస్ పాలనలో ఆగమైపోతోందన్నారు. కొత్తగూడెంలో గురువారం తెలంగాణ జాగృతి జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కవిత మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి వాస్తు భయంతో సచివాలయానికి రావడం లేదన్నారు. సీఎం విసిరే సవాళ్లను తాము స్వీకరించగానే తోక ముడుస్తారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి సంస్థను పట్టించుకోవడం లేదని, ప్రైవేటీకరించాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కాగా, భద్రాచలం పట్టణాన్ని ఆనుకొని ఉన్న 5 పంచాయతీలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని కోరుతూ ఏపీ సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్సీ కవిత లేఖ రాశారు. 2014లో ఏకపక్షంగా విలీనం చేసుకోవడంతో యటపాక, కన్నాయిగూడెం, గుండాల, పిచ్చుకలపాడు, పురుషోత్తపట్నం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఏపీలో ఉన్న భద్రాచలం ఆలయ భూములు కబ్జాకు గురవుతున్నాయని పేర్కొన్నారు.

పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారు?

» 5 గ్రామాల సమస్య నాడు గుర్తుకు రాలేదా?: నన్నూరి

హైదరాబాద్, జూలై 10(ఆంధ్రజ్యోతి): భద్రాచలం పట్టణానికి ఆనుకుని ఉన్న 5 గ్రామ పంచాయితీలను తెలంగాణలో కలపాలంటూ ఏపీ సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్సీ కవిత లేఖ రాయడంపై టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి స్పందించారు. పదేండ్లు టీఆర్ఎస్ పార్టీ అధికారంలో కొనసాగినప్పుడు 5గ్రామాల సమస్య గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో ముంపు మండలాలు, గ్రామాల సమస్యపై ఎందుకు స్పందించలేదన్నారు. కల్వకుంట్ల కుటుంబ సభ్యులకు అధికారం లేనప్పుడు మాత్రమే తెలంగాణ వాదం, ప్రజల భావోద్వేగాలు గుర్తుకు వస్తాయా అని ఆయన ప్రశ్నించారు.

'సోలార్' పనుల్లో జాప్యం చేస్తే కాంట్రాక్ట్ రద్దు

» సింగరేణి సీఎండీ బలరామ్ హెచ్చరిక

సోలార్ ప్లాంట్ల నిర్మాణాలను ఒప్పందంలో పేర్కొన్న కాల పరిమితికి లోబడి పూర్తి చేయాలని, నిర్లక్ష్యం చేస్తే కాంట్రాక్టులను రద్దు చేయడంతో పాటు, బ్లాక్ లిస్టులో చేర్చుతామని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఏజెన్సీలను హెచ్చరించారు. గురువారం ఇక్కడి సింగరేణి భవన్‌లో ఆయన సోలార్ ప్లాంట్ల నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై అధికారులు, సంబధిత కాంట్రాక్టర్లతో సమీక్షించారు. మొదటి దశలో ఇంకా పూర్తి చేయాల్సి ఉన్న 54.5 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల నిర్మాణం, రెండో దశలో పూర్తి చేయాల్సి ఉన్న 67.5 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్ల నిర్మాణ ప్రక్రియపై ఆయన నిశితంగా సమీక్షించారు. బిల్లుల చెల్లింపులో సింగరేణి ఎటువంటి జాప్యం చేయనప్పటికీ నిర్మాణ సంస్థలు తమ పనులను సకాలంలో పూర్తి చేయకపోవడం విచాకరమన్నారు. అక్టోబరు నెలాఖరునాటికి పనులను పూర్తి చేయాలని, ఇకపై ఎటువంటి పొడిగింపులు ఉండబోవని స్పష్టం చేశారు.

రైతులపట్ల రేవంత్ సర్కారు నిర్లక్ష్యం: నిరంజన్

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రైతుల పట్ల రేవంత్ సర్కారు నిర్లక్ష్యం చూపుతోందని, ముందస్తు చర్యలు చేపట్టకపోవడం వల్లే రాష్ట్రంలో ఎరువుల కొరత తీవ్రమైందని బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఎరువుల మంత్రి జేపీ నడ్డాను 13సార్లు ఢిల్లీలో కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి.. రాష్ట్రానికి సరిపడా యూరియా బస్తాలను ఎందుకు తేలేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు ఉన్మాద భాషతో మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఎన్నో సామాజిక, రాజకీయ అంశాలకు వేదిక అయిన ప్రెస్‌క్లబ్ గురించి.. సీఎం స్థాయి వ్యక్తి జుగుప్సాకరంగా మాట్లాడటం తగదన్నారు. రేవంత్‌రెడ్డి.. తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

హీరో విజయ్ వ్యాఖ్యలపై ఎస్టీ కమిషన్ విచారణ

» సైబరాబాద్ పోలీసులపై సీరియస్

» కమిషనర్‌ను విచారణకు పిలిస్తే ఏసీపీ వచ్చారెందుకని ప్రశ్న

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) సినీ హీరో విజయ్ దేవరకొండ ఇటీవల ఒక సినిమా వేడుకలో గిరిజనులకు సంబంధించి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయంటూ వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన జాతీయ ఎస్టీ కమిషన్ గురువారం సైబరాబాద్ పోలీసులపై సీరియస్ అయింది. విచారణకు సైబరాబాద్ కమిషనర్‌ను రావాలని నోటీసు జారీ చేస్తే.. మాదాపూర్ ఏసీపీ విచారణకు రావడాన్ని కమిషన్ తప్పు పట్టింది. విచారణకు పిలిచింది కమిషనర్‌ను, మీరెందుకు వచ్చారు? ఆ మాత్రం తెలియదా అంటూ విచారణ అధికారి, కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ అసహనం వ్యక్తం చేశారు. మరో 15 రోజుల్లో సైబరాబాద్ కమిషనర్ విచారణకు హాజరుకాని పక్షంలో డీజీపీకి సమన్లు ఇవ్వాల్సి ఉంటుందని హెచ్చరించారు.



మంత్రి దామోదరకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఐశ్వర్య కుటుంబం

కర్ణాటక బాలికకు ఉచిత గుండె ఆపరేషన్

» చొరవ చూపిన దామోదర.. తల్లిదండ్రుల భావోద్వేగం

» ప్రాణాలు కాపాడిన దేవుడంటూ మంత్రికి కృతజ్ఞతలు

హైదరాబాద్, జూలై 10(ఆంధ్రజ్యోతి): చక్కగా ఆడిపాడే ఎనిమిదేళ్ల వయసులో తమ బిడ్డకు ప్రాణాంతకమైన గుండె జబ్బు ఉందని తేలడంతో ఆ నిరుపేద తల్లిదండ్రుల గుండెల్లో రాయిపడ్డట్లయింది. చికిత్సకు రూ.5 లక్షలు అవసరపడుతుండటం..అంత సొమ్ము వెచ్చించే స్థోమత లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదరను సాయం కోసం అర్థించారు. మంత్రి వెంటనే స్పందించి.. పాపకు నిమ్స్‌లో ఉచితంగా ఆపరేషన్ చేయించడంతో ఆ కన్నవారిలో ఆనందం అర్ణవమైంది. కర్ణాటకకు చెందిన చంద్రకాంత్ దంపతులు హైదరాబాద్ మలక్‌పేట్‌లో ఉంటూ ఓ హోటల్‌లో పని చేసుకుంటున్నారు. బిడ్డ ఐశ్వర్య (8) తరచూ అనారోగ్యానికి గురవుతుండటంతో ఆస్పత్రిలో చూపించారు. పాప గుండె జబ్బు (ఏట్రియల్ సెప్టల్ డిఫెక్ట్)తో బాధపడుతోందని, శస్త్ర చికిత్స చేయకపోతే ఆమె ప్రాణాలకే ప్రమాదం అని, ఆపరేషన్‌కు రూ.5లక్షలు ఖర్చవుతుందని అక్కడి డాక్టర్లు చెప్పారు. చంద్రకాంత్ దంపతుల స్వస్థలం కర్ణాటక కావడంతో వారికి ఆరోగ్యశ్రీ కార్డు గానీ, రేషన్ కార్డు గానీ లేవు. బాధిత కుటుంబం మంత్రి దామోదరను కలిసి, పాప పరిస్థితిని వివరించింది. వెంటనే స్పందించిన మంత్రి.. చిన్నారి ఐశ్వర్యను నిమ్స్‌లో చేర్పించారు. ఆమెకు ఆపరేషన్ ఉచితంగా చేయాలని ఆదేశించారు. ఆ మేరకు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 4న గోపాల్, ప్రవీణ్ నేతృత్వంలోని డాక్టర్ల బృందం ఐశ్వర్యకు శస్త్రచికిత్స చేశారు. పాప పూర్తిగా కోలుకోవడంతో ఇంటికి పంపించారు. చంద్రకాంత్ దంపతులు పాపతో కలిసి గురువారం సచివాలయంలో మంత్రి దామోదరను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

కొండా మురళిపై చర్యలు తీసుకుంటారా.. లేదా?

మా నియోజకవర్గాల్లో వారి జోక్యం ఎక్కువైంది.. ఆ కుటుంబంలా మేం అన్ని పార్టీలూ మారలేదు

బాధితులనే కమిటీ ముందుకు పిలవడం అవమానకరం..వరంగల్ జిల్లా ఎమ్మెల్యేల అసహనం

వారి అభిప్రాయాలను రికార్డు చేసిన కమిటీ.. వచ్చే సోమవారం మరోసారి భేటీ అయ్యే చాన్స్

హైదరాబాద్/వరంగల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఆ పార్టీ సీనియర్ నేత కొండా మురళి వ్యాఖ్యలపై టీపీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ విచారణ కొనసాగుతూనే ఉంది. గురువారం గాంధీభవన్‌లో ఈ అంశంపైన కమిటీ చైర్మన్ మల్లు రవి అధ్యక్షతన జరిగిన భేటీలో ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకుల అభిప్రాయాలను రికార్డు చేశారు. సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డిలు వివాదానికి సంబంధించి తమ అభిప్రాయాలు చెప్పారు. అయితే సమస్యపైన అనవసరమైన హడావుడి చేస్తున్నారని, సమస్యను పెంచుతున్నారా లేక తగ్గిస్తున్నారా అని కడియం శ్రీహరి ప్రశ్నించినట్లు తెలిసింది. తమ నియోజకవర్గాల్లో కొండా దంపతుల జోక్యం పెరిగి పోయిందంటూ కమిటీ దృష్టికి ఎమ్మెల్యేలు తెచ్చారు. తమపై మీడియా ముఖంగానే విమర్శలు చేసిన కొండా మురళిపైన చర్యలు తీసుకుంటారా లేదా అంటూ అసహనం వ్యక్తం చేశారు. తామూ పార్టీ మారి ఉండొచ్చునని, కానీ కొండా కుటుంబంలాగా అన్ని పార్టీలూ మారి వచ్చిన వాళ్లం కాదన్నారు. కొండా మురళి తిట్లకు బాధితులమైన తమను క్రమశిక్షణ కమిటీ ముందుకు పిలవడం తమకు అవమానకరంగా ఉందని వారు చెప్పినట్లు సమాచారం. అయితే తమకు వచ్చిన ఫిర్యాదు మేరకే అభిప్రాయాలు తీసుకుంటున్నామని మల్లు రవి వారికి వివరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కలిసి పనిచేయాల్సిన నేతల మధ్య విభేదాలు పార్టీకే నష్టం చేకూర్చుతాయని సముదాయించారు. అనంతరం మీడియాతో మల్లు రవి మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా వివాదంపై 2 గంటల పాటు చర్చించామని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వారి అభిప్రాయాలు చెప్పారన్నారు. ఈ సమస్యపై మరోమారు భేటీ అవుతామని చెప్పారు. ఈ నేపథ్యంలోనే వచ్చే సోమవారం క్రమశిక్షణా చర్యల కమిటీ మళ్లీ భేటీ కానుందని సమాచారం.

బెట్టింగ్ యాప్స్ సెలబ్రిటీలపై రంగంలోకి ఈడీ!

29 మంది ప్రముఖులపై కేసు.. జాబితాలో విజయ్‌దేవరకొండ, రానా, ప్రకాశ్‌రాజ్, సిరి, శ్రీముఖి



హైదరాబాద్, జూలై 10(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌ల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్(ఈడీ) అధికారులు రంగంలోకి దిగారు. 29 మంది సినీ, సోషల్ మీడియా సెలబ్రిటీల మీద, నాలుగు కంపెనీల మీద ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు(ఈసీఐఆర్) నమోదు చేశారు. దర్యాప్తు కూడా ప్రారంభించారు. ఈడీ జాయింట్ డైరెక్టర్ రోహిత్ ఆనంద్ నేతృత్వంలోని బృందం హైదరాబాద్‌లోని పంజాగుట్ట, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మియాపూర్, సూర్యాపేట, విశాఖపట్నం తదితర పోలీసుస్టేషన్లలో నమోదైన ఐదు కేసుల ఆధారంగా 29 మందిపై మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసింది. సినీ రంగానికి చెందిన విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, ప్రకాష్‌రాజ్, మంచులక్ష్మి, ప్రణీత, నిధి అగర్వాల్, అనన్య నాగళ్ల, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు సిరి హన్మంతు, శ్రీముఖి, వర్షిణి సౌందర్‌రాజన్, వాసంతి కృష్ణన్, శోభా శెట్టి, అమృతా చౌదరి, నయని పావని, నేహా పఠాన్, పాండు, పద్మావతి, ఇమ్రాన్ ఖాన్, విష్ణుప్రియ, హర్షసాయి, భయ్యా సన్నీ యాదవ్, శ్యామల, టేస్టీ తేజ, రీతూ చౌదరి, బడారు సుప్రీత, కిరణ్‌గౌడ్, అజయ్, సన్నీ, సుధీర్ లోకల్ బాయ్ నానీతో పాటు బెట్టింగ్ యాప్ ఆపరేటర్ల పేర్లను ఈసీఐఆర్‌లో ఈడీ పేర్కొంది. బెట్టింగ్ యాప్స్‌కు ప్రమోషన్ చేసి పారితోషికంగా లక్షల రూపాయలను వీరు తీసుకున్నారని, ఇందులో అధిక మొత్తం డబ్బు మనీలాండరింగ్ రూపంలో అందినట్లు అనుమానాలు ఉన్నాయని ఈడీ అధికారులు ఈసీఐఆర్‌లో పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్స్ వ్యవహారం బయటపడిన తర్వాత విజయ్ దేవరకొండ, రాణా, ప్రకాష్ రాజ్ తదితరులు తమ వివరణను ఇచ్చారు. అనుమతి ఉన్న స్కిల్ గేమ్స్‌కు మాత్రమే విజయ్ దేవరకొండ ప్రచారం చేశారని ఆయన టీం మీడియాకు అప్పట్లో వివరణ ఇచ్చింది. ఆ తర్వాత బెట్టింగ్ యాప్స్ వ్యవహారంపై సిట్ ఏర్పాటు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులకు ఉన్న అనుమతులు, వారు ఎక్కడి నుంచి ఆపరేట్ చేస్తున్నారు? మనీ రూటింగ్ ఎలా జరుగుతుంది? వేల కోట్ల రూపాయలు ఏయే ఖాతాల ద్వారా రూట్ మారుతున్నాయనే విషయాలపై సిట్ దృష్టి సారించింది. ఈ కేసులో పోలీసు శాఖ ఇప్పటికే సేకరించిన పలు ఆధారాలను ఈడీ అధికారులు తీసుకున్నారు. త్వరలోనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి ఈడీ సమన్లు జారీ చేసే అవకాశాలున్నాయి.

నోటీసులు రాలేదు: ప్రకాశ్‌రాజ్

ఈడీ కేసుపై సినీ నటుడు ప్రకాశ్ రాజ్ స్పందించారు. గురువారం చిత్రజ్యోతితో మాట్లాడారు. "2017లో నేను, రానా రమ్మీ గేమ్ యాప్‌నకు ప్రచారం చేశాం. అప్పుడు అది బెట్టింగ్ యాప్ కాదు. రెన్యువల్ సమయంలో నేను ప్రచారం చేయనని చెప్పాను. తర్వాత దాన్ని కొనసాగించలేదు. మేం ప్రచారం చేసిన కంపెనీ ఆ యాప్‌ను మరో కంపెనీకి విక్రయించింది. ప్రస్తుతం నాకు ఎలాంటి నోటీసులు రాలేదు. యాప్ ప్రచారానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీల వివరాలను అధికారులకు అందజేస్తాను" అని అన్నారు.

బెట్టింగ్ యాప్‌లకు వివాహిత బలి

హైదర్‌నగర్, జూలై10 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌లలో డబ్బులు పెట్టి మోసపోయి మనస్తాపానికి గురైన వివాహిత బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాలకొల్లుకు చెందిన గంగ అనూష(27), వెంకన్నబాబు దంపతులు కొంతకాలంగా కేపీహెచ్‌బీలో నివాసం ఉంటున్నారు. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరులేని సమయంలో అనూష ఉరివేసుకుంది. అనూష బెట్టింగ్‌యాప్‌లో మొదట రూ.100 పెట్టుబడి పెట్టి లాభం రావడంతో లక్షల పెట్టుబడి పెట్టింది. తర్వాత వాటిని రాబట్టుకునేందుకు భర్త వెంకన్న బాబుకు తెలియకుండా బంగారం తాకట్టుపెట్టింది. ఆ డబ్బులు కూడా నష్టపోవడంతో.. భయంతో ఆత్మహత్య చేసుకుంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

ప్రభాకర్‌రావు అరెస్టుకు అనుమతివ్వండి!

» ఆయన విచారణకు సహకరించడం లేదు

» సుప్రీంకోర్టులో పిటిషన్ వేయనున్న సిట్

హైదరాబాద్/సూర్యాపేట క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసును విచారిస్తున్న సిట్ అధికారులు గురువారం ఢిల్లీ వెళ్లారు. ప్రభాకర్‌రావు విచారణకు సహకరించడం లేదని సుప్రీంకోర్టులో పిటిషన్ వేసేందుకు డీసీపీ విజయకుమార్, ఏసీపీ వెంకటగిరి ఢిల్లీ వెళ్లినట్లు తెలిసింది. ప్రభాకర్‌రావును వచ్చే నెల 5 వరకు అరెస్టు చేయొద్దని సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉపశమనాన్ని రద్దు చేయాలని కోరుతూ పిటిషన్ వేయనున్నట్లు సమాచారం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు విచారణకు హాజరవుతున్న ప్రభాకర్‌రావు దర్యాప్తు అధికారులకు సహకరించడం లేదని, 40గంటలు విచారించినా ట్యాపింగ్ వెనక ఉన్నదెవరన్న విషయాలను ఆయన బయట పెట్టడం లేదని అత్యున్నత న్యాయస్థానానికి తెలియజేయనున్నారు. అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, మోసపూరిత విధానాలను అనుసరించారని విచారణలో స్పష్టమైందని చెప్పనున్నారు. అయితే, ఫోన్ ట్యాపింగ్‌కు ప్రేరేపించింది ఎవరు? జర్నలిస్టులు, వ్యాపారులు, సినీ ప్రముఖులు, న్యాయమూర్తులు, రాజకీయ నాయకుల ఫోన్ల ట్యాపింగ్‌కు ఆదేశాలిచ్చిందెవరనే విషయాన్ని నిర్ధారించుకోవాలంటే ప్రభాకర్‌రావును కస్టడీలోకి తీసుకొని విచారించాల్సిన అవసరం ఉందని చెప్పనున్నారు.

జానయ్యయాదవ్‌కు సిట్ నోటీసు

ఫోన్ ట్యాపింగ్ కేసులో సూర్యాపేట డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్‌కు సిట్ గురువారం నోటీసు జారీ చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసిన వట్టె జానయ్యయాదవ్ ఫోన్‌ను కూడా ట్యాప్ చేసినట్లు గుర్తించారు. దీంతో ఈ నెల 14న విచారణకు రావాలని సిట్ అధికారులు తెలిపారు. జానయ్యయాదవ్ మాట్లాడుతూ.. గత శాసనసభ ఎన్నికల్లో ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేయించి బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారని ఆరోపించారు.

బీసీరిజర్వేషన్లు పెంచకుండా స్థానిక ఎన్నికలు వద్దు!

» మంత్రి పొన్నంతో జాజుల

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ఎట్టి పరిస్థితుల్లో స్థానిక ఎన్నికలు నిర్వహించవద్దని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం బీసీ సంఘాల నేతలతో కలిసి మినిస్టర్స్ క్వార్టర్స్‌లో పొన్నంకు వినతి పత్రం సమర్పించారు. రిజర్వేషన్లపై కేంద్రంపై ఒత్తిడి పెంచడానికి.. అఖిల పక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవాలని కోరారు. అసెంబ్లీలో బిల్లు ఆమోదించి చేతులు దులుపుపోకుండా, రాజ్యాంగ భద్రత రావాలంటే తమిళనాడు తరహాలో.. రిజర్వేషన్ల అంశాన్ని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని మంత్రికి శ్రీనివాస్ గౌడ్ వివరించారు. ఈనెల 21నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో.. బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం మెడలు వంచే విధంగా ప్రభుత్వ కార్యాచరణ ఉండాలని సూచించారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచడానికి కట్టుబడి ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి పొన్నం స్పష్టం చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఎంపీలకు 40% కోటా ఇవ్వండి

» సీఎంకు ఎంపీ రఘునందన్ లేఖ

» ఎంఐఎంకు లొంగిపోయిన హైడ్రా: ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో లబ్ధిదారుల ఎంపికలో ఎంపీలకు కూడా 40 శాతం కోటా కేటాయించాలని ఎంపీ రఘునందన్‌రావు గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. స్థానిక ఎమ్మెల్యేలకు ఇందులో ఇప్పటికే 40 శాతం కోటా కేటాయించారని, ప్రజల మద్దతుతో గెలిచిన ఎంపీలకు కూడా అవకాశం కల్పించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న పథకానికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నిధులు కూడా అందుతున్నాయని గుర్తు చేశారు. హైడ్రా.. ఎంఐఎంకు లొంగిపోయిందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. సల్కం చెరువు మధ్యలో కట్టిన అక్రమ భవనాలను కూల్చివేసేందుకు భయపడుతోందని అన్నారు. మానవత్వం అన్నది ముస్లింల విషయంలోనే వర్తిస్తుంది గానీ, హిందువుల విషయంలో ఎందుకు వర్తింపజేయరని రంగనాథ్‌ను నిలదీశారు. అక్రమంగా ఉంటున్న రోహింగ్యాలను తక్షణం పంపించాలని సీఎం రేవంత్‌కు విజ్ఞప్తి చేశారు.

లంచం తీసుకుంటూ చిక్కిన ఎస్సై

రాయదుర్గం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గృహహింస కేసు నుంచి తప్పించడానికి లంచం తీసుకుంటూ గచ్చిబౌలి ఎస్ఐ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. గచ్చిబౌలి మహిళా పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ వేణుగోపాల్.. గృహహింస కేసు నుంచి బాధితుడి తల్లి పేరును తొలగించాలంటే రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు సదరు వ్యక్తి నుంచి ఎస్సై లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు.

దుబాయి రియల్ ఎస్టేట్‌లో మనోళ్ల పెట్టుబడులు.. ఈడీ నోటీస్‌లు

('ఆంధ్రజ్యోతి' గల్ఫ్ ప్రతినిధి)



దుబాయి అంటే సగటు తెలుగువాడి దృష్టిలో.. రెక్కల కష్టం చేసుకుంటే నాలుగు రాళ్లు సంపాదించి పెట్టే నగరం! కానీ కొందరు రాజకీయ నాయకులకు మాత్రం అదొక భూతల స్వర్గం. రాజకీయాల్లో సంపాదించిన అవినీతి సొమ్ముతో స్థిరాస్తులు కొనుగోలు చేస్తూ సాఫీగా అద్దె ఆదాయాన్ని సృష్టించుకొనే సులువైన మార్గం. ఏ హైదరాబాద్‌లోనో.. విజయవాడలోనో.. కూర్చుని ఒప్పందం కుదుర్చుకుని దుబాయిలో స్థిరాస్తి కొనుగోలు చేస్తే చాలు! పెట్టిన పెట్టుబడిపై సంవత్సరానికి 10-15 శాతం అద్దె రూపంలో వస్తుంటుంది. అసలు ఆ సంపాదన ఆదాయపన్ను శాఖ దృష్టిలోకే రాదు కాబట్టి.. దాన్ని రిటర్నుల్లో చూపించనక్కర్లేదు! పైగా దుబాయి, ఇతర అరబ్ ఎమిరేట్లు.. అన్నీ మనదేశానికి కేవలం 3-4 గంటల విమాన ప్రయాణ దూరంలోనే ఉంటాయి కాబట్టి ఎప్పుడు కావాలంటే అప్పుడు రాకపోకలు సాగించవచ్చు!! అన్ని వ్యవహారాలూ చక్కబెట్టుకురావొచ్చు. ఇన్ని వెసులుబాట్లు ఉన్నాయి కాబట్టే.. అవినీతిపరులైన కొందరు భారతీయ రాజకీయ నాయకులు, అత్యంత సంపన్నులు ఇటీవలికాలంలో దుబాయి, ఇతర ఎమిరేట్లలో స్థిరాస్తులు కొనుగోలు చేస్తున్నారు. పుట్టినరోజు వేడుకలు, ఇతర శుభకార్యాలు జరుపుకోవడానికి ఆయా నగరాలకు క్యూ కడుతున్నారు. దుబాయిలో కొత్తగా కడుతున్న ఏ అపార్ట్‌మెంటులోనైనా ఫ్లాట్లు కొంటున్నవారిలో సగానికి పైగా భారతీయులే ఉండడం ఇందుకు నిదర్శనం. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే.. కొనుగోలుదారులలో ఎక్కువ మంది రాజకీయ నాయకులు ఉండడం గమనార్హం.

చట్టం ఏం చెప్తోంది?


మన చట్టాల ప్రకారం.. భారతీయులు ప్రపంచంలో ఎక్కడయినా స్థిరాస్తులు కొనుగోలు చేయవచ్చు. పెట్టుబడులు పెట్టవచ్చు. అయితే ఆయా లావాదేవీలను విదేశీ మారకద్రవ్య నిర్వహణ చట్టం 2022కు (ఫెమా-విదేశీ పెట్టుబడులు) అనుగుణంగా మాత్రమే నిర్వహించాలి. ఆ చట్టం ప్రకారం.. విదేశాలలో పెట్టుబడులు పెట్టడానికి, స్థిరాస్తులు కొనుగోలు చేయడానికి రిజర్వు బ్యాంకు అనుమతి అవసరం. వార్షిక ఆదాయపు పన్ను నివేదిక(ఐటీఆర్)లో విదేశీ ఆస్తులు, ఆదాయం గురించి వెల్లడించడం తప్పనిసరి. లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్(ఎల్ఆర్ఎస్) కింద.. భారతదేశం నుంచి గరిష్ఠంగా ఒక వ్యక్తి సంవత్సరానికి 2.5లక్షల డాలర్లు అంటే.. దాదాపుగా రూ.2.1 కోట్లు మాత్రమే విదేశాలకు బదిలీ చేయడానికి అనుమతి ఉంటుంది. అది కూడా.. అధీకృత బ్యాంకుల ద్వారా లావాదేవీలను నిర్వహించాల్సి ఉంటుంది. దీన్ని ఉల్లంఘించి ఎవరైనా విదేశాలలో ఆస్తి కొనుగోలు చేస్తే.. ఆ విలువకు మూడు రెట్ల దాకా జరిమానా విధిస్తారు. కానీ, చాలా మంది ఆ నిబంధనలను ఉల్లంఘించి క్రిప్టో నగదుతో రూ.కోట్ల విలువైన ఆస్తులను దుబాయిలో కొనుగోలు చేస్తున్నారు. మరికొందరు మొత్తం డబ్బును హైదరాబాద్‌లో నగదు రూపంలో చెల్లించేసి.. ఎలాంటి అధికారిక చెల్లింపులూ చేయకుండా దుబాయిలో ఆస్తులు కొనుగోలు చేస్తున్నారు. తద్వారా.. బ్యాంకింగ్, నగదు మార్పిడి చార్జీల నుంచి, భారత ప్రభుత్వం విధిస్తున్న క్రిప్టో లావాదేవీల పన్ను నుంచి తప్పించుకుంటున్నారు.

ఒప్పందాల్లో లేకున్నా..

యూఏఈ-భారత ద్వైపాక్షిక ఒప్పందాల్లో స్థిరాస్తుల కొనుగోళ్ల వివరాలు ఇవ్వాలన్న నిబంధన లేదు. అంటే.. ఒక భారతీయుడు దుబాయిలో ఏదైనా బ్యాంక్ ఖాతా తెరిచినా, లేక స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టినా ఆ వివరాలను మాత్రమే భారత అధికారులకు యూఏఈ అందజేస్తుంది. మనవాళ్లు అక్కడ కొనుగోలు చేసే ఆస్తుల వివరాలు ఇవ్వదు. ఈ క్రమంలోనే.. చాలామంది దుబాయి, ఇతర ఎమిరేట్లలో స్థిరాస్తులు కొంటున్నట్లు గుర్తించిన ఆదాయపన్ను శాఖ రహస్యంగా వారి వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. ఆ సమాచారం ఆధారంగానే వారికి ఈడీ కొద్దిరోజులుగా నోటీసులు పంపుతోంది. ఆ నోటీసులు అందుకుంటున్నవారిలో రాజకీయ నాయకులు.. అందునా తెలుగువారు కూడా ఉన్నట్టు తేలడంతో ఏం జరుగుతుందోనన్న ఆసక్తి నెలకొంది.

విద్యావేత్త చుక్కా రామయ్యకు సత్కారం

» పరామర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ రామకృష్ణారావు



చుక్కా రామయ్యను సన్మానిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ రామకృష్ణారావు తదితరులు

హైదరాబాద్ సిటీ, జూలై 10(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంగా ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య(99)ను పలువురు ప్రముఖులు కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. కొంతకాలంగా వయసురీత్యా ఎదురయ్యే ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ చుక్కా రామయ్య మంచానికే పరిమితమైన సంగతి తెలిసిందే. ఈ మేరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు కె.రామచంద్రమూర్తి, ఎమెస్కో విజయకుమార్ తదితరులు చుక్కా రామయ్యను గురువారం విద్యానగర్‌లోని ఆయన నివాసంలో పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పుష్పగుచ్ఛం అందించడంతో పాటు పూలమాల, శాలువాతో సత్కరించి, ఆశీస్సులు తీసుకున్నారు. విద్యారంగానికి రామయ్య అందించిన సేవలను ఈ సందర్భంగా వారంతా ప్రస్తావిస్తూ కొనియాడారు. తనను పరామర్శించడానికి వచ్చిన ప్రఖ్యాత సామాజికవేత్త ఆచార్య హరగోపాల్, వనమాల దంపతులను చూసి రామయ్య భావోద్వేగానికి లోనయ్యారు. సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ వాట్సాప్ వీడియో కాల్ ద్వారా చుక్కా రామయ్యకు గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. వందేమాతరం ఫౌండేషన్ రవీందర్, సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్ రెడ్డితో పాటు వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు రామయ్యకు పాదాలకు నమస్కరించి ఆశీస్సులు అందుకున్నారు. తాను మాట్లాడలేని స్థితిలోనూ వారందరినీ చూసి సంజ్ఞలద్వారా రామయ్య సంతోషాన్ని వ్యక్తం చేశారు.

'మహిళా శక్తి' చీరల ఉత్పత్తిని పెంచాలి

- ప్రభుత్వ శాఖల ఆర్డర్లను ముందే టెస్కోకు ఇవ్వాలి
- చేనేత కార్మికులకు పని కల్పించాలి: మంత్రి తుమ్మల



హైదరాబాద్, జులై 10 (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్ల నుంచి వచ్చే సంవత్సరానికి అవసరమయ్యే వస్త్రాల కోసం సెప్టెంబరు నెలలోగానే ఆర్డర్లు తెప్పించుకోవాలని, ఇప్పటికే ఉన్న ఆర్డర్లను టెస్కో త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. కార్మికులకు ఏడాది పొడవునా పని కల్పించాలని, స్వయం సహాయక సంఘాల మహిళలకు అందచేసే మహిళాశక్తి చీరల ఉత్పత్తిని వేగవంతం చేయాలని సూచించారు. సచివాలయంలో గురువారం చేనేత, జౌళి శాఖపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసి, కార్మికుల ఖాతాల్లో నిధులు జమ చేయాలని, టెస్కో షోరూమ్‌లను మెరుగుపరిచి లాభాల బాటలో నడిపించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, జాతీయ చేనేత పురస్కారానికి ఎంపికైన గజం నర్మద, గూడ పవన్‌ను మంత్రి తుమ్మల సన్మానించారు.

గ్రామీణ 11 కేవీ ఫీడర్లకు ఆటోమెటిక్ రీడింగ్ మీటర్లు

గ్రామీణ 11 కేవీ ఫీడర్ల నుంచి విద్యుత్ వినియోగాన్ని లెక్కించాలని దక్షిణ డిస్కమ్(టీజీఎస్పీడీసీఎల్) నిర్ణయించింది. ఈ డిస్కమ్ పరిధిలో 8681 ఫీడర్లు 11 కేవీలో ఉండగా.. అందులో 2 వేల ఫీడర్ల వినియోగాన్ని డిస్కమ్ కచ్చితంగా లెక్కించనుంది. దీనికోసం ఆయా ఫీడర్లలో ఆటోమేటిక్ రీడింగ్ మీటర్లు బిగించనుంది. వీటి నుంచి రోజువారీ విద్యుత్ వినియోగంతో పాటు నెలసరి వినియోగం వివరాలను ఎప్పటికప్పుడు సేకరించనుంది. దీనికోసం 4జీ డేటా సిమ్‌కార్డులను మీటర్లకు అమర్చనున్నారు. 2 వేల 11 కేవీ గ్రామీణ ఫీడర్లకు మీటర్లు పెట్టనుండటంతో వ్యవసాయ విద్యుత్ వినియోగంపై కచ్చితంగా వివరాలు అందనున్నాయి.

శాసన సభ, శాసన మండలి ప్రొరోగ్

రాష్ట్ర శాసన సభ, శాసన మండలి సమావేశాలు ప్రొరోగ్ అయ్యాయి. ఈ నెల 10 నుంచి ఉభయ సభలను నిరవధికంగా వాయిదా(ప్రొరోగ్) వేస్తున్నట్లు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రకటించారు. గవర్నర్ ఆదేశాల మేరకు శాసన సభ కార్యదర్శి వి.నర్సింహాచార్యులు గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. త్వరలో వర్షాకాల సమావేశాలను నిర్వహించాల్సి ఉన్నందున... ఉభయ సభలను గవర్నర్ ప్రొరోగ్ చేశారు.

పోలవరం బ్యాక్‌వాటర్ ముంపుపై భేటీ రద్దు

పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ముంపు ప్రభావంపై చర్చించడానికి వీలుగా గురువారం కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో జరుగనున్న సమావేశం అర్థంతరంగా రద్దయింది. రెండు వారాల కిందటే ఈ సమావేశపు షెడ్యూల్ ఖరారు కాగా... గురువారం రద్దయింది. ఇప్పటికే రెండు దఫాలుగా ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగే ప్రగతి సమావేశపు ఎజెండా నుంచి ఈ అంశం మాయం కాగా... తాజాగా సమావేశమే రద్దు కావడం గమనార్హం. అయితే, పోలవరం బ్యాక్‌వాటర్ ముంపుపై భేటీ రద్దు కావడం వెనుక ఏపీ ఒత్తిళ్లే కారణమని ప్రభుత్వం భావిస్తోంది. దాంతో ఏపీ సమ్మతి తెలిపితేనే సమావేశాలు జరిగే అవకాశాలున్నాయి.

నాలుగు ఇసుక బజార్ల ద్వారా నాణ్యమైన ఇసుక

- కావాలసినవారు కొనుగోలు చేసుకోవచ్చు: టీజీఎండీసీ

హైదరాబాద్, పరిసర ప్రాంతాల ప్రజల కోసం నాలుగు ఇసుక బజార్లను ప్రారంభించామని, అవసరమైనవారు వీటి నుంచి నాణ్యమైన ఇసుకను కొనుగోలు చేసుకోవాలని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) ఓ ప్రకటనలో తెలిపింది. వట్టినాగులపల్లి, అబ్దుల్లాపూర్‌మెట్, బౌరంపేట, ఆదిభట్లలో ఇసుక బజార్లను ఏర్పాటు చేశామని పేర్కొంది. ఈ బజార్లలో టన్ను సన్న ఇసుక రూ.1800కు, దొడ్డు ఇసుక రూ.1600కు విక్రయిస్తున్నామని తెలిపింది. వ్యక్తిగత వినియోగదారులు, కాంట్రాక్టర్లు, నిర్మాణ సంస్థలవారు తమ అవసరాల కోసం టీజీఎండీసీ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుని ఇసుకను తీసుకుపోవచ్చని వివరించింది. ఇతరత్రా సందేహాల కోసం టీజీఎండీసీ హెల్ప్‌లైన్ నెంబర్ 155242కు ఈ-మెయిల్ చేయాలని టీజీఎండీసీ సూచించింది.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి గడువు పెంపు

వైద్యఆరోగ్య శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు మెడికల్ బోర్డు సెక్రటరీ గోపికాంత్ ఓ ప్రకటన విడుదల చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు అర్హులైన వారు ఈ నెల 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 28, 29 తేదీల్లో తప్పుల సవరణకు అవకాశముంటుందని ప్రకటించారు. గత నెల 28న డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో నియామకం కోసం 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటన ఇచ్చారు. ఆ నోటిఫికేషన్‌లో జూలై 10 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ మొదలయి, 17వ తేదీతో ముగుస్తున్నట్లుగా ఉందని వెల్లడించారు. కానీ సాంకేతికపరమైన సమస్యలు ఉన్నందున అభ్యర్థుల అభ్యర్థన మేరకు బోర్డు మరో పది రోజులు గడువు పొడిగించింది.

నీట్‌లో తెలంగాణ నుంచి 43,400 మంది అర్హత

ఈ ఏడాది నిర్వహించిన నీట్ (యూజీ)-2025 పరీక్షలో తెలంగాణ రాష్ట్రం నుంచి అర్హత సాధించిన 43,400 మంది జాబితాను కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం విడుదల చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా అత్యధికంగా 670 మార్కులతో జాతీయ స్థాయిలో 18వ ర్యాంకు పొందిన కాకర్ల జీవన్ సాయి కుమార్ నుంచి 40 శాతం కట్ ఆఫ్‌తో 113 మార్కులు సాధించిన వారి జాబితాను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ జాబితా నీట్‌లో అర్హత పొందిన అభ్యర్థుల వివరాల కోసం మాత్రమేనని, మెరిట్ జాబితా కాదని వర్సిటీ స్పష్టం చేసింది.

ఈ నెల 27న జీపీవో ఎంపిక పరీక్ష

గ్రామపాలనాధికారుల(జీపీవో) ఎంపికకు సంబంధించి ఈ నెల 27న మరోసారి పరీక్ష నిర్వహిస్తామని భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ తెలిపారు. మాజీ వీఆర్‌వో, వీఆర్‌ఏలకు గ్రామపాలనాధికారులుగా అవకాశం కల్పించేందుకు గతంలో ఒకసారి పరీక్ష నిర్వహించారు. ఆ సమయంలో కేవలం 3450 మంది మాత్రమే ఎంపికయ్యారు. దీంతో మరోసారి పరీక్ష నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ఆసక్తి ఉన్న మాజీ వీఆర్‌వో, వీఆర్‌ఏలు ఈ నెల 16వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సీసీఎల్‌ఏ డీఎస్ లోకేష్ కుమార్ సూచించారు.

చీటికిమాటికి ట్రాఫిక్ చలాన్లు వేయకుండా చర్యలు తీసుకోవాలి: వీహెచ్

పోలీసులు చీటికి మాటికి ట్రాఫిక్ చలాన్లు వేయకుండా చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు కోరారు. ట్రాఫిక్ పోలీసులు ద్విచక్రవాహనదారులను లక్ష్యంగా చేసుకుని చలాన్లు వేస్తున్నారన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో యువత పాత్ర చాలా కీలకమని.. చీటికిమాటికి పోలీసులు వేసే ట్రాఫిక్ చలాన్లతో పార్టీపై ప్రభావం చూపే అవకాశముంటుందని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేసేందుకు సర్కారు వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈబీసీ కమిషన్ ఏర్పాటు చేయండి

- టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌కు ఈబీసీ జాతీయ అధ్యక్షుడి వినతి

రాష్ట్రంలో అగ్రవర్ణ పేదల అభ్యున్నతి కోసం ఆర్థికంగా వెనకబడిన తరగతుల (ఈబీసీ) కమిషన్, ప్రత్యేక మంత్రిత్వ శాఖ, ఆర్థిక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఈబీసీ జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలన్నింటినీ అగ్రవర్ణ పేదలకు కూడా వర్తింపచేయాలని విన్నవించారు. మహేశ్‌గౌడ్ స్పందిస్తూ.. ఈబీసీల సంక్షేమానికి కాంగ్రెస్ సర్కారు కృషి చేస్తుందని తెలిపారు.

బీసీలకు 42% రిజర్వేషన్లు

(మొదటిపేజీ తరువాయి)



పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్, పశు సంవర్థక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి క్యాబినెట్ సమావేశ వివరాలను విలేఖర్లకు వివరించారు. మార్చి నెలలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనే విద్య, ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే రెండు బిల్లులను ఆమోదించారు. అయితే, వాటికి రాష్ట్రపతి ఆమోదం పొందడం ఆలస్యం కావడంతో స్థానిక సంస్థల ఎన్నికలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు రిజర్వేషన్లను నెల రోజుల్లో ఖరారు చేయాలంటూ ఇటీవల హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో గురువారం సమావేశమైన మంత్రివర్గం 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించింది. సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే బీసీ డెడికేటెడ్ కమిషన్‌ను నియమించింది. రాష్ట్ర ప్రణాళిక విభాగం అధ్వర్యంలో కుల గణనను చేపట్టింది. వీటి ఆధారంగానే అసెంబ్లీలో రిజర్వేషన్ల బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకున్నది. అందుబాటులో ఉన్న ఎంపిరికల్ డేటా ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఖరారు చేసింది. సర్పంచి, ఎంపీటీసీ పదవులకు సంబంధించి బీసీ రిజర్వేషన్ల ఖరారుకు మండలాన్ని యూనిట్‌గా తీసుకోవాలని, ఎంపీపీ, జడ్పీటీసీలకు జిల్లా యూనిట్‌గా తీసుకోవాలని, జడ్పీ చైర్మన్లకు రాష్ట్రం యూనిట్‌గా తీసుకోవాలని నిర్ణయించారు. ఇందుకోసం పంచాయతీరాజ్ చట్టం-2018ను సవరిస్తూ ఆర్డినెన్స్‌ను జారీ చేయాలని నిర్ణయించారు. 42 శాతం రిజర్వేషన్లను ఆర్డినెన్స్ ద్వారా తెస్తారని ఇదివరకే 'ఆంధ్రజ్యోతి' కథనాలను ప్రచురించింది. విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులను అసెంబ్లీలో ఆమోదింపజేసుకుని, గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపించామన్నారు. ముఖ్యమంత్రి, బీసీ సంక్షేమ మంత్రి, ఇతర మంత్రులు అనేక పర్యాయాలు ఢిల్లీకి వెళ్లి సంబంధిత మంత్రులు, అధికారులతో చర్చించారని తెలిపారు. అధికారులు కొర్రీలు వేస్తూ సాగదీస్తూ ఉండటంతో అడ్వొకేట్ జనరల్‌ను రాష్ట్ర మంత్రివర్గ సమావేశానికి పిలిపించి చర్చించామన్నారు. న్యాయపరంగా భవిష్యత్తులో చిక్కులు రాకుండా చూసేందుకు తగిన జాగ్రత్తలు తీసుకొని ఆర్డినెన్స్ మార్గంలో రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతామని ప్రకటించారు. ఇందుకు గాను పంచాయతీరాజ్ చట్టం-2018ను సవరిస్తూ ఆర్డినెన్స్‌ను తెస్తామన్నారు.

ప్రతీ నిర్ణయాన్ని సమీక్షించాం

క్యాబినెట్ సమావేశం కొత్త సంప్రదాయానికి తెర లేపింది. ఇదివరకు జరిగిన 18 మంత్రివర్గ సమావేశాల్లో తీసుకున్న 327 నిర్ణయాలను సాంతంగా సమీక్షించిందని మంత్రి పొంగులేటి వివరించారు. 23 ప్రధాన శాఖలకు సంబంధించిన నిర్ణయాలన్నీ సమీక్షించి, 321 అంశాలు అమల్లోకి రావడాన్ని క్యాబినెట్ ఆమోదించిందన్నారు. నిర్ణయాలు ఎంతవరకు అమలయ్యాయో అంశాల వారీగా చర్చించామన్నారు. 96 శాతం నిర్ణయాలకు సంబంధించి ఆదేశాలు ఇచ్చి అమల్లో పెట్టినట్లు గుర్తించామని చెప్పారు. మిగతా వాటి గురించి సంబంధిత శాఖల అధికారులు స్పష్టతనిచ్చారన్నారు. ప్రతి రెండు వారాలకు ఒకసారి మంత్రివర్గ సమావేశం నిర్ణయించాలని గతంలో అనుకున్నామని గుర్తు చేస్తూ ఈ నెల 25వ తేదీన మరోసారి మంత్రివర్గ సమావేశం జరుపుతామని ప్రకటించారు. మూడు నెలలకోసారి గత ఆరు క్యాబినెట్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలును సమీక్షించాలని తాజా భేటీలో నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. దేశానికే తెలంగాణ క్యాబినెట్ సమావేశాలు ఆదర్శంగా ఉండాలనే ఉద్దేశంతో జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

రెండు ప్రైవేటు యూనివర్సిటీలు

ఎమిటీ విద్యా సంస్థ, సెయింట్ మేరీ రిహాబిలిటేషన్ సంస్థలకు ప్రైవేటు విశ్వవిద్యాలయాల హోదా ఇవ్వనున్నట్లు పొంగులేటి చెప్పారు. తెలంగాణ విద్యార్థులకు అడ్మిషన్లలో 50 శాతం కోటా ఇవ్వాలని ఎమిటీకి నిబంధన విధించామని తెలిపారు. రాష్ట్రంలో అసంపూర్తిగా ఉన్న కొన్ని ప్రాజెక్టులపై చర్చించామన్నారు. గత ప్రభుత్వం వ్యక్తిగత స్వార్థంతో ఈ ప్రాజెక్టులను పూర్తిగా వదిలేసిందని తెలిపారు. 2, 3, 4 శాతం మేర పనులు పెండింగ్‌లో ఉన్నా పూర్తి చేయకుండా, ఒక్క ఎకరానికి కూడా నీరివ్వలేని విధంగా మార్చారని ఆరోపించారు. వాటి భూసేకరణ పూర్తి చేసి, అసంపూర్తి పనులను పూర్తి చేసి, నీళ్లివ్వాలని నిర్ణయించామని తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో కొత్తగా ఏర్పడిన జిన్నారం, ఇంద్రేశం మున్సిపాలిటీల పరిధిలో చేర్చే 18 గ్రామ పంచాయతీలను పంచాయతీల జాబితా నుంచి తొలగించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు.

కొత్తగా 22 వేల ఉద్యోగాలు: మంత్రి పొన్నం ప్రభాకర్

ఏడాదిన్నర వ్యవధిలో తమ ప్రభుత్వం 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మరో 17,084 ఉద్యోగాల నియామక ప్రక్రియ వివిధ దశల్లో ఉందన్నారు. కొత్తగా 22,033 ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్లు ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించిందని చెప్పారు. వచ్చే మార్చిలోపు లక్ష ఉద్యోగాలను భర్తీ చేయాలన్నది తమ లక్ష్యమని ప్రకటించారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల పని తీరును సమీక్షించేందుకు వీలుగా వారి ఆధార్, పూర్తి వివరాలు సేకరించాలని ఆర్థిక శాఖను ఆదేశించినట్లు తెలిపారు. ఉద్యోగుల హాజరుతో పాటు విధి నిర్వహణలో జవాబుదారీతనాన్ని పెంచేందుకు అవసరమైన సంస్కరణలు తేవాలని సీఎం ఆదేశించారన్నారు. అధికారుల కమిటీకి ఈ బాధ్యతను అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. వారు రెండు నెలల్లో పూర్తి స్థాయి నివేదికను ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. సభలో 42 శాతం రిజర్వేషన్ల బిల్లులను ఆమోదించడానికి సహకరించిన విధంగానే రాజకీయ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో వాటి అమలుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గోశాలల నిర్వహణపై అధికారుల కమిటీ: వాకిటి శ్రీహరి

రాష్ట్రంలోని గోశాలల నిర్వహణ, మూడు అధునాతన గోశాలల ఏర్పాటుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ముగ్గురు అధికారులతో త్రిసభ్య కమిటీని వేస్తున్నామని రాష్ట్ర పశు సంవర్థక మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ తెలిపారు. వచ్చే క్యాబినెట్ సమావేశంలోపు కమిటీ తమ నివేదికను అందిస్తుందన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గోశాలలపై పశు సంవర్థక శాఖ ముఖ్య కార్యదర్శి సవ్యసాచి ఘోష్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారని చెప్పారు. హైదరాబాద్ సమీపంలోని ఎన్కేపల్లి వెటర్నరీ యూనివర్సిటీ, వేములవాడ, యాదగిరిగుట్ట గోశాలలను అత్యాధునిక గోశాలలుగా నిర్మించాలని క్యాబినెట్ భేటీలో నిర్ణయించామని తెలిపారు. వాటి నమూనాలను మంత్రివర్గ సమావేశంలో ప్రదర్శించినట్లు చెప్పారు. గోశాలలను రిజిస్టర్ చేయాలని, వాటి నిర్వహణపై సమగ్ర పాలసీని రూపొందించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందన్నారు. క్రీడా పాలసీని తెస్తున్నట్లు మంత్రి చెప్పారు. మత్స్య సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జీలను నియమిస్తామని తెలిపారు. చెరువులు, కుంటల్లో 82 కోట్ల చేపలను వదలాలని, 80 నుంచి 110 ఎంఎం సైజు చేపలను అందజేయాలని నిర్ణయించామన్నారు. మత్స్య శాఖకు రూ.122 కోట్లను కేటాయించడానికి క్యాబినెట్ ఆమోదించిందన్నారు.

సీలింగ్ తీసేసి.. రిజర్వేషన్ల పెంపు

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకుగాను పంచాయతీ రాజ్ చట్టానికి సవరణ

గవర్నర్ ఆమోదానికి ఫైలు..ఆర్డినెన్స్ జారీ..ఆ తరువాత జీవో

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల విషయంలో సమస్యగా ఉన్న రిజర్వేషన్ల అంశానికి ప్రభుత్వం గురువారం నాటి క్యాబినెట్ భేటీలో తెరదించింది. ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకుగాను.. రిజర్వేషన్లపై ఉన్న గరిష్ఠ పరిమితి (సీలింగ్)ని ఎత్తివేసేందుకు సిద్ధమైంది. ఈ మేరకు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 285(ఏ)కు కీలక సవరణ చేయనుంది. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదనే నిబంధన ఆ సెక్షన్‌లో ఉంది. దాన్ని సవరిస్తే బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచినా ఇబ్బంది ఉండబోదని ప్రభుత్వం భావిస్తోంది. ఆ నిబంధనను సవరిస్తూ రూపొందించిన ఫైలును సర్కారు.. గవర్నర్ ఆమోదానికి పంపనుంది. గవర్నర్ ఆమోదం తరువాత ఆర్డినెన్స్ వస్తుంది. ఆ ఆర్డినెన్స్ మేరకు ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులను జారీ చేయనుంది. దాని ప్రకారం రాష్ట్రంలో స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలుచేయనుంది. గురువారం జరిగిన క్యాబినెట్ భేటీకి.. అడ్వొకేట్ జనరల్‌నూ పిలిపించిన సర్కారు ఈ అంశంపై చర్చించి, పంచాయతీరాజ్ చట్ట సవరణకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది.

నిబంధన.. సవరణ..

వాస్తవానికి 2018లో పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకువచ్చినప్పుడు 50 శాతం పరిమితి నిబంధన లేదు. 2019లో ఇచ్చిన ఒక ఆర్డినెన్స్ ద్వారా దాన్ని ఆమోదించి చట్టంలో చేర్చారు. "సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఇచ్చే రిజర్వేషన్ 50 శాతానికి మించరాదు. దీనికి భిన్నంగా ఇతర సెక్షన్లు ఏవైనా ఉంటే అవి చెల్లుబాటు కావు" అని అందులో ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని సామాజిక వర్గాలకూ కలిపి రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని గతంలో పలు కేసుల్లో సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. అయితే కొన్ని ప్రత్యేక సమయాల్లో వాటిని పెంచుకునేందుకు అవకాశం ఉందని కూడా తెలిపింది. ఈ నేపథ్యంలోనే ఆ ప్రత్యేక అంశాలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసింది. వాటి ఆధారంగానే 50 శాతం సీలింగ్ అంశాన్ని సవరించాలని నిర్ణయించింది. ఈ సవరింపుతో రాష్ట్రంలో ఉన్న సామాజిక వర్గాల శాతాన్ని బట్టి రిజర్వేషన్లను అమలుచేసేందుకు ప్రభుత్వానికి వెసులుబాటు ఉంటుంది. ఇదే వివరాలను తెలుపుతూ, 2018 పంచాయతీరాజ్ చట్టంలో సవరణలు చేసిన ఫైలును ఆమోదం కోసం గవర్నర్‌కు ప్రభుత్వం పంపనుంది. రాష్ట్ర పరిధిలోని చట్టం కావడంతో.. గవర్నర్ దగ్గర ఆలస్యం జరగదని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆర్డినెన్స్ రాగానే రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయనుంది. అలాగే రిజర్వేషన్ల వ్యవహారం, ప్రత్యేక జీవో జారీ అంశాలకు సంబంధించి ఎవరైనా కోర్టుకు వెళ్లే అవకాశాలున్న నేపథ్యంలో.. ముందుగానే దీనిపై కోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేయాలని క్యాబినెట్‌లో నిర్ణయించారు. అలాగే.. పంచాయతీరాజ్‌చట్టానికి సవరణ చేసి, ఆమోదం కోసం గవర్నర్ వద్దకు ఫైల్ పంపించి, ఆర్డినెన్స్ జారీ చేసేందుకు వీలుగా అసెంబ్లీ సమావేశాలను ప్రొరోగ్ చేస్తున్నట్టు గురువారమే ఉత్తర్వులు జారీ చేశారు. ఇలా అసెంబ్లీని ప్రొరోగ్ చేసిన తరువాత తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌లను మళ్లీ నిర్వహించే అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదించుకునేందుకు అవకాశం ఉంది. ఇందుకు 6 నెలల దాకా సమయం ఉంటుంది.

ముందు పరిషత్ ఎన్నికలే!

- ఆ తర్వాతే పంచాయతీ ఎన్నికలు
- ఆర్డినెన్స్ వచ్చిన పది రోజుల్లో రిజర్వేషన్లు ఖరారు
- సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో మండలం యూనిట్‌గా రిజర్వేషన్లు
- జిల్లా యూనిట్‌గా ఎంపీపీ, జడ్పీటీసీ రిజర్వేషన్ల ఖరారు
- జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికల్లో రాష్ట్రం యూనిట్‌గా..
- ఆగస్టు నెలాఖరులోగా పరిషత్, సర్పంచ్ ఎన్నికల పూర్తి!

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలుత పరిషత్ ఎన్నికలే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థానిక ఎన్నికల్లో ముందుగా 'గుర్తు'పై గెలిచేందుకే కాంగ్రెస్ సర్కారు మొగ్గు చూపింది. పరిషత్ ఎన్నికలు పూర్తి చేసిన తర్వాతే సర్పంచ్ ఎన్నికలకు వెళ్లాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించింది. పరిషత్, సర్పంచ్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకురానుంది. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఈ నెలాఖరులోగా రిజర్వేషన్లు ఖరారు చేయాలంటూ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో రిజర్వేషన్ ప్రక్రియనూ వేగిరం చేయనుంది. పంచాయతీరాజ్ చట్ట సవరణ ఆర్డినెన్సును గవర్నర్ విడుదల చేసిన వెంటనే పరిషత్, సర్పంచ్ ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్లను పంచాయతీరాజ్ శాఖ ఖరారు చేయనుంది. పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికలకు మండలం యూనిట్‌గా రిజర్వేషన్లు ఖరారు చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. అలాగే ఎంపీపీ, జడ్పీటీసీ ఎన్నికల్లో జిల్లా యూనిట్‌గా, జడ్పీ చైర్మన్ ఎన్నికల్లో రాష్ట్రం యూనిట్‌గా ఖరారు చేయాలన్న నిర్ణయం జరిగింది. ఆర్డినెన్స్ విడుదల కాగానే పంచాయతీరాజ్ శాఖ రిజర్వేషన్లను ఖరారు చేసి.. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు అప్పగించనుంది. వాటి ఆధారంగా ఎన్నికల కమిమిషన్ ముందు ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జిల్లా పరిషత్ ఎన్నికలకు షెడ్యూల్‌ను విడుదల చేయనుంది. ఆ ప్రక్రియ ముగియగానే పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ను ప్రకటించనుంది.

ఆగస్టు నెలాఖరుకల్లా ఎన్నికలు పూర్తి..

రిజర్వేషన్ల ఖరారుపై పంచాయతీ రాజ్ శాఖ, ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం.. ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసుకున్నాయి. పంచాయతీరాజ్ చట్ట సవరణ ఆర్డినెన్స్‌ను గవర్నర్ వారం లోపే జారీ చేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఆర్డినెన్స్ వచ్చాక పది రోజుల్లోపే పరిషత్తు, పంచాయతీ ఎన్నికలకు రిజర్వేషన్లను ఖరారు చేయనున్నట్లు చెబుతున్నారు. ఆ తర్వాత నెల రోజుల్లో అంటే ఆగస్టు నెలాఖరు కల్లా పరిషత్, సర్పంచ్ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

మీ పనులూ పదేపదే గుర్తుచేయాలా?

సీఎంవో, మంత్రులు చెబితే తప్ప స్పందించరా?

- చెబితేనే పని చేస్తామనే ధోరణి సరికాదు
- కొందరు కార్యదర్శుల తీరుపై సీఎం రేవంత్ ఆగ్రహం
- క్యాబినెట్ నిర్ణయాల అమల్లో జాప్యంపై అసహనం

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కీలక అంశాల అమలుపైనా స్పందించరా? ముఖ్యమంత్రి కార్యాలయం లేదా సంబంధిత మంత్రులు చెబితే తప్ప పట్టించుకోరా? అంటూ కొందరు ఐఏఎస్ అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించినట్లు తెలిసింది. మీ పరిధిలో చేయాల్సిన పనుల గురించి కూడా పదేపదే గుర్తు చేయాలా? అని అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ మేరకు కొన్ని శాఖల కార్యదర్శులను ఆయన నిలదీసినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు 18 క్యాబినెట్ సమావేశాలు జరగ్గా.. సుమారు 321 అంశాలను ఆమోదించారు. వాటి అమలుపై దృష్టి సారించిన సర్కారు.. గురువారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆయా అంశాలపై శాఖల వారీగా చర్చించింది. ఈ సందర్భంగా కొందరు కార్యదర్శుల పనితీరుపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. చెబితేనే పని చేయాలనే ధోరణి సరి కాదని.. గత పాలకులు అమలు చేసిన విధానాలకు అలవాటు పడ్డ అధికారులు, అప్పటిలాగే అడిగితే తప్ప పని చేయమంటే కుదరదని హెచ్చరించినట్లు తెలిసింది. కీలక అంశాలపై ప్రభుత్వం ప్రకటన చేసినా.. సకాలంలో వాటిని అమలు చేయడానికి ఎందుకు శ్రద్ధ పెట్టడం లేదని ప్రశ్నించినట్లు సమాచారం. ఉదాహరణకు సచివాలయంలో సహాయ సెక్షన్ అధికారులను బదిలీలు చేయాలని 2024 సెప్టెంబరులో స్వయంగా ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారందరినీ బదిలీ చేయాలని ఆదేశించారు. 10 నెలలు గడిచినా దీనిపై అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సీఎం నిర్ణయాన్ని కూడా ఉన్నతాధికారులు తేలిగ్గా తీసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇక ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్దుబాటు విషయంలోనూ శాఖల వారీగా ఎవరికి తోచినట్లు వారు నిర్ణయాలు తీసుకోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఆయా శాఖల్లో పని భారం ఉందా? లేదా..? సరిపడ సిబ్బంది ఉన్నారా? లేదా? అనేవి చూసుకోకుండా కింది స్థాయి సిబ్బంది ఇచ్చిన నివేదికలను పరిగణనలోకి తీసుకొని కొంత మందిని తొలగించడం, మరికొంత మందిని అవసరం లేకున్నా కొనసాగించడం వంటి నిర్ణయాలు తీసుకున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఐఏఎస్ అధికారులతో రెండు రోజుల క్రితం ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. శాఖల వారీగా వివరాలు సేకరించేందుకు సన్నద్ధమైంది. మరోవైపు 16వ క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగులకు ఆరోగ్య పథకం అమలుపై నిర్ణయం తీసుకోగా.. సంబంధిత అధికారులు ఇంత వరకు దానిపై స్పందించలేదని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇలా కీలక అంశాలపై కూడా ఉన్నతాధికారులు సకాలంలో స్పందించడం లేదనే విమర్శలపై సీఎం తీవ్రంగా స్పందించినట్లు తెలిసింది.

సామాజిక విప్లవానికి నాంది

బీసీలకు 42% రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలు చరిత్రాత్మక నిర్ణయం

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్
- విప్లవాత్మక నిర్ణయం: కాంగ్రెస్ బీసీ నేతలు

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ఆర్డినెన్స్ తీసుకురావాలని మంత్రివర్గం నిర్ణయించడం 'సామాజిక విప్లవానికి నాంది' అని అభివర్ణించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో చేసిన 'జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు' డిమాండ్‌ను దేశంలో తొలిసారిగా తెలంగాణలో అమలు చేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న కాంగ్రెస్‌కు బీసీలు అండగా నిలవాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు విప్లవాత్మక నిర్ణయమని కాంగ్రెస్ బీసీ నాయకులు అభివర్ణించారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల కాంగ్రెస్ ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, సురేశ్ షెట్కార్, విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు శంకరయ్య, రాజ్ ఠాకూర్, ఓబీసీ సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో 22 శాతానికి కుదించిన బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచడం గర్వకారణమని చెప్పారు. ప్రభుత్వం తరపున సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ తరపున టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ వ్యూహాత్మకంగా, సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. కాగా.. బీసీలకు కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలు నిర్ణయం తీసుకుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ చెప్పారు. ఇది బీసీలకు ప్రభుత్వం ఇచ్చిన గొప్పవరమని పేర్కొన్నారు.

అందరూ సహకరించాలి: బీసీ కమిషన్

బీసీలకు 42శాతం రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలకు వెళ్లాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ చెప్పారు. ఈ రిజర్వేషన్లకు అడ్డంకులు లేకుండా, సజావుగా అమలయ్యేలా అన్ని వర్గాల వారు రాజకీయాలకు అతీతంగా సహకరించాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఆర్డినెన్స్ తెస్తామన్న ప్రభుత్వ నిర్ణయం పట్ల బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ అంశంలో ఎదురయ్యే చట్టపరమైన సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వానికి అండగా ఉంటామని ప్రకటించారు.

బీసీలు మళ్లీ మోసపోవద్దు

బీసీ మేధావుల ఫోరం చైర్మన్ చిరంజీవులు

రాష్ట్రంలో బీసీలు మళ్లీ మోసపోవద్దని, రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్లను చేర్చడమే అసలైన పరిష్కారమని బీసీ మేధావుల ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ జారీ చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై ఆయన ఒక ప్రకటనలో స్పందించారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్ల అమలు కోసం 2018లో జీఓ నం. 396 జారీ చేసిందని చిరంజీవులు గుర్తుచేశారు. కానీ మొత్తం రిజర్వేషన్లు 50శాతాన్ని మించొద్దంటూ ఆ జీవోను హైకోర్టు కొట్టివేసిందని, ఆ తీర్పును సుప్రీంకోర్టు కూడా సమర్థించిందని చెప్పారు. దాంతో బీసీలకు 22శాతమే రిజర్వేషన్లు కల్పించారని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే ప్రయోగం చేస్తోందని విమర్శించారు.

రాష్ట్రవ్యాప్తంగా సంబరాలకు పిలుపు

స్థానిక ఎన్నికలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు కోసం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ జిల్లాలు, నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు టీపీసీసీ పిలుపునిచ్చింది.

నా కోడిని కొట్టినోడిని జైల్లో పెట్టాల్సిందే !

» నకిరేకల్ పోలీసులను ఆశ్రయించిన ఓ వృద్ధురాలు

» నష్టపరిహారం ఇప్పిస్తామన్న ససేమిరా

నకిరేకల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మా పక్కంటి ఆయన నా కోడి కాళ్లు విరగొట్టాడు. అతనిపై కేసు నమోదు చేసి శిక్షించండి.. అంటూ ఓ వృద్ధురాలు పోలీసులను ఆశ్రయించింది. గాయపడిన కోడిని తీసుకుని మరీ స్టేషన్‌కు వచ్చిన ఆ వృద్ధురాలికి నష్టపరిహారం ఇప్పిస్తామని పోలీసులు చెప్పినా ససేమిరా అన్న ఆమె నిందితుడిని శిక్షించాల్సిందేనని పట్టు బట్టింది. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం గొల్లగూడేనికి చెందిన కడారి గంగమ్మ అనే వృద్ధురాలు తన ఇంటి వద్ద నాటు కోళ్లను పెంచుతోంది. గంగమ్మ పక్కంటిలో ఉండే చిర్రబోయిన రాకేశ్.. గేదెలు పెంచుతున్నాడు. గంగమ్మకు చెందిన ఓ నాటు కోడి మంగళవారం రాత్రి రాకేశ్‌కు చెందిన గడ్డివాములోకి చేరి గేదెలు గడ్డి తినకుండా చేసింది. దీంతో రాకేశ్ కర్రతో కొట్టడంతో ఆ కోడి కాళ్లు విరిగాయి. తన కోడి కాళ్లు విరగొట్టిన రాకేశ్‌పై ఫిర్యాదు చేసేందుకు గంగమ్మ అదే రోజు రాత్రి నకిరేకల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. గాయపడిన తన కోడిని సీఐ రాజశేఖర్‌కు చూపించి రాకేశ్‌పై చర్యలు తీసుకోమని కోరింది. నష్టపరిహారం ఇప్పిస్తామని సీఐ చెప్పినా అంగీకరించని గంగమ్మ కేసు పెట్టాలని పట్టుబట్టింది. దీంతో రాకేశ్‌ను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడతామని నచ్చజెప్పిన పోలీసులు గంగమ్మను పంపించారు. గంగమ్మ చేసిన ఫిర్యాదుపై ఇప్పటిదాకా ఎలాంటి కేసు నమోదు కాలేదు. కానీ, ఆ పోలీసులతో మాట్లాడుతుండగా తీసిన వీడియో మాత్రం సోషల్ మీడియాలో వైరలైంది.

శ్రీవారి కన్‌స్ట్రక్షన్‌పై రెరా కొరడా!

» 'శ్రీవారి బృందావనం' ఫ్లాట్ల అమ్మకాలు చేయొద్దంటూ ఉత్తర్వులు

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఒప్పందం ప్రకారం కొనుగోలు దారులకు ఫ్లాట్లు కేటాయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన శ్రీవారి కన్‌స్ట్రక్షన్ సంస్థపై తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) కొరడా ఝుళిపించింది. రంగారెడ్డి జిల్లా బండ్లగూడ మునిసిపాలిటీ పరిధిలోని పద్మశ్రీ హిల్స్‌లో పి.ఉమాదేవి సారథ్యంలో శ్రీవారి కన్‌స్ట్రక్షన్.. శ్రీవారి బృందావనం పేరుతో 80 ఫ్లాట్లను నిర్మించింది. వీటిని 2023 ఫిబ్రవరి నుంచి 2024 మేలోపు కొనుగోలుదారులకు అందజేస్తామని వారి నుంచి భారీ మొత్తంలో నగదు వసూలు చేసింది. సకాలంలో ఫ్లాట్లు అందజేయలేదని రెరాకు ఫిర్యాదులు వచ్చాయి. విచారణ చేపట్టిన రెరా.. సంస్థ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడటంతో ప్రాజెక్టును తాత్కాలికంగా నిలిపివేస్తూ ఉత్తర్వులిచ్చింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ప్రాజెక్టు గురించి ప్రచారం చేయకూడదని, అలాగే అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు చేయొద్దని ఆదేశించింది. ఈ ప్రాజెక్టు తరఫున రిజిస్ట్రేషన్‌కు వచ్చే లావాదేవీలను అనుమతించవద్దని రిజిస్ట్రేషన్ శాఖకు సమాచారం ఇచ్చింది. శ్రీవారి కన్‌స్ట్రక్షన్ చేపట్టే ప్రాజెక్టుల్లో ఎలాంటి కొనుగోళ్లు చేయవద్దని, వారితో ఎలాంటి ఒప్పందాలు చేసుకోవద్దని ప్రజలు, కొనుగోలుదారులకు రెరా సూచించింది.

డ్రగ్స్ దందాలో 9 పబ్‌లకు ఈగల్ నోటీసులు

హైదరాబాద్, జూలై10(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, సైబరాబాద్‌లోని 9 పబ్‌లపై సైబరాబాద్ నార్కోటిక్స్ వింగ్ ఈగల్ బృందాలు కేసు నమోదు చేశాయి. హైదరాబాద్‌లోని పబ్‌లలో ఏర్పాటు చేసిన రహస్య గదుల్లో డ్రగ్స్ పార్టీలు జరుగుతున్నట్లు ఇటీవల పట్టుబడిన మల్నాడు కిచెన్ యజమాని సూర్య ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈ కేసు నమోదు చేశారు. ప్రిజం పబ్, ఫార్మ్ పబ్, బర్డ్‌బాక్స్ పబ్, బ్లాక్22 పబ్, వాక్ కోరా పబ్, బ్రాడ్‌వే పబ్, క్వాక్ ఏరీనా పబ్, ఎక్స్‌రా పబ్‌లపై కేసులు నమోదు అయ్యాయి. వచ్చే వారం విచారణకు హాజరుకావాలని పబ్ యాజమాన్యాలను అధికారులు కోరారు.

నకిలీ పోలీసుల ముఠా గుట్టు రట్టు

» 4 రాష్ట్రాల్లో రూ.18 లక్షల వరకు మోసం

» ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు, నలుగురి అరెస్టు

ఆదిలాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో నకిలీ పోలీసుల గుట్టు రట్టు అయింది. పోలీసుల అవతారమెత్తి ప్రజలను మోసగిస్తూ, డబ్బు వసూళ్లకు పాల్పడుతోన్న ముఠాను అరెస్టు చేసినట్లు గురువారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. నకిలీ పోలీసుల రూపంలో ఐదుగురి సభ్యుల ముఠా.. నగల దుకాణాల యజమానులకు ఫోన్ చేసి బంగారం అమ్మకాలలో మోసాలకు పాల్పడుతున్నారని వారిపై బెదిరింపులకు దిగారని తెలిపారు. ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో సుమారుగా రూ.18 లక్షల వరకు మోసం చేసి వ్యాపారం చేశారని, అందులో నష్టాలు రావడంతో మళ్లీ మోసాలకు పాల్పడడం ప్రారంభించారని అన్నారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేశామని.. ఒకరు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి ఒక బెలోనో కారు, బైక్, ఓ ఆటోతో పాటు బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో కేసులు ఉన్నాయని ఎస్పీ మహాజన్ చెప్పారు.

శివాలయంపై గుర్తుతెలియని దుండగుల దాడి

» నిరసన వ్యక్తం చేసిన హిందూ సంఘాలు

గాజులరామారం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్ శివాలయంపై బుధవారం గుర్తుతెలియని దుండగులు దాడి చేసి విగ్రహాలను ధ్వంసం చేశారు. ఆలయంలోని వినాయక విగ్రహాన్ని ధ్వంసం చేయడంతో పాటు నందీశ్వరుడి పై ఉన్న వస్త్రాన్ని కాల్చేశారు. గుడి గంటను పగులగొట్టారు. ఈ ఘటనను హిందు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. గురువారం కైసర్‌నగర్ హనుమాన్ దేవాలయం నుంచి శివాలయం వరకు శాంతి ర్యాలీ నిర్వహించాయి. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను దెబ్బతీసే విధంగా ఆలయాలపై దాడులు జరుగుతున్నాయని సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్ శివాలయంపై దాడి చేసి 100 రోజులు గడవక ముందే కైసర్‌నగర్ శివాలయంలోని దేవతామూర్తుల విగ్రహాలను ధ్వంసం చేయడం దారుణమని, ఇలాంటి ఘటనలు హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయని అన్నారు. నిందితులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి, సూరారం సీఐ భరత్‌కుమార్, దుండిగల్ డీఐ సతీశ్, సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని, ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏసీపీ శంకర్‌రెడ్డి తెలిపారు. ప్రత్యేక బృందాలతో నిందితుల కోసం గాలిస్తున్నామని, త్వరలోనే వారిని పట్టుకుని కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

భారతదేశ పటంలో తెలంగాణకు చోటు లేదా?

» ఏపీ బీజేపీ అధ్యక్షుడు ఆ రాష్ట్ర మంత్రి లోకేశ్‌కు ఇచ్చిన దేశ పటంలో తెలంగాణ లేదేం?

» ఇది బీజేపీ విధానమా?.. ప్రధాని స్పందించాలి: కేటీఆర్

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): భారతదేశ చిత్రపటంలో తెలంగాణకు చోటు లేదా? తెలంగాణను తొలగించడంలో మీ ఉద్దేశం ఏంటి? అని బీజేపీ నేతలను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ ఆ రాష్ట్ర మంత్రి లోకేశ్‌కు ఇచ్చిన భారతదేశ పటంలో తెలంగాణ లేకపోవడంపై గురువారం ఎక్స్‌లో కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. లోకేశ్‌కు బహుమతిగా ఇచ్చిన చిత్రపటంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను మాత్రమే చూపించడం దారుణమన్నారు. ఇది పూర్తిగా అనుచితమని, ఇది బీజేపీ అధికారిక అభిప్రాయమా? అని కేటీఆర్ ప్రధాని మోదీని ప్రశ్నించారు. తెలంగాణను భౌగోళికంగా గుర్తించకపోవడంపై ప్రధాని సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ ప్రజల త్యాగాలు, రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటాలను అగౌరవపర్చడం తగదని పేర్కొన్నారు. పొరపాటైతే, తెలంగాణ ప్రజలను అపహాస్యం చేసినందుకు గాను బీజేపీ నాయకత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

కల్తీకల్లు మృతుల కుటుంబాలకు రూ.20 లక్షలు ఇవ్వాలి

హైదరాబాద్‌లో కల్తీకల్లు తాగి ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలన్నారు.

సీబీఐటీ ఫీజులు పెంచుకోవచ్చు

టీఏఎఫ్ఆర్సీ చేసిన సిఫార్సుల మేరకు వసూలు చేసుకోవచ్చు... హైకోర్టు అనుమతి

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల ఫీజులు పెంచుకునేందుకు చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ)కి హైకోర్టు అనుమతి ఇచ్చింది. 2025-26, 2026-27, 2027-28 విద్యా సంవత్సరాలకు సంబంధించి తెలంగాణ ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) నిర్ధారించిన మేరకు బీటెక్ కోర్సులకు రూ.2.23 లక్షలు, ఎంటెక్ వంటి పీజీ కోర్సులకు రూ.1.51 లక్షలు, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు 1.40 లక్షలు వార్షిక ఫీజు వసూలు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. అధికారిక వెబ్‌సైట్లో ఈ కాలేజీకి సంబంధించి కొత్త ఫీజుల వివరాలను ఉంచాలని ఈఏపీసెట్ కన్వీనర్‌ను ఆదేశించింది. ఈ ఫీజుల పెంపు కోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టం చేసింది.

జీవో 26ను సవాల్ చేస్తూ..

రాష్ట్రంలోని ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ వృత్తి విద్య కళాశాలల్లో ఫీజులను మూడేళ్లకోసారి(బ్లాక్ పీరియడ్) సవరిస్తారు. టీఏఎఫ్ఆర్సీ ఆయా కాలేజీల ఆదాయ, వ్యయాల లెక్కలను పరిశీలించి కొత్త ఫీజులను ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. గత బ్లాక్ పీరియడ్ (2022-25) ముగియడంతో.. ప్రస్తుత విద్యా సంవత్సరం (2025-26) నుంచి కొత్త ఫీజులు అమల్లోకి రావాల్సి ఉంది. దీనికి సంబంధించి టీఏఎఫ్ఆర్సీ కాలేజీల నుంచి ప్రతిపాదనలు తీసుకుని, ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. కానీ ఆ ఫీజులు చాలా ఎక్కువగా ఉన్నాయని ప్రభుత్వం గుర్తించింది. కాలేజీల ప్రతిపాదనలను పరిశీలించి, కొత్త ఫీజులను ఖరారు చేస్తామని ప్రకటించింది. ఈ ఏడాదికి పాత ఫీజులే కొనసాగుతాయని పేర్కొంటూ ఉన్నత విద్యాశాఖ జూన్ 30న జీవో 26ను జారీ చేసింది. అయితే ఫీజులు పెంచకుంటే ఆర్థికంగా ఇబ్బంది ఎదురవుతుందని, టీఏఎఫ్ఆర్సీ నిర్ణయించిన మేరకు ఫీజుల వసూలుకు అనుమతించాలని కోరుతూ.. సీబీఐటీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై గురువారం జస్టిస్ కే.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. సీబీఐటీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. టీఏఎఫ్ఆర్సీ చట్టబద్ధ సంస్థ అని, ఆ సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించడం తప్ప మరో మార్గం లేదని కోర్టుకు నివేదించారు. మరోవైపు టీఏఎఫ్ఆర్సీ, ఉస్మానియా యూనివర్సిటీ తరఫు న్యాయవాదులు వాదిస్తూ.. టీఏఎఫ్ఆర్సీ కేవలం సిఫార్సులు చేస్తుందని, అమలు చేయాలా వద్దా? అన్నది ప్రభుత్వం చేతిలోనే ఉంటుందని వివరించారు. ఈ క్రమంలో ప్రభుత్వం జారీచేసిన జీవో 26ను పరిశీలించిన ధర్మాసనం.. అది సాధారణ ఉత్తర్వులా ఉందని, ప్రాథమికంగా పరిశీలిస్తే జీవో 6 (2007)కు విరుద్ధంగా ఉన్నట్టు కనిపిస్తోందని పేర్కొంది. పాత ఫీజులు కొనసాగించాలన్న ప్రభుత్వ నిర్ణయంతో పిటిషనర్ (సీబీఐటీ)కు ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొంది. టీఏఎఫ్ఆర్సీ నిర్ణయించిన ఫీజులు వసూలు చేసుకోవడానికి సీబీఐటీని అనుమతించాలని ఈఏపీసెట్ కన్వీనర్‌ను ఆదేశించింది. ఈ వ్యవహారంలో వివరణ ఇవ్వాలంటూ ప్రతివాదులైన ఉన్నత విద్యాశాఖ, టీఏఎఫ్ఆర్సీ, ఉన్నత విద్యా మండలి, ఉస్మానియా యూనివర్సిటీ, ఈఏపీసెట్ కన్వీనర్‌లకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ 30కి వాయిదా పడింది. కోర్టు మధ్యంతర ఉత్తర్వులపై డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్టు తెలిసింది.

ఫీజుల పెంపుకోసం మరిన్ని పిటిషన్లు..

మరికొన్ని ప్రైవేటు కాలేజీలు కూడా ఫీజుల పెంపు కోసం గురువారం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్లు దాఖలు చేశాయి. వాటిపై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం.. ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపుపై తగిన సమయంలోగా నిర్ణయం తీసుకోలేరా అని టీఏఎఫ్ఆర్సీపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫీజుల అంశం ఓ ప్రహసనంలా మారిందని, కౌన్సెలింగ్ పూర్తయి, తరగతులు ప్రారంభమవుతున్నా ఫీజులపై తేల్చడం లేదని పేర్కొంది. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కొన్ని కాలేజీలు 70శాతం వరకు ఫీజు పెంపును కోరుతున్నాయని, విద్యార్థులపై భారం పడుతుందని నివేదించారు. వాదనలు విన్న ధర్మాసనం.. విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

సర్పంచ్ పదవులకు 100% రిజర్వేషన్ సరికాదు

షెడ్యూల్డ్ ప్రాంతాల్లో రిజర్వేషన్లపై హైకోర్టులో పిటిషన్

రాష్ట్రంలోని షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అన్ని గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవులను గిరిజనులకే రిజర్వు చేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లికి నాన్‌ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ ఈ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది రమణారెడ్డి వాదనలు వినిపిస్తూ.. షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని గ్రామ పంచాయతీల్లో ఎస్టీలకే 100 శాతం రిజర్వేషన్ కల్పించడం సుప్రీంకోర్టు తీర్పులకు వ్యతిరేకమని పేర్కొన్నారు. అయితే పిటిషనర్ తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018ను సవాల్ చేస్తున్నారని, ఈ పిటిషన్‌ను విచారించే పరిధి సింగిల్ బెంచ్‌కు లేదని ధర్మాసనం పేర్కొంది. పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్‌కు బదిలీ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

కామలీలల కవ్వంపల్లి.. రాసలీలల రసమయి!

» మానకొండూర్‌లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పోస్టర్ వార్

» ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే మధ్య పోరు

కరీంనగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోస్టర్ వార్ కొనసాగుతోంది. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అనుచరుల మధ్య పరస్పర ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. 'కామలీలల కవ్వంపల్లి' అంటూ బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియాలో పోస్టు పెడితే.. 'రాసలీలల రసమయి' అంటూ కాంగ్రెస్ నేతలు ఓ పోస్టర్ విడుదల చేశారు. దీనికిపోటీగా బీఆర్ఎస్ నేతలు 'కమీషన్ల నారాయణ' అంటూ మరో పోస్టర్ విడుదల చేశారు. ఈ పోస్టర్ వార్‌కు ఓ రోడ్డు నిర్మాణం అంశం కారణం కావడం గమనార్హం. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గుండ్లపల్లి నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు 21 కిలోమీటర్లు డబుల్ రోడ్డు నిర్మించాలని స్థానికులు ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. 2022-23లో గుండ్లపల్లి బస్టాండ్ వద్ద ధర్నా చేశారు. అప్పటి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కారును అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో రసమయి బాలకిషన్ విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం డబుల్ రోడ్డును మంజూరు చేయగా.. గుండ్లపల్లి నుంచి గునుకుల కొండాపూర్ వరకు నిర్మాణం పూర్తయింది. తరువాత బిల్లులు చెల్లించడం లేదంటూ కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. తాజాగా ఈ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలంటూ ఈ నెల 12న ధర్నా చేపట్టాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పరస్పర ఆరోపణలు గుప్పించుకుంటున్నారు.

ఫోర్జరీతో ప్రవేశం

(మొదటిపేజీ తరువాయి)

అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గురవా రెడ్డి గత నెలలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన సీఐడీ చర్యలు తీసుకుంది. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు, హెచ్‌సీఏ కోశాధికారి శ్రీనివాసరావు, సీఈవో సునీల్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ యాదవ్, ఆయన భార్య కవితను బుధవారం అదుపులోకి తీసుకుంది. సీఐడీ అదనపు డీజీ చారు సిన్హా కథనం ప్రకారం.. శ్రీచక్ర క్రికెట్ క్లబ్ (గౌలిపురా క్రికెట్ క్లబ్) ఒకప్పటి అధ్యక్షుడైన కృష్ణయాదవ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి సృష్టించిన పత్రంతో జగన్మోహన్ హెచ్‌సీఏలోకి ప్రవేశించారు. కృష్ణయాదవ్ సంతకం ఫోర్జరీ చేయడానికి శ్రీచక్ర క్రికెట్ క్లబ్ ప్రస్తుత అధ్యక్షురాలు కవిత, ఆమె భర్త, క్లబ్ కార్యదర్శి, కృష్ణయాదవ్ సోదరుడైన రాజేందర్ యాదవ్ సహకరించారు. ఫోర్జరీ పత్రం ఆధారంగా హెచ్‌సీఏలోకి ప్రవేశించిన జగన్మోహన్‌రావు, ఆ తర్వాత అధ్యక్షుడు అయ్యారు. జగన్మోహన్‌రావు హెచ్‌సీఏ అధ్యక్షుడైన తర్వాత అక్కడి ఆఫీసు బేరర్లు అయిన కోశాధికారి జేఏస్ శ్రీనివాసరావు, సీఈవో సునీల్ కాంటేతో కలిసి హెచ్‌సీఏ నిధులను దుర్వినియోగం చేశారు. అంతేకాక, వీరంతా కలిసి కాంప్లిమెంటరీ టికెట్ల కోసం సన్‌రైజర్ హైదరాబాద్ ఫ్రాంచైజీని బెదిరింపులకు గురి చేశారు. ఉప్పల్ స్టేడియంలోని వీఐపీ బాక్స్‌కు తాళం వేసి ఆ ఫ్రాంచైజీని బ్లాక్‌మెయిల్ చేశారు. నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన సీఐడీ అధికారులు గురువారం రిమాండ్‌కు తరలించారు. అంతకు ముందు నిందితులందరికీ గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం కుషాయిగూడలోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోర్టులో హాజరుపరిచారు. కాగా, ఫోర్జరీ డాక్యుమెంట్ సాయంతో జగన్మోహన్‌రావు హెచ్‌సీఏ అధ్యక్షుడు అయ్యారని సీఐడీ విచారణలో తేలిన నేపథ్యంలో.. ఆయన ఎన్నిక ప్రశ్నార్థకం అయింది.

హెచ్‌సీఏలోకి అక్రమంగా ప్రవేశించిన జగన్మోహన్‌రావు నిబంధనలకు విరుద్ధంగా పలు టెండర్లను తమకు అనుకూలమైన వారికి ఇవ్వడం ద్వారా కోట్లాది రూపాయల అక్రమాలకు పాల్పడ్డారని రిమాండ్ రిపోర్టులో సీఐడీ అధికారులు పేర్కొన్నారు. బీసీసీఐకు సంబంధించిన రూ.170 కోట్ల నిధులు ఖర్చు చేశారని, ఇందులో చాలా వరకు నిధుల దుర్వినియోగం అయ్యాయని వెల్లడించారు. 2023-24లో జరిగిన 17,18 ఐపీఎల్ మ్యాచ్‌లకు సంబంధించిన టెండర్లలో అక్రమాలు జరిగాయన్నారు. హెచ్‌సీఏ అధ్యక్షుడి హోదాలో జగన్మోహన్‌రావు టెండర్ల నిబంధనలు పాటించలేదని, ఇతనికి సీఈఓ, కోశాధికారి సహకరించారని వివరించారు. క్రీడా పరికరాలకు సంబంధించిన నివేదికలను కూడా హెచ్‌సీఏ పెద్దలు మార్చేశారని రిపోర్టులో సీఐడీ అధికారులు పేర్కొన్నారు. కాగా, అవినీతికి పాల్పడిన హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు, ఇతర సభ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే గడ్డం వినోద్ డిమాండ్ చేశారు.

డిప్యూటీ కలెక్టర్ అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

రైతు భూమిని నిమ్జ్ కోసం సేకరించారు. ఇందుకు సంబంధించిన పరిహారం ఇప్పించేందుకు రూ.5లక్షలు ఇవ్వాలని నిమ్జ్ అధికారులు డిమాండ్ చేశారు. డ్రైవర్ దుర్గయ్య ఇందుకు మధ్యవర్తిత్వం వహించాడు. అయితే, తాను అంత ఇచ్చుకోలేనని, రూ.75 వేలు ఇస్తానని రైతు ఒప్పుకొన్నాడు. ఈ భూమికి సంబంధించి పరిహారం గత నెల 6న రైతు ఖాతాలో జమ అయింది. ఆ తర్వాత నుంచీ అధికారులు తరచూ రైతుకు ఫోన్ చేసి, డబ్బులు ఇవ్వాలని ఇబ్బందులకు గురి చేశారు. దీంతో సదరు రైతు గత నెల 26న ఏసీబీని ఆశ్రయించారు. పక్కా ప్రణాళికతో గురువారం డ్రైవర్ దుర్గయ్యకు రైతు రూ.65వేలు అందించారు. ఆ డబ్బును కార్యాలయంలోకి తీసుకొచ్చిన దుర్గయ్య.. డిప్యూటీ కలెక్టర్‌కు రూ.50వేలు, డిప్యూటీ తహసీల్దార్‌కు రూ.15వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. రూ.65 వేలు స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

అమ్మో.. సూపర్‌బగ్స్

(మొదటిపేజీ తరువాయి)

యాంటీబయాటిక్స్ వాడేస్తుంటారు. అలాంటి సందర్భాల్లో కూడా సూక్ష్మజీవులు ఔషధ నిరోధకతను సంతరించుకుంటాయి. అలాంటివాటినే సూపర్ బగ్స్ అంటారు. నాలుగైదు రకాల యాంటీబయాటిక్స్‌కు నిరోధకత సంతరించుకుని సూపర్‌బగ్‌గా మారిన ఆ బ్యాక్టీరియా వేరేవారికి సోకితే.. వారికి ఆ 4-5 రకాల యాంటీబయాటిక్స్ ఔషధాలు ఇచ్చినా పని చేయవు. వేరే యాంటీబయాటిక్ ఔషధం ఏదైనా ఇవ్వాల్సి ఉంటుంది. యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ ఔషధాలకూ ఇదే సూత్రం వర్తిస్తుంది. మన నిర్లక్ష్యం కారణంగానే కాక.. వ్యవసాయంలో, పశుసంవర్ధక రంగంలోనూ యాంటీబయాటిక్స్ వినియోగం అధికం కావడం కూడా ఈ సూపర్ బగ్స్ పెరుగుదలకు కారణమవుతోందని హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి కన్సల్టెంట్ మైక్రోబయాలజిస్ట్ డాక్టర్ సంచితా మిత్రా వివరించారు. ఏదైనా బ్యాక్టీరియా/వైరస్/ఫంగస్ సూపర్ బగ్‌గా మారితే.. ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న యాంటీబయాటిక్స్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ ఔషధాల్లో చాలావరకూ వాటిపై ఎటువంటి ప్రభావం చూపవని ఆమె ఆందోళన వెలిబుచ్చారు.

చివరి దశ ఔషధం..



డాక్టర్ సంచిత

మానవాళికి అందుబాటులో ఉన్న పలు రకాల యాంటీబయాటిక్ ఔషధాలకు సైతం లొంగని ఈ-కొలి రకం గ్రామ్ నెగెటివ్ బ్యాక్టీరియాపై బ్రహ్మాస్త్రంగా, చివరి దశ ఔషధంగా కోలిస్టిన్‌ను వాడతారు. అత్యవసర సమయాల్లో రోగుల ప్రాణాలు కాపాడడానికి వాడాల్సిన ఇలాంటి ఔషధాలను కొన్ని ఆస్పత్రుల్లో విచ్చలవిడిగా వాడేయడం వల్ల.. దానికి కూడా లొంగని సూపర్‌బగ్స్ తయారవుతాయనే ఆందోళన వైద్యనిపుణుల్లో వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే.. యాంటీబయాటిక్స్‌ను బాధ్యతతో ఉపయోగించడానికి చాలా ఆస్పత్రులు స్టీవార్డ్‌షిప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని డాక్టర్ సంచిత తెలిపారు. అందులో భాగంగా.. ఔషధం ఎంపిక, మోతాదు , ఉపయోగించే వ్యవధి, వాడే పద్ధతి వంటివాటిని వైద్యులు నిర్ణయిస్తారని.. తమ క్లినిక్‌లో ఏదైనా అంటువ్యాధిని గుర్తించినప్పుడు.. స్టీవార్డ్‌షిప్ విధానంలో సూచించిన తొలి దశ యాంటీబయాటిక్ మందులు వాడతారని వివరించారు. దానికి రోగి స్పందించకపోయినా, అంటువ్యాధి తీవ్రమైనా రెండో దశ ఔషధానికి మారతారని చెప్పారు. దీని వల్ల.. మానవాళిని కాపాడుతున్న యాంటీబయాటిక్ ఔషధాల ప్రభావం పోకుండా కాపాడుకోగలుగుతామని పేర్కొన్నారు.

శుభ్రత.. వ్యర్థాల నిర్వహణ కీలకం..

ఆస్పత్రిలో వ్యాధులు వ్యాపించకుండా ఉండటానికి కేవలం మందులు, శస్త్రచికిత్సలు మాత్రమే కాక.. చేతుల శుభ్రత కూడా కీలకమేనని డాక్టర్ సంచిత తెలిపారు. ఆస్పత్రులు తమ సిబ్బందికి సరైన రీతి లో టీకాలు వేయించాలని.. వారి దుస్తులు, రోగుల పడకలపై వేసే దుప్పట్ల వంటివి శుభ్రంగా ఉండాలని చెప్పారు. ఆస్పత్రి వ్యర్థాల్లో ఉండే యాంటీబయాటిక్, యాంటీ మైక్రోబియల్ ఔషధాల అవశేషాలు కూడా సూపర్‌బగ్స్‌కు కారణమవుతాయని.. కాబట్టి వినియోగించిన తర్వాత మిగిలిన యాంటీబయాటిక్ స్ట్రిప్స్, గడువు ముగిసిన, ముగియబోతున్న మందులను ఆస్పత్రి మురుగునీటి వ్యవస్థలో పారవేయవద్దని డాక్టర్ సంచిత సూచించారు. ఆ వ్యర్థాలను జీవ వైద్య వ్యర్థ నిర్వహణ కేంద్రాలకు పంపించాలన్నారు. అలాగే.. మెడికేటెడ్ సబ్బులు, ఫ్లోర్ క్లీనర్లు, సిరప్‌లు, ఇతర మందుల మిగులు భాగాలను మురుగు నీటిలో పారవేయడం వల్ల అనేక యాంటీ మైక్రోబియల్ రసాయనాలు పర్యావరణంలో కలుస్తున్నాయని.. అలా చేయొద్దని ఆమె హెచ్చరించారు. వైద్య పరిజ్ఞానంతో పాటు వ్యర్థాల నిర్వహణ, శుభ్రత, స్టీవార్డ్‌షిప్ ప్రోగ్రాములను పాటించడం వల్లనే సూపర్ బగ్స్ నుంచి కాపాడుకోగలమని స్పష్టం చేశారు.

ఆంధ్రజ్యోతి జర్నలిజం కళాశాల

రేపటి జర్నలిస్టులకు ఆహ్వానం

అర్హతలు

- ఇంగ్లీషు భాషలో వ్యవహారజ్ఞానం, తెలుగులోకి అనువాదం చేయగలిగిన నేర్పు.
- వర్తమాన వ్యవహారాలపై ఆసక్తి, అవగాహన.
- సరళమైన తెలుగులో రాయగలగడం.
- చక్కటి భావవ్యక్తీకరణ, డిగ్రీ ఉత్తీర్ణత.
- 35 సంవత్సరాలకు మించని వయసు.

దరఖాస్తు విధానం

- మీలో పై అర్హతలన్నీ ఉంటే పూర్తి పేరు, వయసు, విద్యార్హతలు, సాంకేతిక అర్హతలు, ఉద్యోగానుభవం, ఆసక్తులు వగైరా వివరాలన్నిటితో దరఖాస్తు చేయాలి.
- దరఖాస్తుకు సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు, ఇటీవల తీసుకున్న రెండు ఫొటోలు జతపరచాలి.
- దరఖాస్తులోను, కవరుపైన మీ పూర్తి చిరునామా, మొబైల్ నెంబర్, ఈ-మెయిల్, పరీక్ష రాయదలచుకున్న కేంద్రం స్పష్టంగా రాయాలి.
- రాతపరీక్ష, ఇంటర్వ్యూ వివరాలు ఫోన్ ద్వారా మాత్రమే తెలియపరుస్తాం. అందువల్ల మీరు ఎప్పుడూ అందుబాటులో ఉండే మొబైల్ నెంబర్‌నే దరఖాస్తులో ఇవ్వాలి.

★ మీ రాష్ట్రప్రభుత్వ పనితీరుపై మీ అభిప్రాయం తెలియపరుస్తూ సొంతంగా రాసిన వ్యాసాన్ని దరఖాస్తుకు తప్పనిసరిగా జతచేయాలి. వ్యాసంలేని దరఖాస్తులను పరిశీలించం.

ఎంపిక

- అభ్యర్థుల ఎంపిక రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా జరుగుతుంది.
- రాతపరీక్షలో వర్తమాన వ్యవహారాలు, తెలుగు బాష, సాహిత్యం, అనువాద సామర్థ్యానికి సంబంధించిన ప్రశ్నలుంటాయి.
- అభ్యర్థుల ఎంపికలో ఆంధ్రజ్యోతి యాజమాన్యానిదే తుది నిర్ణయం.
- శిక్షణకు ఎంపికైన అభ్యర్థులు కనీసం మూడు సంవత్సరాలు పని చేస్తామని హామీపత్రం ఇవ్వాలి.

శిక్షణ

- ఎంపిక చేసిన అభ్యర్థులకు ఆంధ్రజ్యోతి జర్నలిజం కళాశాలలో కనీసం ఆరునెలల శిక్షణ ఉంటుంది.
- భాష, భావవ్యక్తీకరణ, వర్తమాన వ్యవహారాలపై అవగాహన, అనువాదం, ఎడిటింగ్‌లలో శిక్షణ ఉంటుంది.
- శిక్షణ ముగించుకున్నాక ట్రైనీ ఉద్యోగులుగా అవకాశం లభిస్తుంది.
- వారు ఆంధ్రజ్యోతి గ్రూపునకు చెందిన ఏ సంస్థలోనైనా, ఆంధ్రజ్యోతి యూనిట్లలో ఎక్కడైనా పని చేయడానికి సిద్ధంగా ఉండాలి.

వేతనం

శిక్షణ కాలంలో నెలకు రూ. 12,000

శిక్షణానంతరం ముఖ్యవిభాగాల్లో పని చేయడానికి అర్హులైన వారికి పనితీరును బట్టి రూ. 18,000 నుంచి 20,000

జిల్లా విభాగాల్లో పని చేయడానికి ఎంపికైన వారికి రూ. 16,000 నుంచి 18,000

పరీక్షాకేంద్రాలు

హైదరాబాద్, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి

దరఖాస్తులు చేరాల్సిన ఆఖరి తేదీ:

2025, జూలై 26



దరఖాస్తులు పంపవలసిన చిరునామా

ప్రిన్సిపాల్, ఆంధ్రజ్యోతి జర్నలిజం కళాశాల, ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం. 76, జూబ్లీహిల్స్ రోడ్డు నం. 70, హైదరాబాద్ - 500 033

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.